27-04-2024
శనివారం
కరీంనగర్

సంపుటి 07, సంచిక: 146
పేజీలు: 8+8
వెల రూ. 5.00


Published from:
Karimnagar, Hyderabad,
Khammam, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★







# రెండవ విడతలో 61% పోలింగ్

## లోక్‌సభ ఎన్నికల్లో త్రిపురలో 78.53, మణిపూర్‌లో 77.18 శాతం

**న్యూఢిల్లీ :** రెండో దశ లోక్‌సభ ఎన్నికల్లో శుక్రవారంనాడు 61 శాతం పోలింగ్ నమోదైంది. త్రిపుర రాష్ట్రంలో రికార్డుస్థాయిలో 78.53 శాతం పోలింగ్ నమోదుకాగా, మణిపూర్‌లో కూడా 77.18 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా రెండోదశ పోలింగ్ ప్రక్రియ ప్రశాతంగా పూర్తయిందని ఎన్నికల సంఘం ప్రకటించింది. 13 రాష్ట్రాలలోని 88 నియోజకవర్గాలలో ఓటర్లు తమ తీర్పును ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో నిక్షిప్తం చేశారు. ఐతే కొన్ని చోట్ల నకిలీ ఓటర్లు ఉన్నారంటూ ఫిర్యాదులు అందాయి. ఉత్తర ప్రదేశ్ మధురలోని కొన్ని గ్రామాలలో, రాజస్థాన్‌లోని బన్స్వారా, మహారాష్ట్రలోని పర్భనీలలో వివిధ సమస్యలపై ప్రజలు ఓటింగ్ ప్రక్రియను బహిష్కరించారు. ఐతే తర్వాత ఎన్నికల అధికారులు వారికి నచ్చజెప్పి ఓట్లు వేయించారు. మొత్తం ఏడు దశల్లో 18వ లోక్‌సభకు పోలింగ్ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్ణయించింది. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఆరు గంటలవరకూ కొనసాగింది. పలు రాష్ట్రాలలో విపరీతమైన వేడిగాలులు తీవ్ర ప్రతాపం చూపించాయ. మొదటి విడత పోలింగ్ ప్రక్రియ ఈనెల 19న జరిగింది. 21 రాష్ట్రాల్లో 102 లోక్‌సభస్థానాలకు తొలివిడత పోలింగ్ పూర్తయింది. రాత్రి ఏడు గంటల సమయానికి తాత్కాలిక సమాచారం ప్రకారం 60.96 శాతం మేరకు పోలింగ్ జరిగినట్లు తేలింది. ఈ శాతం మరికొంతమేరకు పెరిగే అవకాశం కూడా ఉంది. చివరి గంట వరకూ ఓటర్లు పోలింగ్ బూత్‌లకు వచ్చి తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారని ఎన్నికల సంఘం చెప్పింది. ఈ రెండో విడత పోలింగ్‌లో త్రిపురలో భారీస్థాయిలో ఓటింగ్ నమోదైంది. మణిపూర్ రెండోస్థానంలో నిలిచింది. ఉత్తర ప్రదేశ్‌లో 53.71శాతం, మహారాష్ట్రలో 53.84 శాతం పోలింగ్ నమోదైంది. కేరళలోని మొత్తం 20 నియోజకవర్గాలకూ రెండో విడతలోనే పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. కాగా కర్ణాటకలోని మొత్తం 28 తరువాయి 2లో



# వివిప్యాట్ స్లిప్‌ల లెక్కింపు కుదరదు

## సుప్రీంకోర్టు స్పష్టీకరణ


### క్రాస్ చెకింగ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లు కొట్టివేత

**న్యూఢిల్లీ:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో నమోదైన అన్ని ఓట్లనూ నూటికి నూరుశాతం మేరకు వివిప్యాట్ (ఓటర్ వెరిఫయిబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)లతో క్రాస్ చెకింగ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో దాఖలైన పలు పిటిషన్లపై విచారణ ముగిశాక జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం శుక్రవారంనాడు తుది తీర్పు ప్రకటిస్తూ పిటిషన్లు అన్నింటినీ కొట్టివేసింది. సంపూర్ణంగా నూటికి నూరుశాతం అన్ని ఓట్లనూ వివిప్యాట్‌లతో సరిపోల్చి చూడటం సాధ్యం కాదని పేర్కొంది. ధర్మాసనం తన తుదితీర్పును వ్యాఖ్యల రూపంలో మూడు రోజుల క్రితమే వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలనే తీర్పురూపంలో శుక్రవారం ప్రకటించింది. ఇవిఎంలపై సందేహాలు ఉన్నంతమాత్రాన అలా సందేహించిన వారికి అనుకూలంగా తీర్పు చెప్పడం సాధ్యం కాదని కూడా విచారణ ముగిసిన అనంతరం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక వ్యవస్థను గుడ్డిగా అపనమ్మకంతో చూడటం లేనిపోని అనుమానాలకు దారితీస్తుందని తీర్పులో పేర్కొం ది. ''ప్రజాస్వామ్యం ఎప్పుడూ సామరస్యం నిర్మించేందుకే పోరాడుతుంది, అన్ని వ్యవస్థలమధ్య పరస్పర విశ్వాసం పాదుగొల్పేందుకు కృషి చేస్తుంది' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొం ది. న్యాయస్థానం రెండు మార్గదర్శకాలను ఈ సందర్భంగా జారీ చేసింది. స్ట్రాంగ్ రూములలో ఇవిఎం యూనిట్లను 45 రోజులపాటు భద్రపరచాలని జస్టిస్ ఖన్నా ఆదేశించారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రెండు మూడు స్థానాల్లో నిలిచే అభ్యర్థులు ఎవరైనా చేసే అభ్యర్థన మేరకు ఇవిఎం మాన్యుఫ్యాక్చర్లైన ఇంజనీర్లను కూడా ఈ యంత్రాలలోని మైక్రోకంట్రోలర్‌లను వెరిఫై చేయడానికి అనుమతించాలని సుప్రీంకోర్టు పేర్కొంది.''ఈ వెరిఫికేషన్ ఖర్చులన్నీ వెరిఫై చేయాలని కోరిన అభ్యర్థే భరించాలనీ, ఒకవేళ ఇవిఎం గనుక టాంపరింగ్ (తమకు అనుకూలంగా మార్పులు చేర్పులు జరగడం) జరిగినట్లు వెరిఫికేషన్‌లో వెల్లడైతే ఆ డబ్బును సదరు అభ్యర్థి తరువాయి 2లో

## ఇవిఎంలు నూటికి నూరుశాతం సేఫ్ : సిఇసి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై సందేహాలు వ్యక్తం చేస్తూ ఇప్పటికి అనేమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారనీ, ఈ విధంగా ఇప్పటికి వివిధ న్యాయస్థానాలు దాదాపు 40 సార్లు ఈ పిటిషన్లను తిరస్కరించాయని ఎన్నికల సంఘం అధికారులు చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల చెల్లుబాటు, వాటి విశ్వసనీయతపై గడచిన దశాబ్దాలుగా చాలామంది కోర్టులలో పిటిషన్లు దాఖలు చేశారనీ, ప్రతిసారీ ఈ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయనీ భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు. ఇవిఎంలు నూటికి నూరుపాళ్ళు ఎంతో సురక్షితమైనవని ఆయన అన్నారు. ''ఇవిఎంలు నూటికి నూరుశాతం సేఫ్'' అని ఆయన అన్నారు. ఈ యంత్రాలు చాలా న్యాయబద్ధంగా పనిచేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువడిన అనంతరం రాజీవ్ కుమార్ పత్రికాగోష్ఠిలోమాట్లాడుతూ, కోర్టు ప్రధానంగా చెప్పిన సారాంశాన్ని వివరించారు. బ్యాలట్ పత్రాల కాలం నాటికి తిరిగి వెళ్ళడం సాధ్యం కాదని ఆయన అన్నారు. సుప్రీంకోర్టుతోపాటు గతంలో హైకోర్టులు కూడా ఈ విధమైన పిటిషన్లను తిరస్కరించాయని ఆయన గుర్తుచేశారు.

## వివిప్యాట్‌లపై ప్రచారం ఆగదు : కాంగ్రెస్



ప్రజల్లో విశ్వాసం పెంచేవిధంగా వివిప్యాట్‌ల సంఖ్య పెంచాలని తాము చేసే ప్రచారం ఆగదని, తమ ప్రచారాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్‌పార్టీ స్పష్టం చేసింది. ఇవిఎంలలో ఉన్న ఓట్లన్నింటినీ వివిప్యాట్‌లలో సరిపోల్చి చూడటం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేశాక కాంగ్రెస్‌పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ విషయంలో తమ ప్రచారం ఆగదన్నారు. ఎందుకంటే ఈ విషయంలో తాము కోర్టుకు వెళ్ళలేదని అన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన వారిలో కాంగ్రెస్‌పార్టీ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ భాగస్వామిగా లేదని ఆయన అన్నారు. వివిప్యాట్‌ల సంఖ్య పెంచాలని కోరారు.నూటికి నూరుశాతం క్రాస్ చెకింగ్ జరగాలన్నారు.

## ప్రతిపక్షాలకు చెంపపెట్టు : మోదీ



సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ నాయకత్వానగల ప్రతిపక్షాలకు చెంపపెట్టు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. బీహార్‌లోని అరారియా, ముంగేర్ లోక్‌సభ నియోజకవర్గాలలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఇవిఎంలకు వ్యతిరేకంగా పాపానికి ఒడిగట్టి ప్రజల్లో అపనమ్మకం సృష్టించినందుకు గాను కాంగ్రెస్ సారథ్యానగల ప్రతిపక్షాలన్నీ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇవిఎంలను అన్నింటినీ వివిప్యాట్‌లతో సరిపోల్చి చూడటం సాధ్యంకాదంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పున ప్రధానమంత్రి స్వాగతించారు. ఓబిసిలకు, ఎస్‌సిలకు, ఎస్‌సిలకు ఉద్దేశించిన రిజర్వేషన్లను ప్రతిపక్షాలు తస్కరించాలని ప్రయత్నం చేస్తున్నాయని ప్రధానమంత్రి మరోసారి విమర్శించారు.

# హామీల అమలే ముఖ్యం

### ఆగస్టు 15లోగా రుణమాఫీ, ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

### అప్పుడే నా రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇస్తా

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



ప్రజాపక్షం/హైదరాబాద్

తనకు ఎంఎల్‌ఎ పదవి కంటే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయించడమే ముఖ్యమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ఒకవేళ హామీలు అమలు చేస్తే తన తరువాయి 2లో



# కడుపుకట్టుకుని అయినా రుణమాఫీ చేస్తాం

### రూ.40 వేల కోట్లు అయినా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం

### హరీశ్ రావు రాజీనామాకు రెడీగా ఉండాలి

### మోసం చేయాలనుకున్నప్పుడే అమరుల స్థూపం గుర్తుకొస్తది

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, కెటిఆర్ కుట్రలను లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి తిప్పికొట్టాలని, కాంగ్రెస్ సైనికులు అవిశ్రాంతంగా పోరాడాలని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రైతుల రుణమాఫీ నిమ్మితం రూ.30 వేల కోట్లు నుంచి రూ. 40 వేల కోట్లయినా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, కాళేశ్వరంలో కెసిఆర్ కుటుంబం తిన్న రూ.లక్ష కోట్ల కంటే, రుణమాఫీ సొమ్ము ఎక్కువేమీ కాదని, ఒక తరువాయి 2లో

## నేతన్నల ఆత్మహత్యలపై బిఆర్‌ఎస్ శవ రాజకీయాలు

ప్రజాపక్షం/హైదరాబాద్





నేతన్నల ఆత్మహత్యలపై బిఆర్‌ఎస్ శవ రాజకీయాలు చేస్తోందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. నేతన్నల చావులకు గత బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనే కారణమని ఆరోపించారు. నేతన్నలు ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, నేతన్నల ఉత్పత్తులు కొనుగోలు చేస్తుందని భరోసా తరువాయి 2లో

## భగ్గుమంటున్న ఎండలు

### రాగల ఐదు రోజులు వడగాలులు

### బయటకు రావొద్దన్న వాతావరణ కేంద్రం



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు భగ్గమంటున్నాయి. మూడు రోజుల పాటు రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో రానున్న ఐదురోజుల పాటు వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ తరువాయి 2లో

# రాలుతున్న విద్యాకుసుమాలు

### కృత్రిమ పోటీ ప్రపంచాన్ని సృష్టిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలు

### విద్యార్థుల్లో ప్రేరణ, మనోధైర్యాన్ని నింపేదెవరు?

ప్రజాపక్షం / శ్రీరాంపూర్



దేశ భవిష్యత్తు నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించే విద్యా కుసుమాలు రెండు పదుల వయస్సు నిండకుండానే క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతూ మొగ్గలోనే రాలిపోతున్నారు. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, తరువాయి 8లో

## ఒకే రోజూ ఏడుగురు ఆత్మహత్య

తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల నేపథ్యంలో వేర్వేరు ఘటనల్లో ఏడుగురు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా దొరగారిపల్లెకు చెందిన తేజస్విని, తాండూరు మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన సాత్విక్, సంగారెడ్డి జిల్లా కొల్లూరుకు చెందిన సాయితేజ, హైదరాబాద్‌కు చెందిన హరిణి, ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన వైశాలి, మహబూబాబాద్ జిల్లా చిలుకోడు గ్రామానికి చెందిన చిప్పా భార్గవిలు ఉన్నారు. ఫెయిల్ అవుతాననే భయంతో సిద్దిపేట జిల్లా పాతూరుకు చెందిన శ్రీజ ఆత్మహత్య చేసుకోగా.. ఫలితాల్లో ఆమె పాస్ అయినట్టుగా వచ్చింది.



## శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉందాం

### జిన్‌పింగ్‌తో భేటీలో బ్లింకెన్ వెల్లడి




బీజింగ్ : చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, విదేశాంగమంత్రి వాంగ్ యీలతో అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ శుక్రవారం సమావేశాలు జరిపారు. రెండు దేశాల సంబంధాల్లో సానుకూల అంశాలు చాలా ఉన్నప్పటికీ తమ దేశ కీలక ప్రయోజనాలకు భంగం కలిగే ప్రతికూల అంశాలు ఎక్కువగా ఉన్నాయని చైనావిదేశాంగమంత్రి వాంగ్ యీ బ్లింకెన్‌కు చెప్పారు. బ్లింకెన్ చైనాలో మూడు రోజుల పర్యటన సందర్భంగా రెండు దేశాల విదేశాంగ మంత్రులూ శుక్రవారంనాడు సమావేశం జరిపారు. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు, ఉక్రేన్‌కు సైనిక సహాయం నేపథ్యంలో బ్లింకెన్ చైనా పర్యటన జరిగింది. రష్యాకు ఉక్రేన్ విషయంలో చైనా అండగా ఉంటోందన్న విషయాన్ని తాను ప్రముఖంగా ఈపర్యటనలో ఆ దేశం దృష్టికి తెస్తానని బ్లింకెన్ పర్యటనకు ముందుగా చెప్పారు. ఆ మేరకు ఆఅంశాన్ని ఆయన జిన్‌పింగ్‌తో ప్రస్తావించారు.బీజింగ్‌లోని గ్రేట్ హాల్‌లో శుక్రవార ం మధ్యాహ్నం జిన్‌పింగ్‌తో బ్లింకెన్ సమావేశం జరిపారు. రెండు దేశాలమధ్య దౌత్య సంబంధాలు 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్లింకెన్ మాట్లాడుతూ రెండు దేశాల సంబంధాలూ ఒడిదొడుకులకు గురైన విషయం గుర్తు చేశారు. రెండు దేశాలూ ముఖ్యమైన గుణపాఠాలు నేర్చుకున్నాయన్నారు. రెండు దేశాలూ శత్రువులుగా కాకుండా స్నేహితులుగా ఉండాల్సిన అవసరం ఉంది, పరస్పర అభిప్రాయాలను గౌరవించుకుంటూ ఉమ్మడి ప్రయోజనాలకోసం రెండు దేశాలు పనిచేయాలన్న అభిప్రాయాలు నాయకులమధ్య వ్యక్తమైనట్లు జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. రెండు దేశాలమధ్య ఇటీవల సాధించిన పురోగతి, ససానుకూల అంశాలను కూడా జిన్‌పింగ్‌తో బ్లింకెన్ ప్రస్తావించారు.

## యూరప్‌లో అతిపెద్ద నకిలీ యూరో కరెన్సీ గ్యాంగ్ అరెస్ట్

**మాడ్రిడ్ :** యూరోప్‌లోఅతిపెద్ద నకిలీ కాయిన్ కరెన్సీ ముఠాను స్పెయిన్ పోలీసులు అరెస్టు చేశారు.వారి నుండి 8.60 లక్షల డాలర్ల విలువైన యూరో కాయిన్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 40 వేల కాయిన్స్‌ను స్వాధీనం చేసుకుని పదిమందిని అరెస్టు చేశారు. వీరంతా చైనా దేశానికి చెందినవారుగా గుర్తించారు. పోలీసులు ఈ ముఠా కోసం 2018 నుండీ వెతుకుతున్నారు. రెండు వర్క్‌షాపులను వీటి తయారీ కోసం ఈ ముఠా నడుపుతోంది. ఈ విధంగా ఈ ముఠా ఇప్పటికే 1,00,000 నకిలీ కాయిన్స్‌ను స్పెయిన్ మార్కెట్‌లో చెలామణీలోకి తీసుకురాగా, మరో 4,00,000 లక్షల కాయిన్స్‌ను యూరప్ మార్కెట్‌లో చెలామణీలోకి తీసుకువచ్చారు.

## 34 ఏళ్ళ కనిష్టస్థాయికి జపాన్ కరెన్సీ



టోక్యో : జపాన్ కరెన్సీ 'యెన్' 34 సంవత్సరాలలో ఎన్నడూలేనంత కనిష్టస్థాయికి క్షీణించింది. రెండు రోజులుగా జపాన్ అత్యున్నత బ్యాంక్ విధానపరమైన సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో శనివారంనాడు నూతన విధాన ప్రకటన బ్యాంక్ చేస్తుందని భావిస్తున్నారు. బ్యాంక్ ఆఫ్ జపాన్ ప్రకటన అనంతరం డాలరు కంటే కనిష్టస్థాయికి యెన్ క్షీణించిపోయింది. ఈ ఏడాదిలో డాలరుకంటే యెన్ అత్యధికంగా 9.7 శాతం మేరకు క్షీణించింది. కాగా యూరో కరెన్సీ గురువారంనాడు 0.3 శాతం మేరకు పెరిగింది.

ప్రపంచం

# బందీలను తక్షణమే విడుదల చేయండి

## హమాస్‌కు 17 దేశాలు డిమాండ్




టెల్‌అవీవ్ : ఇజ్రాయిల్‌కు చెందిన బందీలను వెంటనే విడుదల చేయాలని అమెరికా సహా 17 దేశాలు హమాస్ అగ్రనాయకత్వంపై శుక్రవారం ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించాయి. ఈ మేరకు ఈ దేశాలన్నీ ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ''200 రోజులు పైగా మీ దగ్గర బందీలు ఉన్నారు, వీరిలో మా దేశ ప్రజలు కూడా ఉన్నారు, వారిని తక్షణం విడుదల చేయండి'' అని 17 దేశాలు ఉమ్మడిగా డిమాండ్ చేశాయి. ఈ విధమైన చర్యల ద్వారా యుద్ధ విరమణకు అవకాశం లేకుండా చేస్తున్నారని ఆ దేశాలు విమర్శించాయి. అమెరికా, ఆస్ట్రియా, అర్జెంటైనా, బ్రెజిల్, కెనడా, బల్గేరియా, కొలంబియా, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, హంగరీ, పోలెండ్, పోర్చుగల్, సెర్బియా, రొమేనియా, స్పెయిన్, థాయ్‌లాండ్, బ్రిటన్ దేశాలు ఈ ఉమ్మడి ప్రకటనపై సంతకాలు చేసి ఈ లేఖను హమాస్‌కు మధ్యవర్తుల ద్వారా పంపారు. గత ఏడాది అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడిలో 1,200 మంది ఇజ్రాయిలీ ప్రజలను కాల్చి చంపారు. మరో 300 మందిని బందీలుగా తీసుకువెళ్ళారు. వీరిలో పలుదేశాల ప్రజలున్నారు. ఇంకా 103 మంది హమాస్ చెరలో బందీలుగా ఉన్నారు. ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించి 200 రోజులు పూర్తయిన నేపథ్యంలో హమాస్ అగ్రశ్రేణి నాయకత్వ ప్రతినిధి ఖలీల్ అల్ హయ్యా గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ 1967 నాటి సరిహద్దులతో పాలస్తీనా స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసి గుర్తింపు ఇస్తే ఐదేళ్ళు పాటు యుద్ధ విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఒక అమెరికా బందీ వీడియోనుకూడా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో 17 దేశాల ప్రకటన వెలువడింది.

**రఫాలో పెరిగిన దాడులు : కొరవడిన భద్రత**

పాలస్తీనా ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్న రఫా ప్రాంతంపై పూర్తిస్థాయిలో భూతల దాడులకు ఇజ్రాయిల్ సైన్యం సమాయత్తం అవుతున్నది. ఈ దిశగా ప్రజలకు హెచ్చరికలు చేస్తున్నది. తూర్పు రఫాలో ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో దాడులు కొనసాగుతున్నాయి. సైన్యం ముందుకు కదులుతోందని ఐడిఎఫ్ (ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్) సీనియర్ అధికారి ఒకరు శుక్రవారంనాడు చెప్పారు. రఫాలో హమాస్‌కు సంబంధించిన నాలుగు బెటాలియన్లు ఉన్నాయని ఐడిఎఫ్ అంచనాలు వేస్తున్నది. హమాస్‌కు అత్యంత సురక్షితమైన చిట్టచివరి ఆవాసం రఫా మాత్రమేననీ, రఫాను కూడా పూర్తిగా ధ్వంసం చేస్తామని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నేతన్యాహు చెబుతుంటే, మరోవైపు ఆయన పరిపాలనపై పాలనా యంత్రాంగంలోనే వ్యతిరేకత పెరుగుతున్నది. ప్రజల్లో తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. రఫాలో గనుక పూర్తిస్థాయిలో భూతల దాడులు చేస్తే మరో మాన విలయ సంభవిస్తుందని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల విభాగం ఇప్పటికే హెచ్చరించింది.

**గాజాలో అమెరికా కాజ్ వే నిర్మాణం**
**రోజుకు 20 లక్షల భోజనాలు సరఫరా**

గాజా తీరంలోకి మానవతా సహాయం తరలించేందుకు వీలుగగా ఒక కాజ్‌వేను అమెరికా సైన్యం నిర్మించడం ప్రారంభించింది. పెంటగాన్ వర్గాలు శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన చేశాయి. ఈ నిర్మాణం మే నాటికి పూర్తి అవుతుందనీ, అప్పటినుండీ మానవతాసహాయం పంపిణీకి ఇది అందుబాటులోకి వస్తుందనీ పెంటగాన్ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి ద్వారా కూడా ఈ కాజ్ వే మీదుగా మానవతా సహాయాన్ని తరలిస్తారని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ మేజర్ జనరల్ పాట్ రైడర్ ప్రకటించారు. ఈ కాజ్ వే పూర్తి ఐతే రోజుకు ఓడల ద్వారా 20 లక్షలభోజనాలను గాజా ప్రజలకు సరఫరా చేస్తామని అన్నారు. రోజుకు 150 ట్రక్కులను తరలించగల సామర్థ్యం ఈ కాజ్‌వేకు ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా పాలస్తీనా ప్రజలకోసం యూరోపియన్ యూనియన్ అదనంగా మరో 73 మిలియన్ డాలర్ల సహాయం ప్రకటించింది. దీంతో 2024వ సంవత్సరానికిగాను ఇప్పటివరకూ గాజా ప్రజలకు మానవతా సహాయం నిమితం యూరోపియన్ యూనియన్ 193 మిలియన్ యూరోలు సమకూర్చినట్లయింది.

## ట్రంప్ జైలుకు వెళతారా? లేదా?

### మళ్ళీ మొదటికొచ్చిన కేసు విచారణ!



న్యూయార్క్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ (77) విచారణ చేస్తున్న 12 మంది సభ్యులుగల జ్యూరీ సందిగ్ధంలో పడుతున్నది. అమెరికా చరిత్రలో నేరాలకు పాల్పడి కోర్టులో నిందితుడుగా నిలబడిన మొట్టమొదటి దేశాధ్యక్షుడుగా రికార్డు సృష్టించిన ట్రంప్‌పై ఇలా కేసులు పెట్టి విచారించవచ్చునా? లేదా? ఆయన వీటికి అతీతుడా? లేక శిక్షార్హుడా? అనే విషయంలో జ్యూరీ సభ్యులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ట్రంప్ ఈ ఏడాది చివరిలో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తూ ఉండటంతో ఈ విధంగా జూరీ సభ్యులు రెండు వైపులా విడిపోయి ఏకాభిప్రాయం వ్యక్తం చేయకపోతే అంతిమంగా ట్రంప్ ప్రయోజనం పొందుతారు. కానీ జ్యూరీ మాత్రం ఈ కేసును మళ్ళీ మొదటి నుండీ విచారణ జరపాలనే ఆలోచనలు కూడా చేస్తున్నది. మళ్ళీ ఈకేసును కింది కోర్టుకు పంపాలన్న ఆలోచనలు కూడా జ్యూరీలో వ్యక్తం అవుతున్నాయి. నిజంగా ట్రంప్ దోషి అని తేలితే ఒక్కొక్క కేసులో ఆయనకు నాలుగేళ్ళు తక్కువ కాకుండా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఐతే ట్రంప్ మాత్రం తాను నిర్దోషిననీ, రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసులు బనాయించారనీ, తాను అధ్యక్షుడుగా పని చేసినందువల్ల ఇలా తనపై విచారణ జరపకూడదనీ తనకు పూర్తి రక్షణ (ఇమ్యూనిటీ) ఉందనీ ట్రంప్ జ్యూరీ ఎదుట నాలుగు రోజులుగా వాదిస్తున్నారు. ఐతే ట్రంప్ కేసుల్లో వ్యక్తిగతమైనవి ఏవి? అధికారికంగా చేసిన తప్పులు ఏమిటనేది జ్యూరీ తేల్చాల్సి ఉంటుందని జస్టిస్ నెయిల్ గోర్సచ్ వ్యాఖ్యానించారు. 2020 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో ఓటమిని అంగీకరించకుండా పార్లమెంటు భవనంపై దాడి చేయడం, ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు అవినీతికి పాల్పడటంతోపాటు లైంగిక కార్యకలాపాలు చేయడం, వ్యాపారపరమైన అక్రమాలు, వాటిని కప్పిపుచ్చుకోవడానికి కోట్లాదిరూపాయలు లంచాలుగా ఇచ్చి అందరి నోళ్ళూ మూయించడం వంటి 34 రకాల కేసులు, సివిల్ కేసులు ట్రంప్ ఎదుర్కొంటున్నారు. ఆయనపై ఉన్న 13 రకాల క్రిమినల్ కేసులను చివరకు 10 కేసులకు కుదించారు. వీటిల్లో నాలుగు క్రిమినల్ కేసులు అతిముఖ్యమైనవి. ఎడల్ట్ ఫిలిమ్ స్టార్-డైరెక్టర్, హాలీవుడ్ నటి డేనియల్స్ అలియాస్ స్టీఫెనీ క్లిఫోర్డ్‌తో 2006లో లైంగిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. ఆమె స్వయంగా మీడియాకు ఈ విషయం చెప్పడంతో ట్రంప్ పరువు పోయింది. ఆమె నోరుమూయించడానికి ట్రంప్ లాయర్ మైఖేల్ కోహెన్ 2016 ఎన్నికలకు ముందు 1,30,000 డాలర్లు లంచంగా ఇచ్చారు. ఈ విషయాలన్నీ తర్వాత బయటపడటంతోపాటు ఆయన వ్యాపారాలకు సంబంధించిన రికార్డులు తారుమారు చేసిన 34 తీవ్రమైన కేసుల్లో ట్రంప్ నిందితుడుగా ఉన్నారు.

## నైజీరియా జైలు గోడ ధ్వంసం

### 119 మంది ఖైదీలు పరార్



**అబుజా :** నైజీరియా రాజధాని అబుజా సమీపంలో ఉన్న సులేజా పట్టణంలో పురాతన జైలు గోడలు బద్దలుకొట్టి 119 మంది ఖైదీలు పారిపోయారు. ఐతే వీరిలో 10 మందిని శుక్రవారం నాటికి అరెస్టు చేశారు. ఇంకా 109 మంది ఖైదీలు పరారీలో ఉన్నారు. పురాతనమైన జైలు గోడలు బలహీనంగా ఉండటంతో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ఖైదీలు ఉమ్మడిగా కృషి చేసి గోడలు బద్దలుకొట్టి పారిపోయారు. గడచిన బుధవారంనాడు ఈ ఘటన జరిగింది. నైజీరియా ప్రిజన్ సర్వీస్ విభాగం అధికార ప్రతినిధి అడమూ డుజా పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ జైలు బ్రిటీష్ కాలంనాటిదనీ, అనేక గంటలుగా భారీ వర్షాలు కురవడంవల్ల జైలు గోడలు అప్పటికే బలహీన పడ్డాయనీ, ఇది వారు పారరిపోవడానికి దారితీసిందనీ వివరణ ఇచ్చారు. వారికోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు చెప్పారు. ఈ ఖైదీలను పట్టుకోవడానికి ప్రజలు కూడా సహకరించాలనీ, సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

## ఎమ్మెల్యే కాకపోయినా హరీశ్‌రావును మంత్రిని చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎమ్మెల్యే కాకపోయినప్పటికీ హరీశ్ రావును మంత్రిని చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ యువతను రెచ్చగొట్టేలా పెట్రోల్ పోసుకుని, అగ్గిపెట్టె మరిచి పోయిన చరిత్ర హరీశ్ రావుదని ఎద్దేవా చేశారు. టిఆర్ఎస్ నాయకులు రెచ్చగొట్టడంతోనే 1200 మంది అమరులయ్యారని, ఇందులో కేవలం 400 మందిని మాత్రమే బిఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకున్నదని, మిగిలిన 800 మందిని విస్మరించిన చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వానిదని విమర్శించారు. అమరుల త్యాగాల పునాదుల మీద రాజ్యమేలి రాక్షసానందం పొందిన హరీశ్‌రావుకు అమరవీరుల స్థూపం వద్ద రాజీనామా డ్రామాలాడే నైతిక హక్కు లేదన్నారు. ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. పంద్రాగస్టు నాటికి సిఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ అమలు చేసి తీరుతారని బండి సుధాకర్ అన్నారు.

## లెక్కింపు కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి చెల్లిస్తారని కూడా స్పష్టం చేసింది. ఒక ఇవిఎంలోమూడదు యూనిట్లు ఉంటాయి. బ్యాలట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివిప్యాట్. ఈ మూడు కూడా ఒకదానితో మరొకటి సాంకేతికంగా మైక్రో కంట్రోలర్స్ ద్వారా అనుసంధానమై ఉంటాయి. ప్రస్తుతం ఎన్నికల సంఘం వివిప్యాట్ స్లిప్పులను ఇవిఎంలతో ర్యాండమ్ వెరిఫికేషన్ చేస్తున్నది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పోలింగ్ బూత్‌లలో మాత్రమే వీటిని జతపరచి చూస్తున్నది. వివిప్యాట్ స్లిప్పులను లెక్కించడానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలనుఉపయోగిస్తున్నారా? లేక ఎన్నికల గుర్తులకు సంబంధించిన బార్ కోడ్‌లను పరిశీలించడానికి చూస్తున్నారా? అనే విషయాన్ని కూడా ఎన్నికల సంఘం అధికారులు పరిశీలించాలని ధర్మాసనం సూచించింది. బ్యాలట్ పత్రాల విధానానికి మళ్ళాలన్న పిటిషన్లు అన్నింటినీ కూడా తిరస్కరించినట్లు జస్టిస్ ఖన్నా చెప్పారు. ఈనెల 24న ధర్మాసనం విచారణ ముగించిన సందర్భంగా, ఎన్నికల వ్యవస్థను తాము నియంత్రించలేమని వ్యాఖ్యానించింది. ఇవిఎంలపై సందేహించినంత మాత్రాన తాము ఉత్తర్వులు ఇవ్వలేమని కూడా పేర్కొంది. ఈ విధంగా పిటిషన్లువేసిన వారిలో ప్రధానంగా ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలకోసం పోరాటం చేస్తున్న ఎడిఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్) సంస్థ ఉంది.

## 61% పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకుగాను 14 నియోజకవర్గాలలో పోలింగ్ జరిగింది. రాజస్థాన్‌లో 13 నియోజకవర్గాలలో, మహారాష్ట్రలో ఎనిమిది నియోజకవర్గాలలో, ఉత్తర ప్రదేశ్‌లో ఎనిమిది నియోజకవర్గాలలో ఈ రెండో విడత పోలింగ్ పూర్తయింది. మధ్యప్రదేశ్‌లో 6 నియోజకవర్గాలలో, అసోంలో 5 నియోజకవర్గాలలో, బీహార్‌లో ఐదు నియోజకవర్గాలలో, చత్తీస్‌గఢ్‌లో మూడు నియోజకవర్గాలలో, పశ్చిమ బెంగాల్‌లో 3 నియోజకవర్గాలలో, మణిపూర్, త్రిపుర, జమ్మూ కశ్మీర్‌లలో ఒక్కొక్క నియోజవర్గంలోనూ పోలింగ్ పూర్తయింది. వివిధ రాష్ట్రాలలో ఓటు హక్కు ఉపయోగించుకున్న ప్రముఖులలో కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్, కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్, నటుడు, రాజకీయనాయకుడు అరుణ్ గోవిల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సోదరుడు డి.కె.సురేశ్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి (జెడిస్) తదితరులు ఉన్నారు. అదే విధంగా ఈసారి బిజెపికి చెందిన అభ్యర్థులు హేమ మాలిని, ఓం బిర్లా, గజేంద్ర సింగ్ షెకావత్ హాట్రిక్ సాధించేందుకు ఉవ్విళ్ళూరు తున్నారు ''రెండో దశ ఎన్నికల ప్రక్రియ చాలా బాగా జరిగింది'' అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ట్వీట్ చేశారు.

# రుణమాఫీ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరం కడుపు కట్టుకుని అయినా రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలతో హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ తాను ఉంటే తమ కుట్రలు సాగబోవని కెసిఆర్, కెటిఆర్ భావిస్తున్నారన్నారు. మోసం చేయాలనుకునే ప్రతిసారీ హరీశ్‌రావుకు అమరవీరుల స్తూపం గుర్తుకొస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హరీశ్‌రావు తెలివి ప్రదర్శిస్తున్నారని, ఆయన తెలివి అరికాళ్లకు జారినట్టుగా ఉన్నదన్నారు. పంద్రాగస్టులోగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతామని, హరీశ్ రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజునే సిద్దిపేటకు పట్టిన శని వదిలిపోతుందని ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లు ఎప్పుడైనా హరీశ్‌రావు అమరుల స్తూపం దగ్గరకు వెళ్లారా అని ప్రశ్నించారు. చాంతాడంత లేఖ రాసుకొచ్చి రాజీనామా లేఖ అంటున్నారని, తన మామ చెప్పిన సీస పద్యమంతా ఆ లేఖలో రాసుకొచ్చారని ఎద్దేవా చేశారు. స్పీకర్ ఫార్మెట్‌లో రాజీనామా లేకపోతే ఆ రాజీనామా చెల్లుబాటు కాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

రిజర్వేషన్లు రద్దు చేయాలన్నదే బిజెపి విధానమని రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఆనాడు బ్రిటీషర్లు సూరత్ చేరుకుని క్రమంగా దేశమంతా ఆక్రమించుకున్నారని, ఇప్పుడు కూడా సూరత్ వ్యాపారులు దేశాన్ని ఆక్రమిస్తున్నారని విమర్శించారు. బిజెపి అంటే బ్రిటీష్ జనతా పార్టీ అని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్ల తరహా బిజెపి వారికి రిజర్వేషన్లు నచ్చవన్నారు. కార్పొరేట్ కంపెనీల కుట్రలో భాగంగా రిజర్వేషన్లు రద్దు చేయాలని బిజెపి భావిస్తోందన్నారు. ఇప్పటికే రూ.60 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సంస్థలను మోదీ ప్రభుత్వం విక్రయించిందని, 13 మంది ప్రధానులు చేసిన అప్పు కంటే రెట్టింపు అప్పు చేశారని దుయ్యబట్టారు.

## హామీల అమలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇస్తానని, అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి తన సిఎం పదవికి రాజీనామా చేసిన లేఖను గవర్నర్‌కు ఇవ్వాలని పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు తన రాజీనామా లేఖతో హైదరాబాద్, గన్‌పార్క్‌లోని అమరుల స్తూపం వద్దకు శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా అమలరవీరు స్తూపానికి నివాళ్లులు అర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 15లోపు రుణమాఫీ, ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్న హామీల అమలుపై సిఎం అమరవీరుల స్తూపం వద్దకు రావాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సిఎం అయ్యాక ఏ రోజు కూడా అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించలేదన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండు పేపర్లపై రాసిచ్చారని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయించడమే ప్రధాన ప్రతిపక్షంగా తమ కర్తవ్యమని చెప్పారు. రాజకీయాల కంటే పేద ప్రజల ప్రయోజనాలు తమకు ముఖ్యమని, రూ.4వేల పెన్షన్, రైతులకు రూ.15వేల రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ అందించాలని, వరి, మక్కలకు రూ.500 బోనస్ ఇవ్వాలని, మహిళలకు రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దేవుళ్లపై ప్రమాణాలు చేసి ప్రజలను మోసగించే యత్నం జరుగుతుందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాండు పేపర్లపై రాసిచ్చారని, ప్రజలకు రేవంత్ ఇచ్చిన హామీలు నిజమైతే గన్‌పార్క్ వద్దకు రావాలని అన్నారు. కాగా హరీశ్ రావు తన రాజీనామా లేఖలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీల అమలు, ఇందిరమ్మ హౌజింగ్ స్కీమ్ కింద రూ. 5లక్షల నిధులు, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, యువ వికాస్ పేరుతో రూ.5 లక్షల విలువ చేసే యువ వికాస స్కీమ్, ప్రతి రెవెన్యూ మండలానికి ఇంటర్ నేషనల్ స్కూల్‌కు మంజూరు, ఆసర పెన్షన్ల పెంపు, తదితర అంశాలను కూడా రాజీనామా లేకలో పొందపరుస్తూ హరీశ్‌రావు సంతకం పెట్టారు. హరీశ్‌రావు వెంట ఎంఎల్ఎలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేశ్, కె.పి.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.



## అమరవీరుల చావుకు హరీశ్‌రావు కారణం

### ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమరవీరుల చావుకు కారణమైన వ్యక్తి మాజీ మంత్రి హరీష్ రావు అని కాంగ్రెస్ ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిరుద్యోగులను,యువతను పొట్టన పెట్టుకున్న హరీశ్ రావు, అమరవీరుల స్తూపం వద్దకు రావడంతో ఈ ప్రాంతం మైల పడిందన్నారు. హరీశ్ రావు తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు రావడాన్ని నిరసిస్తూ హైదరాబాద్, గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని బల్మూర్ వెంకట్ శుక్రవారం పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. పదేళ్ళుగా హరీశ్‌రావు, బిఆర్ఎస్ నాయకులకు ఎప్పుడూ అమరవీరుల స్తూపం గుర్తుకు రాలేదని ఆరోపించారు. హరీష్ రావు బిఆర్ఎస్‌లో ఒక జీతగాడు మాత్రమేనని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 వరకు ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసి తీరుతారని, హరీష్ రావు స్పీకర్ ఫార్మెట్‌లో రాజీనామా లేఖను ఇవ్వకుండా రాజకీయం చేశారని మండిపడ్డారు. కేవలం రాజకీయం కోసమే హరీశ్ డ్రామాలు అడుతున్నారన్నారు. రూతు రుణమాఫీ చేస్తే సిఎం రేవంత్ చెప్పిన్నట్లు బిఆర్ఎస్ రద్దు చేస్తారో,? లేదో కెసిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## భగ్గుమంటున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం అధికారులు హెచ్చరించారు. పొడి వాతావరణం కారణంగా గత కొన్ని రోజుల రెండు నుంచి మూడు డిగ్రీలు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగటంతో ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని సూచించారు. ఆదివారం రాష్ట్రంలో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెలలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అన్నీ జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండగా భద్రాచలంలో 44 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశారు. అదే సమయంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడుతుండటంతో ఉష్ణోగ్రతుల పెరిగే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో ఆదివారం నుంచి సోమవారం వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. శుక్రవారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, వనపర్తి జోగులాంబ జిల్లాల్లో శనివారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగాలులు వీస్తాయంటూ ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. 28న నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాలకు వడగాలులు వీస్తాయని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ ఇచ్చారు. ఆదివారం కుమ్రంభీం, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని చెప్పారు. 29న నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాలు, 30న కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు వడగాలులు వీస్తాయని హెచ్చరించారు. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అయితే గతంలో 2015, 2016 సంవత్సరాల్లోనూ రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అప్పుడు ఆ ఎండల తీవ్రతకు చాలా మంది మృత్యువాతపడ్డారు. ఇటువంటి పరిస్థితి మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రతలు తీసుకోవాలని ప్రభుత్వం సైతం హెచ్చరిస్తోంది.

## శవ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నేతన్నల ఉత్పత్తికి అనేక రకాల ఆర్డర్లు ఇవ్వాలని సంబంధిత అధికారులతో చర్యలు తీసుకుంటామని, చావు శరణ్యం కాదని, మరణం అంతిమం కాదని సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కేంద్రంలోని బిజెపి, నాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ కారణమా?, నాలుగు నెలల క్రితం ప్రభుత్వం ఏర్పడిన తాము కారణమా అని అన్నారు. నేతన్నల చావుకు కారణాలను తెలుసునని భవిష్యత్‌లో ఆత్మహత్యలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలిన జిల్లా కలెక్టర్‌ను కోరారు. అధికారులు, తాము కూర్చుని నేతన్నలకు ఏం చేయాలన్న దానిపై ప్రణాళిక చేస్తున్నామని, యార్డు సబ్సిడీనా?, వర్క్ టూ ఓనర్ కింద కొత్త టెక్నాలజీ లుమ్స్ ఇవ్వలా?, ఇలా చేనేత వృత్తికి ఉన్నత స్థానం కల్పించేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. 2014 నుంచి 2023 సంవత్సరం వరకు నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 135 మంది చేనేత కార్మికులు చనిపోయారని వివరించారు. సమస్య పరిష్కారానికి తాము చేస్తున్న ప్రయత్నంలో సహకరించాలని, లేదంటే బిఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యంచెందిందని కూర్చోవాలని సూచించారు. చేనేత కార్మికులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబ్బులు చెల్లించి ఉంటే, ఇటువంటి పరిస్థితి వచ్చేదా అని ప్రశ్నించారు. నేతన్నలకు మొదటి విడతలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 50 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేసిందని, 'ఇవాళ, రేపట్లో' మరో రూ 50 కోట్ల బకాయిలు చెల్లిస్తామని, మొదటి వారంలో పూర్తిగా బకాయిలు చెల్లించేలా ప్రణాళికలు చేసుకున్నామని, ఇవన్నీ పాత బకాయిలని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. సిరిసిల్ల చేనేత కార్మికులకు పాత బకాయిలను ఎందుకు చెల్లించలేదని బిఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ప్రధానమంత్రి అనే పదవికి మోదీ గౌరవం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం మెజారిటీ కలిగిన హిందువులకు ఏం చేశారని ప్రశ్నించారు. దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెట్టారని, కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే వారి వద్ద ఉన్న సంపదను దేశ ప్రజలకు పంచుతారనే భయంతోనే బిజెపి దేశ ప్రజల్లో అలజడి సృష్టిస్తోందని ఆరోపించారు.




| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |



## బిజెపి బెదిరింపు రాజకీయాలు

ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రభుత్వ ఉన్నతాధికారులను తమకు అనుకూలంగా పని చేయాలని బిజెపి ఒత్తిడి తెస్తున్నదని ప్రతిపక్ష పార్టీలు ఎంతోకాలంగా చేస్తున్న విమర్శలకు నిదర్శనంగా అస్సాంలోని కరీంగంజ్ నియోజకవర్గం, బుటుకుసి గ్రామ ప్రజలు బిజెపి తీరుపై ఆందోళన చెందుతూ, స్థానిక కోర్టులో పిటిషన్ వేశారు. బిజెపికి ఓటు వేయాలని, లేకపోతే, బుల్‌డోజర్ సాయంతో ఇళ్లు కూల్చివేస్తామని అటవీ శాఖ అధికారులు బెదరించినట్టు పిటిషనర్లు కోర్టుకు సమర్పించిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ, శుక్రవారం ఈ నియోజకవర్గంలో పోలింగ్ జరగ్గా, బుటుకుసి గ్రామస్థులు చాలా మంది తటస్థంగా ఉండిపోయారని సమాచారం. పోలింగ్ స్టేషన్‌కు వెళ్లిన వారు కూడా ఆందోళనలో కనిపించారని అంటున్నారు. బిజెపి అభ్యర్థి కృష్ణానాథ్ మల్లాకు అనుకూలంగా ఫలితం రాకపోతే, తమ పరిస్థితి ఏమిటని ఈ గ్రామస్థులు భయపడుతున్నారు. కొంత మంది ముందు జాగ్రత్తగా కోర్టును ఆశ్రయించడంతో, అధికారులు ఎవరూ దుందుడుకు చర్యలకు పాల్పడకపోవచ్చని సమాచారం. ఏదిఏమైనా బిజెపి కొనసాగిస్తున్న బెదిరింపు రాజకీయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.

## ఓటర్ల కంటే ఓట్లు ఎక్కువ!



ఏ ఎన్నికల్లోనైనా సుమారుగా 60 నుంచి 70 శాతం పోలింగ్ జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో, 80 నుంచి 90 శాతం పోలింగ్ నమోదవుతుంది. అతి తక్కువ ప్రాంతాల్లో వంద శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. కానీ, ఈనెల 19న జరిగిన తొలివిడతలో, త్రిపుర పశ్చిమ పార్లమెంటరీ నిజయోజకవర్గంతోపాటు, రామ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా 100 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదు కావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఈ రెండు చోట్లా రీపోలింగ్ నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. సిపిఎం త్రిపుర కార్యదర్శి జితేంద్ర చౌదరి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి సేకరించిన సమాచారం మేరకు మజ్లిష్‌పూర్ సెగ్మెంట్‌లోని పార్ట్ 44లో 105.30 శాతం, ఖేర్పూర్ సెగ్మెంట్‌లోని పార్ట్ 25లో 100.15 శాతం, పాక్షికంగా 98.80% పోలింగ్ నమోదైంది. ఖయేర్‌పూర్ సెగ్మెంట్లో 104 శాతం, మోహన్పూర్ సెగ్మెంట్‌లోని 38వ భాగంలో 109.09 శాతం చొప్పున పోలింగ్ రికార్డయింది. పశ్చిమ త్రిపుర పార్లమెంటరీ నియోజకవర్గానికి ఎన్నికలు, అదే పార్లమెంటరీ నియోజకవర్గంలో భాగమైన రామ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక స్వేచ్ఛగా, న్యాయంగా, సాధారణ పద్ధతిలో జరగలేదని ఈ పోలింగ్ సరళి స్పష్టం చేస్తున్నది. బూత్‌లను స్వాధీనం చేసుకొని, వ్యవస్థీకృత పదద్ధతిలో, పూర్తి స్థాయిలో రిగ్గింగ్ చేసినప్పుడు మాత్రమే ఈ పరిస్థితి తలెత్తుతుంది. త్రిపుర ఎన్నికల ప్రహసనం పునరావృతం కాకుండా భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## అంబేద్కర్‌వాద గ్రూపులు...
# 'ఇండియా' కూటమి వైపే

మహారాష్ట్రంలోని మొత్తం 48లోక్‌సభ స్థానాలకుగాను, ఈ నెల 19వ తేదీన 5, 26వ తేదీ (శుక్రవారం) 8 నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తికాగా, మిగతా స్థానాల్లో పోలింగ్ మరో మూడు విడతల్లో జరగనుంది. మే 7న మూడో విడతలో 11, మే 13న నాలుగో విడతలో 11, మే 20 నాటి ఐదవ, చివరి విడతలో 13 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతాయి. కాగా, రాష్ట్రంలో బలంగా ఉన్న అంబేద్కర్‌వాదులు. సంఘాలు, గ్రూపుల మద్దతు ఎవరికి లభిస్తుందనే విషయంపై నిన్నమొన్నటి వర కూ సస్పెన్స్ కొనసాగింది. ప్రకాష్ అంబేద్కర్ నెలకొల్పిన వంచిత్ బహుజన్ అఘాడీ (విబిఎ) 36 స్థానాలకు పోటీ చేయాలని నిర్ణయించడంతో, ఓట్లు చీలే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. అయితే, అధిక శాతం అంబేద్కరైట్ గ్రూపులు దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపడడం అనే ఏకైక లక్ష్యంతో, కాంగ్రెస్, శివసేన (యుబిటి)తో కూడిన 'ఇండియా' కూటమికి మద్దతునిస్తున్నట్టు స్పష్టం చేశాయి. ప్రకటన సహజంగానే బిజెపి, ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన పార్టీలకు ఆందోళన కలిగిస్తున్నది. ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో కొనసాగుతున్న నిరంకుశ పాలన, మతవాద శక్తుల దౌర్జన్యాలను అడ్డుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈ గ్రూపులు ఒక ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. తొలి దశలో మతతత్వ పార్టీలను ఓడించి, ఆ తర్వాత రెడో దశలో అంబేద్కర్ అసలు పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ ఆదర్శాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటామని వివరించింది. ఇలావుంటే, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలన్న విబిఎ నిర్ణయాన్ని, ఆ పార్టీకి చెందిన కొంత మంది నాయకులు, కార్యకర్తలు కూడా వ్యతిరేకిస్తున్నారు. షోలాపూర్ లోక్‌సభ స్థానం నుంచి విబిఎ అభ్యర్థి రాహుల్ గైక్వాడ్ తన నామినేషన్‌ను రద్దు చేసుకోవాలని నిర్ణయించడమే ఇందుకు ఉదాహరణ. తన కారణంగా ఓట్లు చీలిపోయి, బిజెపి అభ్యర్థి విజయాన్ని మెరుగుపరుస్తాయని, అందుకే, తాను పోటీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నానని పేర్కొంటూ గైక్వాడ్ ఒక వీడియో విడుదల చేశారు. అంబేద్కరైట్ గ్రూపులు తొలుత మహారాష్ట్ర సామాజిక, రాజకీయ వాస్తవాలను సమీక్షించుకున్నాయి. విబిఎకు ప్రస్తుతం రాష్ట్రంలో బిజెపిని ఎదిరించి, ఓడించే శక్తిలేదన్న నిర్ధారణకు వచ్చాయి. అందుకే, దళిత బౌద్ధ సంఘం తన నిర్ణయాత్మక ఓటు




చీలిపోకుండా నిరోధించడానికి, మహావికాస్ అఘాడి అభ్యర్థి విజయం సాధించడానికి వీలుగా నిర్ణయం తీసుకుంది. అభ్యర్థులు నిలబెడితే, ఓట్లు చీలిపోతాయన్న అభిప్రాయాన్ని దాదాపు అంబేద్కర్‌వాద గ్రూపులన్నీ మూకుమ్మడిగా అంగీకరించాయి. నిజానికి ఈ అంశాన్ని పాంథర్ రిపబ్లికన్ పార్టీ నాయకుడు శ్యామదాదా గైక్వాడ్ ప్రతిపాదించగా, ప్రోగ్రెస్ రిపబ్లికన్ పార్టీ సహా వివిధ గ్రూపులు సానుకూలంగా స్పందించాయి. ముంబయి మరాఠీ పాత్రకర్ సంఘ్‌లో ఇటీవల ఏర్పాటైన విలేఖరుల సమావేశంలో పాల్గొన్న పాంథర్ రిపబ్లికన్ పార్టీ సీనియర్ నాయకుడు సాయాజీ వాఘ్మారే, మాజీ ఐపిఎస్ అధికారి సుధాకర్ సురాద్కర్, సంజయ్ అపరంతి, సీనియర్ జర్నలిస్టు సునీల్ ఖోబరాగాడే తదితరులు మాట్లాడుతూ బిజెపి మహాయుతి (మహాకూటమి) అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలోని బౌద్ధ సమాజ రాజకీయ విలువలను లేదా శక్తిని నిరూపించుకోవడానికి వేదిక కాదని స్పష్టం చేశారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని కాపాడుకోవడానికి, బిజెపి నుంచి ఎదురవుతున్న తీవ్ర సవాళ్లను తిప్పికొట్టడానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలని ప్రజలను కోరారు. ఆ క్రమంలోనే, 'ఇండియా' కూటమి అభ్యర్థులకు మద్దతునివ్వాలని అన్ని గ్రూపులు ఏకగ్రీవ తీర్మానాన్ని కూడా ఆమోదించాయి. మోదీ నిరంకుశ విధానాల నుంచి దేశాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందుకే, 'ఇండియా' అభ్యర్థులను గెలిపించడానికి సమష్టి గా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాయి. ఇలావుంటే, ప్రముఖ సామాజిక కార్యకర్త, దార్శనికుడు డాక్టర్ యశ్వంత్ మనోహర్, డాక్టర్ సుఖ్‌దేవ్ థోరట్ నేతృత్వంలోని 80 సంస్థలు బిజెపి పాలనలో చోటు చేసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాపై ప్రజల్లో అవగాహన కల్పించాయి. బిజెపిని ఓడించడానికి 'ఇండియా' కూటమికి మద్దతునివ్వాల్సిన అవసరాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

ఈ ఎన్నికల అనంతరం ప్రోగ్రెసివ్ రిపబ్లికన్ పార్టీని పూర్తి స్థాయిలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతుంది. ఇలావుంటే, విబిఎ పోటీలో ఉన్న స్థానాల్లో పరిస్థితి ఏమిటనే అనుమానం తలెత్తుతున్నది. బిజెపి వ్యతిరేక ఓట్లు అటు 'ఇండియా' కూటమికి, ఇటు విబిఎకు చీలిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. అదే జరిగితే, విబిఎ వల్ల పరోక్షంగా బిజెపికి మేలు జరుగుతుంది. షోలాపూర్ నుంచి పోటీ నుంచి వైదొలగిన సమయంలో గైక్వాడ్ చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి.

ఏదిఏమైనా, అంబేద్కరైట్ సంఘాలు, గ్రూపులు 'ఇండియా' కూటమికి మద్దతు పలకడం బిజెపి దూకుడును చాలావరకు తగ్గిస్తుందనేది వాస్తవం.

# ఉద్యమాల ఖిల్లా..కరీంనగర్ అడ్డా

### సిఎం, కేంద్ర మంత్రులు, గవర్నర్లను అందించిన గడ్డ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ఉద్యమాల ఖిల్లా చారిత్రక నేపథ్యమున్న కరీంనగర్ లోక్‌సభ స్థానం మరోసారి పార్లమెంటు ఎన్నికలకు సిద్ధమవుతోంది. నాటి నిజాం నవాబు, రజాకార్ల, దొరలు, భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన కరీంనగర్ గడ్డకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నిజాం నవాబు పాలన అంతంకోసం తెలంగాణలో సాయుధ పోరాటానికి జంగ్‌సైరన్ ఊదిన ముగ్గురిలో బద్దం ఎల్లారెడ్డి కరీంనగర్ మొదటి ఎంపి కావడం విశేషం. పార్లమెంటు పరిధిలోని హుస్నాబాద్‌లో అమరవీరులను స్మరించుకునేందుకు ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన స్థూపం, శాతవాహనుల రాజధాని ఎలగందుల ఖిల్లా, దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, కోరిన కోర్కెలు తీర్చే కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం, కోరమీసాల కొత్తకొండ వీరభద్రుడు, అందరివాడైన ఇల్లందకుంట శ్రీరాముడు కొలువుదీరింది ఈ గడ్డపైనే. జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించే లోయర్ మానేరు డ్యాం, మిడ్‌మానేరు వంటి పర్యాటక ప్రాంతాలు ఉన్న నియోజకవర్గం ఎందరో రాజకీయ ఉద్దండులను అందించింది. తెలంగాణ తొలి ముఖ్యంత్రిగా బాధ్యతలు చేపట్టిన కెసిఆర్‌ను ముఖ్యమంత్రి పదవిని అధిష్టించే అవకాశం జిల్లా ప్రజలు కల్పించారు. కరీంనగర్ నుంచి ఎంపిలుగా గెలిచిన కెసిఆర్, ఎమ్మెస్సార్, చొక్కారువు, సిహెచ్ విద్యాసాగర్‌రావు(గవర్నర్‌గా)లు కేంద్ర మంత్రి పదవులను అధిరోహించారు. తెలంగాణలో సీనియర్ నాయకుడైన, మాజీ సిఎం మర్రి చెన్నారెడ్డి (1984లో) ఒక్కసారి పోటీ చేస్తే ఓటమి రుచి చూపించిన చరిత్ర జిల్లా ప్రజలది.

**19 సార్లు ఎన్నికలు..**

కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. ఇప్పటి వరకు 19 సార్లు ఎన్నికలు జరిగాయి. మొత్తం రెండు ఉప ఎన్నికలతో సహా 19 సార్లు ఎన్నికలు జరగగా రెండు సార్లు ద్విసభ్య నియోజకవర్గంగా ఉండేది. ఎస్‌సిఎఫ్ ఒకసారి, పిడిఎఫ్ ఒకసారి, ఐదుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు కాంగ్రెస్(ఐ), టిఆర్ఎస్ నాలుగుసార్లు (ఉప ఎన్నికలతో కలిపి), బిజెపి మూడుసార్లు (ఒక ఉప ఎన్నికతో కలిపి), టిడిపి, తెలంగాణ ప్రజా సమితి ఒక సారి గెలిచాయి. బిఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కెసిఆర్ ఇక్కడ ఒకే టర్మ్‌లో మూడు సార్లు గెలిచి రికార్డు సృష్టించారు. ఆయన 2004లో గెలిచిన తరువాత రెండుసార్లు తెలంగాణ ఉద్యమంలో భాగంగా రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. జె.చొక్కారావు మూడుసార్లు, ఎమ్మెస్సార్ మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఇక్కడి నుంచి ఎంపిగా గెలిచిన ఎల్.రమణ, ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ఎమ్మెస్సార్ సైతం ఉమ్మడి రాష్ట్రంలో పిసిసి ప్రెసిడెంట్‌గా, వైఎస్సార్ కేబినెట్‌లో మంత్రిగా, ఆర్టీసి చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. చెన్నమనేని విద్యాసాగర్‌రావు మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్రమంత్రిగా కొనసాగుతున్న పొన్నం ప్రభాకర్ ఎంపిగా గెలిచి ఉమ్మడి రాష్ట్రం ఎంపిల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా కొనసాగారు. ప్రస్తుత ఎంపి బండి సంజయ్ ఎంపి అయ్యాక బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయినపల్లి వినోద్ కుమార్ గతంలో ఎంపిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర సాధనకై ఢిల్లీలో జాతీయ పార్టీలను ఏకం చేసి 33 పార్టీలతో తెలంగాణకు అనుకూలంగా లేఖలు ఇప్పించడం విశేషం. ఇలా కరీంనగర్ ఎంపిలుగా పనిచేసిన ప్రతి ఒక్కరికి ఒక్కో ప్రత్యేకత ఉంది. జువ్వాడి చొక్కారావు, ఎమ్మెస్సార్‌లు వరుసగా మూడుసార్లు గెలిచి మచ్చలేని నాయకులుగా, నిజాయితీకి నిలువుటద్దంలా చరిత్రకెక్కారు..

**బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు పాత కాపులే..**

ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. కాంగ్రెస్ నుంచి వెలిచాల రాజేందర్‌రావు, బిజెపి నుంచి మరోసారి బండి సంజయ్, బిఆర్ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రధానంగా బరిలో ఉన్నారు. కాగా బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు గత ఎన్నికల్లో పోటీపడిన పాత ప్రత్యర్థులే. గతంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎంపిగా పోటీ చేసి ఓడిన వెలిచాల రాజేందర్‌రావును ఈ సారి కాంగ్రెస్ నుంచి బరిలో నిలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ పోటీ చేశారు. సిట్టింగ్ ఎంపిగా ఉన్న బండి సంజయ్ కుమార్ గత ఎన్నికల్లో 4,98,276 ఓట్లు పొంది విజయం సాధించారు. ఆయన సమీప ప్రత్యర్థిగా బిఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ 4,08,768 ఓట్లు వచ్చాయి. మూడవ స్థానంలో పొన్నం ప్రభాకర్ నిలిచారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కొంత ఢీలా పడిపోగా బిఆర్ఎస్, బిజెపి మధ్య ద్విముఖ పోటీగా సాగింది. ఈ సారి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం, కరీంనగర్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో నాలుగు అసెంబ్లీ సీట్లు కాంగ్రెస్ గెలుచుకోవడంతో పార్లమెంటు సీటును కైవసం చేసుకునేందుకు వ్యూహారచనలో మునిగారు. మరో మూడు స్థానాల్లో బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు ఉన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో ఓవరాల్‌గా బిఆర్ఎస్‌కే 6 వేల ఓట్లు అధికంగా రావడంతో గెలుపు మాదేనంటూ ప్రచారంలో పాల్గొంటున్నారు. బిజెపి అభ్యర్థిగా మరోసారి పోటీ చేస్తున్న బండి సంజయ్ మాత్రం తమ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుంటామన్న ధీమాతో ప్రచార పర్వాన్ని వేగం పెంచారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ముక్కోణపు పోరు జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**ప్రాతినిధ్యం వహించిన ఎంపిలు ఇలా...**

| పదవీకాలం | సభ్యుల పేర్లు | పార్టీ |
|---|---|---|
| 1952–57 | బద్దం ఎల్లారెడ్డి | పిడిఎఫ్ |
| 1957–62 | ఎం.ఆర్.కృష్ణ | కాంగ్రెస్ |
| 1962–67 | జువ్వాడి రామపతిరావు | కాంగ్రెస్ |
| 1967–71 | జువ్వాడి రమాపతి రావు | కాంగ్రెస్ |
| 1971–77 | ఎం.సత్యనారాయణ రావు | కాంగ్రెస్ |
| 1977–80 | ఎం.సత్యనారాయణ రావు | కాంగ్రెస్ |
| 1980–84 | ఎం.సత్యనారాయణ రావు | కాంగ్రెస్ |
| 1984–89 | జువ్వాడి చొక్కారావు | కాంగ్రెస్ |
| 1989–91 | జువ్వాడి చొక్కారావు | కాంగ్రెస్ |
| 1991–96 | జువ్వాడి చొక్కారావు | కాంగ్రెస్ |
| 1996–98 | ఎల్.రమణ | టిడిపి |
| 1998–1999 | సి. హెచ్.విద్యాసాగర్‌రావు | బిజెపి |
| 1999–2004 | సి. హెచ్. విద్యాసాగర్‌రావు | బిజెపి |
| 2004–2009 | కె.చంద్రశేఖర్ రావు (ఒకే టర్మ్‌లో ఉప ఎన్నికల ద్వారా మూడు సార్లు విజయం) | టిఆర్ఎస్ |
| 2009–2014 | పొన్నం ప్రభాకర్ | కాంగ్రెస్ |
| 2014–2019 | బోయినపల్లి వినోద్ కుమార్ | టిఆర్ఎస్ |
| 2019–2024 | బండి సంజయ్ కుమార్ | బిజెపి |

## గుత్తా గుంపంతా హస్తం గూటికేనా!



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** జిల్లా లో రాజకీయ ఉద్దండుడు.. ఎన్నో పదవులను పొంది తనకుంటూ ఓ గుంపును సంపాదించుకున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి గుంపంతా హస్తం గూటికే బాటలు వేస్తున్నారా..సొంతపార్టీ నేతలపైనే తీవ్ర స్థాయిలో విమర్శలు.. పదవుల్లో ఉన్నప్పుడు అక్రమ దందాలు బయటపెడతామని బాహాటంగా విమర్శలు చేస్తుంటే వీరంతా పార్టీ వీడుతున్నారనే చెప్పవ చ్చు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం బిఆర్ఎస్ జిల్లాలో అన్ని సీట్లు ఓడిపోవడానికి ప్రధాన కారణం గుత్తా అనే సాకు చూపు తూ ఆయనపై ఆ పార్టీలో ఉన్న మాజీ మంత్రి, మాజీ ఎంఎల్‌ఎలు విమర్శలు చేయడం తారాస్థాయికి చేరింది. ఎన్నిక లు.. వ్యవహారం అంతా వారే రింగు తిప్పుతారు. ఏ పార్టీలో ఉన్నా.. ఏ ప్రాంతంలో ఉన్నా తమకు సుఖేందర్‌రెడ్డే పెద్ద నాయకుడు అని భావిస్తూ ఆయన సూచించిన వారికే ప్రాధాన్యత ను ఇవ్వడమే కాకుండా ఏదైనా చేసేందు కు వెనుకాడరు. మరోవైపు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి వెనుక ఉండి సుఖేందర్‌రెడ్డిపై కుట్ర లు చేయిస్తున్నారని బహిరంగంగానే చర్చించు కుంటున్నారు. ఈ నేపథ్యంలో నే ఆయన వర్గమంతా ముందుగా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత ముఖ్య నేతలను అధికార పార్టీకి పంపి తరువాత సుఖేందర్ రెడ్డి కూడా కాంగ్రెస్ బాట పడతారనే చర్చ జరుగుతుంది.ఇప్పటికే గుత్తా ముఖ్య అనుచరుడు, తిప్పర్తి జడ్‌పిటిసి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ్మాతో పాటు మరికొంతమంది ముఖ్య నేతలను గుత్తానే ముందస్తుగా కాంగ్రెస్‌లోకి పంపినట్లు బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అయితే శాసన మండలి చైర్మన్‌గా రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండటంతో తన తనయుడు అమిత్ రెడ్డితో పాటు తన వర్గాన్ని అంతా కాంగ్రెస్‌లోకి పంపించి గతంలో కాంగ్రెస్ ఎంపిగా ఉంటూ బిఆర్ఎస్‌లో రాజకీయాలు నడిపిన విధంగా కాంగ్రెస్‌లో కూడా నడుపుతారనే వినికిడి వినిపిస్తుంది. ఏదేమైనా జిల్లాలో బిఆర్ఎస్ నేతలలో గుత్తాపై వస్తున్న విమర్శలు రాజకీయ దుమారంగా మారి పార్టీలను వీడే స్థాయికి చేరుకోవడం గమనార్హం.

**కిషోర్ అక్రమ దందాలు బయటపెడతాం** తుంగతుర్తి మాజీ ఎంఎల్‌ఎ గాదరి కిషోర్ అక్రమాలను త్వరలోనే బయటపెడతామని గుత్తా సుఖేందర్‌రెడ్డి వర్గీయులు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఇరుగు పెద్దులు, కనగల్ జడ్‌పిటిసి వెంకటేశం, స్వామి గౌడ్‌లు హెచ్చరించారు.

## బిజెపి అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేటుపరం

### రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/చిగురుమామిడి(కరీంనగర్):** కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేటీకరణ చేస్తూ దేశాన్ని కొల్లగొడుతున్నారని, రూ.11లక్షల కోట్లు అదానీ, అంబానీ లాంటి కార్పోరేట్లకు రుణాల రూపంలో పంచారని రాష్ట్ర బిసి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కుల మతాల మధ్య బిజెపి చిచ్చుపెడుతూ రాజకీయాలతో విద్వేషాలను రెచ్చగొడుతోందని మండి పడ్డారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి ఎన్నికల ప్రచారంలో బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహం వద్ద కార్నర్ షోలో మంత్రి పొన్నం పాల్గొని మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద బలంతో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యానని, ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు. కరీంనగర్ ఎంపి గా వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ చివరి రక్తపు బొట్టు ఉన్నంతవరకు ప్రజాసేవకే కట్టుబడి ఉంటానన్నారు. ప్రజల మధ్యే ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఆశీర్వదించి పార్లమెంటుకు పంపాలని కోరారు. సమావేశంలో జడ్పిటిసి గీకురు రవీందర్, కాంగ్రెస్ మండల అ ధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి, డిసిసి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత, ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మహిళా నాయకురాలు మంజుల రెడ్డి,బత్తిని శ్రీను గౌడ్ తదితరులున్నారు.

## పదేళ్లలో బిజెపి చేసిందేమీ లేదు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** దేశంలో బిజెపి మత రాజకీయాలు చేస్తూ ప్రజల మనోభావాలతో ఆడుకుంటుందని, పదేళ్లలో చేసిన అభివృద్ధి చెప్పలేకనే బిజెపి దేవుడిపేరు చెప్పి ఓట్ల రాజకీయం చేస్తుందని కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఎంఎల్‌ఎ గంగుల కమలాకర్‌తో కలిసి మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ బండి సంజయ్‌కు చిత్తశుద్ధి ఉంటే ఒక్క గుడి ఎందుకు తేలేదని ప్రశ్నించారు. కరీంనగర్‌కు రావాల్సిన ట్రిబుల్ ఐటి బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలించిందన్నారు. ఇక ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లలో ఏం ఎలగబెట్టలేదని, చేసిందేమీ లేదు కాబట్టి ప్రజలను గారడీ చేసేందుకు మోదీ మళ్లీ సిద్ధమయ్యారని, స్విస్ బ్యాంకు నుంచి నల్లధనం తెచ్చి ప్రజలకు 15లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, ప్రజల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల ఖర్చులను పెంచిందని దుయ్యబట్టారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని, తాను ఎంపిగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ, కొత్తపల్లి మనోహరాబాద్‌కు రైల్వే లైన్ తెచ్చానన్నారు. టిటిడి నుంచి రూ.25 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.25 కోట్లు తీసుకువచ్చి పదెకరాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మాణంచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ సివిల్ సప్లై కార్పోరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, కార్పోరేటర్లు తోట రాములు,అయిలేందర్ యాదవ్, నాయకులు కలర్ సత్తెన్న, సత్తినేని శ్రీనివాస్, వొల్లాల శ్రీనివాస్ గౌడ్, తదితరులున్నారు.

ప్రజాపక్షం

శనివారం, ఏప్రిల్ 27

# ఉన్నమాటంటే ఉలుకెందుకు?

ప్రపంచ దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘన, మత స్వేచ్ఛ అణచివేత వంటి అంశాలపై అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఏటా నివేదిక విడుదల చేయటం దానికున్న ఆదేశం.ఎంతైనా, ప్రపంచానికి 'పెద్దన్న'గా తననుతాను పరిగణించుకునే అమెరికా ప్రభుత్వం, ప్రధానమైన దేశాల్లో మానవహక్కుల స్థితిగతులపై నివేదిక రూపొందించి కాంగ్రెస్‌కు సమర్పిస్తుంటుంది. తమ దేశంలోని జాతివివక్ష, నల్లజాతివారిపై అధికారులు, పౌరసమాజం నుండి జరిగే అణచివేత, హత్యలు, తుపాకీ కాల్పులతో అమాయకుల హత్యలు వగైరా హింసను గమనించినపుడు ఇలాంటి అమెరికన్ నివేదికలు గురివింద గింజ సామెతే కావచ్చు. కాని భారత్ వంటి దేశాలగూర్చి నివేదించే విషయాలను అభూత కల్పనలుగా, అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా కొట్టివేయటం సంబంధిత ప్రభుత్వాలకు అలవాటు. అంతమాత్రాన వాస్తవాలు మరుగుపడతాయా? అమెరికా నివేదికలో ప్రస్తావించిన అనేక అంశాలపై మన దేశంలో ప్రజాతంత్ర శక్తులు, పౌర సంస్థలు నిరసన తెలిపే ఉంటాయి, ఆందోళన నిర్వహించే వుంటాయి. కొన్ని ఆందోళనలపై రాజ్యహింస నాట్యం చేసి ఉంటుంది.

మానవ హక్కులపై యుఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ నివేదిక–2023 ను భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తిరస్కరించిందిః ''ఈ నివేదిక లోతైన పక్షపాతంతో కూడింది. భారతదేశం గూర్చి నాసిరకపు అవగాహనను ప్రతిబింబిస్తున్నది. మేము దానికి ఎటువంటి విలువ ఇవ్వటం లేదు, మీరు ఇవ్వవద్దు''అన్నారు విలేకరులతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్. భారతదేశంలో దాదాపు 12 రకాల మానవ హక్కుల ఉల్లంఘనపై 'విశ్వసనీయమైన సమాచారాన్ని' అమెరికా నివేదిక గుదిగుచ్చింది. అవి స్థూలంగా ఇలా ఉన్నాయి ః నేరస్థులను చట్టం ప్రకారం శిక్షించకుండా చంపివేయటం (ఎక్స్‌ట్రా జుడీషియల్ కిల్లింగ్స్); మనుషులను బలవంతంగా లేపేయటం; నిరంకుశంగా అరెస్టు లేదా డిటెన్షన్; నేరాంగీకారం సాధించే నిమిత్తం బలవంతపు చిత్రహింసలు, పదేపదే ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు విధించటం, టెలీకమ్యూనికేషన్స్ నిలుపు చేయటం; పౌర సమాజ క్రియాశీల కార్యకర్తలు, పాత్రికేయులపై నిఘా; మానవ హక్కుల సమర్థకులను బెదిరించటం, ఇంటర్నెట్ ద్వారా వేధించటం; బంధువుపై ఆరోపించబడిన నేరాలకు కుటుంబ సభ్యులను శిక్షించటం; ఉపజాతి, కుల మైనారిటీ సభ్యులను లక్ష్యం చేసుకుని హింస, బెదిరింపులతో కూడిన నేరాలు. దేశంలో సంవత్సరకాలంలో ఘటనలను గుర్తుచేసుకుంటే పై ఆరోపణల్లో కొట్టివేయదగింది ఉండదు. కాకపోతే 'అత్త కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు' అన్న సామెతగా సప్తసముద్రాల అవతలి వాడెవడో తమ దేశంలో జరిగే నేరాలు, అరాచకాలు, హింస, అణచివేత, అత్యాచారాలను కప్పిపుచ్చుకుంటూ మనల్ని వ్రేలెత్తిచూపుతాడా అనే దుగ్ధ ఆ నివేదిక తిరస్కరణలో ప్రతిబింబిస్తున్నది.

పాలస్తీనియన్‌లపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ అమెరికన్ యూనివర్శిటీల్లో విద్యార్థులు నిర్వహిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రతి ప్రజాస్వామ్యంలో హక్కు ఉంటుందని విదేశాంగశాఖ ప్రతినిధి, ఒక ప్రజాస్వామ్యదేశం సోదర ప్రజాస్వామ్య దేశాలలో జరిగే ఘటనలపట్ల అవగాహన ప్రదర్శించాలని హితవు చెప్పారు. అమెరికా నివేదిక మణిపూర్ ఘటనలను ప్రస్తావించటం మన ప్రభుత్వానికి పుండుమీద కారం చల్లినట్లు అయి ఉండవచ్చు.బిబిసి కార్యాలయంపై మన పన్నుల అధికారుల దాడు లు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీకి గుజరాత్ కోర్టు ఒకటి రెండేళ్ల జైలుశిక్ష విధించటం ఆ నివేదిక ప్రస్తావనల్లో ఉన్నాయి. రాజకీయ పార్టీల ప్రతినిధులు పౌర సమాజ సంస్థలపై, సిక్కులు, ముస్లింలవంటి మతమైనారిటీలపై, ప్రతిపక్ష రాజకీయ పార్టీలపై తప్పుడు సమాచారం వ్యాప్తిలో పెట్టటం వంటి ఎత్తుగడలు అనుసరించటాన్ని, కొన్ని సందర్భాల్లో వారిని భద్రతకు ముప్పుగా చిత్రించటాన్ని ప్రస్తావించింది.

అమెరికన్ విదేశాంగశాఖ నివేదిక, భారత ప్రభుత్వ నిరాకరణ రెండూ లాంఛనాలే. భారతదేశంలోని పాలకపార్టీ తన స్వప్రయోజన రాజకీయాల కొరకు అన్ని వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నదన్న ఆరోపణలకు గురవుతున్నది.

# ఇంట, బయట పరువుతీసిన మోదీ వక్రభాష్యాలు

**ఎం. కోటేశ్వరరావు**

దేశ వనరుల మీద తొలి హక్కుదారులు ముస్లింలని కాంగ్రెస్ చెప్పిందని, వారు చొరబాటుదారులు, కాంగ్రెస్ అధికారానికి వస్తే పుస్తెలతో సహా ఆస్తులన్నీ స్వాధీనం చేసుకొని వారికి పంచుతుందని ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల సభల్లో ఆరోపించారు. ఎప్పుడో 2006లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడారంటూ నరేంద్ర మోదీ వేసిన నిందల గురించి మోదీ అలా మాట్లాడి ఉండాల్సింది కాదు అని అభిమానులే అంటున్నారు. అసలింతకీ అలా ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది? దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితి గురించి మోదీకి అర్థమైందా? ప్రతి ఎన్నికలో ఏదో ఒక అంశాన్ని సంచలనంగావిస్తే తప్ప జనానికి కిక్కు ఎక్కదని, ఓట్లు రాలవని ఈ ఎన్నికల్లో దీన్ని ఎంచుకున్నారా? మతాల వారీ జనాలను చీలిస్తే తప్ప గట్టెక్కలేననే భయం పట్టుకుందా? ఇలా పరిపరి ఆలోచనలు. నిజం గడపదాటేలోగా అబద్దం ఊరంతా చుట్టివచ్చి ఎదురుగా నిలుస్తుందన్న లోకోక్తి తెలిసిందే. నరేంద్రమోదీ చెప్పిన అంశాల్లో నిజానిజాలేమిటి అని ఎందరు జనం లోతుల్లోకి వెళతారు. రాందేవ్ బాబా క్షమాపణలు చెబుతూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చానని చెప్పారు. ఇచ్చారు సరే అవి ఎంత పెద్దవో, ఏ పత్రికల్లో ఇచ్చారో వివరాలు ఇవ్వండని సుప్రీం కోర్టు ఆదేశించింది. అలాగే ప్రధాని చెప్పిన మాటల నిజానిజాల గురించి కూడా ఉన్నత న్యాయస్థానం ఆదేశిస్తే తప్ప కేంద్ర ప్రభుత్వం కదలదు. అలా జరుగుతుందా?

విశ్వగురువుగా తనను తాను భావించుకుంటున్న లేదా భజన సమాజం చిత్రిస్తున్నప్పటికీ మోదీ పచ్చి అవాస్తవాలు చెప్పారని కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలను నిర్ధారించుకొని ప్రచురించాయి. అసలు మోదీ ఏం చెప్పారు. ది క్వింట్ అనే పత్రిక వాస్తవాలను వెల్లడించింది. దాన్ని కాదని మోదీ చెప్పిందే నిజమని ఆధారాలతో చెప్పే దమ్ము కేంద్ర ప్రభుత్వానికి, బిజెపికి ఉందా? రాజస్తాన్‌లోని బన్స్‌వారా ఎన్నికల సభలో మాట్లాడుతూ '' దేశ వనరుల మీద తొలి హక్కు ముస్లింలకే ఉందని అధికారంలో ఉండగా కాంగ్రెస్ చెప్పింది. దీని అర్థం ఏమంటే సంపదలన్నింటినీ వారు సమీకరించి ఎవరికి పంచుతారు?ఎక్కువమంది పిల్లలుండే వారికి, అక్రమంగా చొరబడిన వారికి వారు పంచుతారు. కష్టపడి సంపాదించుకున్న దానిని చొరబాటుదారులకు ఇవ్వాలా? మీరు దీన్ని అంగీకరిస్తారా ? కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక చెప్పింది ఇదే. మన తల్లులు, సోదరిమణుల దగ్గర ఉన్న బంగారాన్ని లాక్కుంటారు, వాటిని లెక్కించి పంపిణీ చేస్తారు '' అని చెప్పారు. దీనికి ఆధారంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన ప్రసంగాన్ని ఉటంకించారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల్లో కమ్యూనిస్టులు అధికారానికి వస్తే మగవారిని సుత్తితో తల మీద మోది కొడవలితో గొంతు కోస్తారని, ఆడవారి మెడల మీద కాడి మోపి పొలాలు దున్నిస్తారంటూ కాంగ్రెస్ చేసిన తప్పుడు ప్రచారాన్ని మోదీ గుర్తుకు తెచ్చారు.

'' వనరులను కోరే తొలి హక్కు ముస్లింలకే ఉండాలి: ప్రధాని '' అంటూ జాతీయ అభివృద్ధి మండలి 52వ సమావేశంలో ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక 2006 డిసెంబరు తొమ్మిదవ తేదీన తప్పుదారి పట్టించే శీర్షికతో ఒక వార్తను ప్రచురించింది. ఆ మరుసటి రోజే అది కావాలని చేసిన తప్పుడు భాష్యం, ఆధారాల్లేవంటూ ప్రధాని కార్యాలయం ఒక ఖండన ప్రకటన జారీ చేసింది. ప్రధాని మాట్లాడింది ఇది అంటూ ప్రసంగపాఠాన్ని కూడా దానికి జత చేసింది.దాని ప్రకారం '' మన ఉమ్మడి ప్రాధాన్యతలు స్పష్టంగా ఉన్నాయని నేను నమ్ముతున్నాను. వ్యవసాయం, సాగునీరు, జలవనరులు, ఆరోగ్యం, విద్య, గ్రామీణ మౌలిక సదుపాయాలకు అవసరమైన కీలక పెట్టుబడులు, దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, పిల్లల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలతో పాటు ప్రజలందరికీ అత్యవసరమైన సాధారణ మౌలికవసతులు వీటిలో ఉన్నాయి. దళితులు, గిరిజనులకు ఉద్దేశించిన ఉప పథకాలను పునరుజ్జీవింప చేయాలి. మైనారిటీలు ప్రత్యేకించి ముస్లింలు అభివృద్ధి ఫలాలను సమంగా పొందేలా సాధికారత కల్పించేందుకు మనం కొత్త పథకాలను కనుగొనాల్సి ఉంది. వనరులను పొందే యోగ్యతను బట్టి వారు తొలి వారుగా ఉండాలి '' అని చెప్పారు.

దళితులు, గిరిజనుల ఉద్ధరణకు ఉప ప్రణాళికలు ఉన్నట్లుగానే తమకూ ఉండాలని వెనుకబడిన తరగతులు, ముస్లింలూ ఎప్పటి నుంచో కోరుతున్నారు. మానవాభివృద్ధి సూచికలు, దారిద్ర్య వివరాలను చూసినప్పటికీ 2019లో మన దేశానికి సంబంధించి ఐరాస వెల్లడించిన వివరాల ప్రకారం 2018లో ప్రతి ఇద్దరు గిరిజనుల్లో ఒకరు, ప్రతి ముగ్గురు దళితులు, ముస్లిముల్లో ఒకరు పేదలుగా ఉన్నారని తేలింది. దేశ జనాభాలో 2011లెక్కల ప్రకారం 16.6శాతం దళితులు, 8.6శాతం గిరిజనులు, 14.2శాతం ముస్లింలు ఉన్నారు. మతాలు వేరు గావచ్చు తప్ప, పేదరికం, అన్ని రకాల వెనుకబాటులో వీరందరి పరిస్థితి ఒకే విధంగా ఉందని ప్రభుత్వ వివరాలే వెల్లడిస్తున్నాయి. ఇతర మైనారిటీలైన సిక్కులు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు ఇతరుల్లో పరిస్థితి ఇలా ఉందని ఎవరైనా చెప్పగలరా? దేశంలో ఇప్పుడు 22 కోట్ల మంది పేదలున్నారని, వారందరినీ రానున్న పది సంవత్సరాల్లో ఉద్ధరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో చెప్పింది తప్ప మరొకటి కాదు. బిజెపి చెప్పే సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్‌లో ముస్లింలను మినహాయిస్తామని చెప్పగలదా ?

> నరేంద్రమోదీ చేసిన ఎన్నికల ప్రసంగంపై అంతర్జాతీయ మీడియాలో దేశ పరువుతీసే విధంగా వార్తలు వచ్చాయి. గతంలో రాహుల్ గాంధీ విదేశాల్లో మోదీ విధానాల గురించి మాట్లాడి దేశ పరువు తీశారని విమర్శించిన బిజెపి ఇప్పుడు నరేంద్రమోదీ దేశంలో ఉండే చేసిన వ్యాఖ్యలు దేశపరువును ప్రశ్నార్థకం చేసినందున ఏం చెబుతుంది ?

ఇక ముస్లింలు ఎక్కువ మంది పిల్లలను కని జనాభాను పెంచేస్తున్నారని, ముస్లిం మెజారిటీ దేశంగా మార్చనున్నారనే విద్వేష ప్రచారం ఎప్పటి నుంచో దేశంలో సాగుతోంది. ఎనిమిది వందల సంవత్సరాల క్రితం ముస్లింల పాలన, తరువాత ఆంగ్లేయుల ఏలుబడి దేశంలో ప్రారంభమైంది. నిజానికి మెజారిటీగా మారేందుకు ఎక్కువ మంది పిల్లలను కన్నా, మతమార్పిడులు చేసినా ఎప్పుడో ముస్లిం, క్రైస్తవ దేశంగా మారి ఉండేది. కానీ 2011 జనాభా లెక్కల ప్రకారం హిందువులు 79.8, ముస్లింలు 14.2శాతమే ఉన్నారు. పిల్లలను ఎక్కువగా కనటానికి కారణాల్లో దారిద్ర్యం, విద్యలేమి వంటి అనేక అంశాలున్నాయి. కుటుంబ నియంత్రణ గురించి గడచిన ఆరున్నర దశాబ్దాలుగా ప్రచారం చేస్తున్నప్పటికీ హిందువుల్లో 54.4శాతం ఉండగా ముస్లింలలో 45.3శాతం ఉంది. సగటున ముస్లింలు 2.36, హిందువులు 1.94 మందిని కంటున్నట్లు తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడించింది. రెండు మతాల వారి మధ్య పెద్ద తేడా ఏముంది. గణాంకాలను చూసినపుడు ముస్లింలలో జనాభా పెరుగుదల రేటు తగ్గుదల ఎక్కువగా ఉంది.1961–91 జనాభా పెరుగుదల రేటు వివరాలను చూసినపుడు మధ్యలో పెరిగినా, తగ్గినా హిందువుల్లో 20.7 నుంచి 22.7శాతం ఉండగా ముస్లింలలో 32.7 నుంచి 32.9శాతం ఉంది. తరువాత కాలంలో 2011 నాటికి హిందువుల్లో 16.7శాతం ఉండగా ముస్లింలలో 24.7శాతం ఉంది. తగ్గుదల రేటు ముస్లింలలో ఎక్కువగా ఉంది.

ఇక నరేంద్రమోదీ చేసిన ఎన్నికల ప్రసంగంపై అంతర్జాతీయ మీడియాలో దేశ పరువుతీసే విధంగా వార్తలు వచ్చాయి. గతంలో రాహుల్ గాంధీ విదేశాల్లో మోదీ విధానాల గురించి మాట్లాడి దేశ పరువు తీశారని విమర్శించిన బిజెపి ఇప్పుడు నరేంద్రమోదీ దేశంలో ఉండే చేసిన వ్యాఖ్యలు దేశపరువును ప్రశ్నార్థకం చేసినందున ఏం చెబుతుంది ? ఫ్రాన్స్ 24 టివి, వెబ్‌సైట్ ''ఆశ్చర్యం కలిగించని అసహ్యకర ప్రసంగం'' అన్న శీర్షికతో వార్తను ప్రసారం చేసింది. ఈ ప్రసంగం తరువాత మోదీ మీద చర్య తీసుకోవాలని పదిహేడు వేల మంది పౌరులు ఎన్నికల కమిషన్‌కు పంపిన వినతి మీద సంతకాలు చేసినట్లు పేర్కొన్నది. గత పది సంవత్సరాలుగా భారత్‌లో ఎన్నికలను పరిశీలిస్తున్నవారికి మోదీ ప్రసంగం ఆశ్చర్యం కలిగించలేదని, తన పునాదిని పెంచుకొనేందుకు విద్వేష ప్రసంగాలు చేయటంలో జయప్రదమైనట్లు పేర్కొన్నది. తాజాగా చేసిన అసహ్యకర ప్రసంగం గత పదిసంవత్సరాలలో చేసిన ప్రచారానికి అనుగుణంగా ఉందని, ప్రపంచ వేదికల మీద చెప్పే మాటలకు పూర్తి విరుద్దంగా స్వదేశంలో ప్రసంగాలు చేస్తున్నట్లు ఒక విశ్లేషకుడు చెప్పిన మాటలను ఉటంకించింది..

''భారతీయ ముస్లింలను చొరబాటుదారులని మోదీ ఎందుకు వర్ణించారు? ఎందుకంటే అతను అనగలడు'' అంటూ అమెరికాలోని ప్రముఖ పత్రిక న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన వార్తకు శీర్షిక పెట్టింది. భారత్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న మైనారిటీ సామాజిక తరగతిని నిందిస్తూ ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడటానికి దేశంలో లేదా బయటా తన అధికారానికి/ప్రభావానికి ఆటంకాలు ఏర్పడతాయని ఆయనకు స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఉందని ఆ పత్రిక వ్యాఖ్యానించింది. దేశంలో అధికారం, హిందూ ధోరణులు లోతుగా నాటుకున్న తరువాత ఆర్థికంగా, దౌత్య పరంగా భారత ఎదుగుదలను అవకాశంగా తీసుకొని ప్రపంచ రాజనీతిజ్ఞుడిగా పాత్ర పోషించేందుకు దృష్టి సారించారు. ఆ క్రమంలో ఎన్నికల్లో లబ్ది పొందేందుకు స్వంత పార్టీ చేస్తున్న మతపరమైన విభజిత కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. కానీ స్వదేశంలో తన అధికారానికి కొన్ని ఆటంకాలు ఏర్పడినట్లు మోదీకి కనిపిస్తున్నదని స్పష్టం చేసింది. స్వదేశంలో నిఘా సంస్థలు( మీడియా, అధికారిక, అనధికారిక నిఘా) మొత్తంగా భారతీయ జనతా పార్టీకి అనువుగా మారాయి. చైనాను నిలువరించేందుకు గాను భారత్‌ను నిలబెట్టాలని చూస్తున్నకారణంగా దేశంలో నరేంద్ర మోదీ ఏం చేస్తున్నారో చూడనిరాకరించటం విదేశీ భాగస్వాముల్లో పెరుగుతున్నదని పేర్కొన్నది.

మోదీ ప్రసంగాల గురించి అంతర్జాతీయ ఎపి ఇచ్చిన వార్తను ప్రపంచ పత్రికలన్నీ ప్రచురించాయి, టివిలలో చెప్పారు. మనదేశంలోని ముస్లింలు, హిందువులందరి జన్యువులు ఒకటేనని ఆర్‌ఎస్‌ఎస్ నేతలు గతంలో సెలవిచ్చారు. వసుధైక కుటుంబమని చెబుతారు. కుట్రతో విభజించారని, అఖండ భారత్‌ను ఏర్పాటు చేస్తామని చెబుతారు. మరి నరేంద్రమోదీ ముస్లింలను చొరబాటుదారులని ఎలా వర్ణించారు? సాధారణ పరిస్థితుల్లో అక్రమంగా వచ్చిన వారిని అలా వర్ణిస్తారు, అంతర్ యుద్ధాలు, ఇతర విపత్తులు తలెత్తినపుడు వచ్చేవారిని చొరబాటుదారులు అంటారా? శ్రీలంకలో ఉగ్రవాదుల దాడులు, ప్రభుత్వ ప్రతిదాడులు సమయంలో అనేకమంది అక్కడి తమిళులు మనదేశానికి ఆశ్రితులుగా వచ్చారు. వారిని చొరబాటుదారులుగా వర్ణించే ధైర్యం నరేంద్రమోదీకి ఉందా? ఆ మాటకు వస్తే మన పూర్వీకులందరూ ఆఫ్రికా, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే, రాజులు, రాజ్యాలు, సరిహద్దులు లేనపుడు జీవన పోరులో ఎక్కడో ఒకచోట స్థిరపడ్డారు. అంటే మోదీ భాష్యం ప్రకారం అందరూ చొరబాటుదారులే!

# సగటుజీవి బతుకు కష్టమే!

దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నదని కేంద్రంలోని బిజెపి సర్కారు ఎంతగా గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, సగటు జీవి బతుకు ఏమాత్రం మారడం లేదు. కష్టాలు తీరడం లేదు. వెతలు తగ్గడం లేదు. అడ్డూఅదుపూ లేకుండా ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు సామాన్యుడిని కలవర పెడుతోంది. ద్రవ్యోల్బణ రేటు 2 నుంచి 6 శాతం వరకూ ఉండవచ్చు. 6.8 శాతాన్ని అత్యధికంగా పేర్కొంటారు. అంతకు మించి ద్రవ్యోల్బణ రేటు నమోదైతే, ప్రజలు కనీస అవసరాలను కూడా కొనలేని భయానక పరిస్థితి నెలకొందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) స్పష్టం చేస్తున్నది. అయితే, గత ఏడాది చాలా కాలం మన దేశంలో ద్రవ్యోల్బణ రేటు ఆరు శాతానికి మించే కొనసాగింది. కొన్ని సందర్భాల్లో 7.62 శాతానికి కూడా చేరుకుంది. ప్రస్తుతం 5.10 శాతంగా ఉందని అంటున్నప్పటికీ, ఈ గణాంకాలు, లెక్కలు, అంకెలు అన్నీ రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేసినవేనన్న అనుమానాలు లేకపోలేదు. ఏదిఏమైనా, లెక్కలతోగానీ, రుజువులు, సాక్ష్యాలతోగానీ సంబంధం లేకుండా, ధరలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదన్న విషయం అందరికీ తెలుసు. కనీస అవసరాల కోసం కూడా దేశంలో అత్యధిక శాతం మంది నిత్యం పోరాడుతునే ఉన్నారన్నది కూడా వాస్తవమే. భరించే స్థాయి కంటే ఎక్కువగా ద్రవ్యోల్బణ రేటు ఉందనే అనుమానాలు రేకెత్తించేలా, ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వినియోగదారుల ధరల సూచీ (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్) గమనించినా, ఈ విషయం స్పష్టమవుతుంది. బియ్యం, గోధుమలు, పప్పులు, నూనెలు... ఇలా, ఒకటని ఏమిటి? అన్ని నిత్యావసరాల ధరలు ప్రజలను భయపెడుతున్నాయి. కూరగాయల విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దాదాపు అన్ని ఆకు కూరలు, కూరగాయల ధరలు ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ఏడాది సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఫలితంగా, గోధుమలు మినహా మిగతా పంటల ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) హెచ్చరికలు జారీ చేసింది. కూరగాయలకు కొరత ఏర్పడుతుందని, ధరలు విపరీతంగా పెరుగుతాయని కూడా స్పష్టం చేసింది. గత పదేళ్ల కాలంలో దాదాపుగా అన్ని రకాల వస్తుసేవల ధరలు, ఫీజులు రెండుమూడు రెట్లు పెరిగాయి. కరోనా పుణ్యాన ఊడిన ఉద్యోగాలు, తగ్గిన ఉపాధి అవకాశాలు ఇప్పటికీ ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదన్నది చేదు నిజం.



ఫలితంగా వస్తున్న ఆదాయానికి, పెట్టాల్సిన ఖర్చులకు పొంతన లేని పరిస్థితి ఏర్పడటంతో పేదలతో పాటు మధ్యతరగతి ప్రజానీకం కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని, అది అంత ప్రాధాన్యతగల అంశం కాదని మోడీ ప్రభుత్వం ఎన్ని సన్నాయి నొక్కులు నొక్కుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు సగటు జీవికి నిద్రలేకుండా చేస్తున్నాయి. పెరగుతున్న ధరలు జీవితాలను అతలాకుతలం చేస్తుంటే, ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ కేంద్ర ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదం. ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి, ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతానికి నియంత్రించే బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలి. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆరు శాతానికి మించకూడదు. కానీ, చాలాకాలంగా ద్రవ్యోల్బణ నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధాల కారణంగా, ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడం కష్టమవుతున్నదని పలు రాష్ట్ర ప్రభుత్వాల ఆరోపణ. బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులను నిలిపివేసి, వాటాలను స్తంభింప చేసి మోడీ ప్రభుత్వం వినోదం చేస్తున్న వైనం కొత్తేమీ కాదు. తమ వాటా నిధుల కోసం కర్నాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించాయంటే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరును స్పష్టమవుతున్నది. ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక ఉత్పత్తి పెంచడం వంటి అంశాలను కేంద్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అటు ఆదాయం లేక, ఇటు ధరలు అందుబాటులో లేక సామాన్యుడు ఎన్ని కష్టాలు పడుతున్నాడో చెప్పడానికి మాటలు చాలవు. ధరాఘాతానికి ప్రజలు విలవిల్లాడుతున్నా, ప్రభుత్వాల్లో పెద్దగా చలనం లేదు. ద్రవ్యోల్బణాన్ని అదుపుచేసే పేరిట అటు ఆర్‌బిఐ, ఇటు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రజా సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ధరలను నియంత్రించడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను గణనీయంగా పెంచాలి. ఆహారధాన్యాల ధరలను అదుపులో ఉంచాలి. పేదలను కొట్టి కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలకు తక్షణం స్వస్తి చెప్పాలి. లేకపోతే, దేశంలో ఆకలి కేకలు తప్పవు.

# సుత్తి కొడవళ్ళకు... పదును పెట్టాలి

పోరాటాల నెగళ్ల నుంచి ఎగిసిపడినవె సుత్తి కొడవళ్ళు. జన హృదయాల్లో అరుణ తారలై నిలుస్తున్నాయి. వామపక్షాలు. బుద్ధి జీవుల, కష్ట జీవుల సమస్యలను జెండాగా.. ఎజెండాగా రూపొందించి పోరాట కొలిమిలో సుత్తీ కొడవళ్ళకు పదును పెడుతున్నాయి... సిపిఐ, సిపిఎం పార్టీలు. ఏ సమస్య వచ్చిన గుండె గుండెను కదిలించి, గడప, గడపను పలకరించి అరుణ సైన్యంలా పోరాట పథంలో సాగుతున్న ఈ రెండు పార్టీల ప్రాధాన్యత లోక్‌సభలో క్రమంగా తగ్గుతోంది.

లోకసభలో జన గళాన్ని వినిపించడానికి వామపక్ష పార్టీలే ప్రధానంగా సిపిఐ, సిపిఎం సభ్యుల సంఖ్య పెరగాల్సి వుండగా 1984 దశకం నుంచి 2019 ఎన్నికల వరకు తగ్గుతూ వస్తోంది. 1951 లోక సభ ఎన్నికలనుంచి 1984 ఎన్నికల వరకు సిపిఐ, 1967 ఎన్నికల నుంచి 1984 ఎన్నికల వరకు సిపిఎం సభ్యుల సంఖ్య లోక్‌సభలో గణనీయంగా ఉండేది.

సభలకు సమావేశాలకు, ఆందోళనలకు తరలివచ్చి అరుణ పతకంతో కదంతొక్కే తాడితులు, పిడితులు, శ్రామికులు, ఓటు వేస్తున్నప్పటికి ఇతర వర్గాలన్న దగ్గర కావడం లేదా! అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 1951లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో సిపిఐ. 99 పోటి చేయగా 16 స్థానాల్లో విజయం సాధించి 3.29శాతం ఓట్లు సాధించింది. 1957లో 110 స్థానాల్లో పోటీ చేయగా, 27 స్థానాల్లో విజయం సాధించి 8.29 శాతం ఓట్ల వచ్చాయి. 1962లో 137 స్థానాల్లో పోటీచేయగా, 29 స్థానాల్లో విజయం సాధించి 9.94 శాతం ఓట్లు రాగా , 1967లో 109 స్థానాల్లో పోటీ చేయగా, 23 స్థానాల్లో గెలుపొంది 5.11 శాతం ఓట్లు వచ్చాయి. 1980లో 47 స్థానాల్లో పోటి చేసి 10 స్థానాల్లో గెలిచి 2.49 శాతం; 1984లో 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో విజయం సాధించి 2.71 ఓటింగ్ శాతం వచ్చింది. 1989లో 50 స్థానాల్లో పోటీ చేసి 12 స్థానాల్లో విజం సాధించి 2.57 శాతం ఓట్లు, 1991లో 42 స్థానాల్లో పోటి చేసి 14 స్థానాల్లో విజయం సాధించి 2.49 శాతం ఓటింగ్‌ను సిపిఐ సాధించింది. 1999లో 54 స్థానాల్లో పోటిచేసి 4 స్థానాల్లో గెలిచి 1.48 శాతం ఓటింగ్ సిపిఐ పొందగలిగింది. 2004లో 34 స్థానాల్లో పోటీచేసి 10 స్థానాల్లో జయభేరి మోగించి 1.41 శాతం, 2009లో 56 స్థానాల్లో పోటీచేసి 4 స్థానాల్లో విజయం సాధించి 1.43 శాతం ఓటింగ్‌ను పొందింది. 2014లో 67 స్థానాల్లో పోటిచేసి 1 స్థానాల్లో గెలిచి 0.79 శాతం 2019లో 49 స్థానాల్లో పోటిచేసి 2 స్థానాల్లో గెలచి, 0.59 శాతం ఓటింగ్‌ను పొందింది సిపిఐ.

కాగా 1967 నుంచి 2019 వరకు సిపిఐ (ఎం) సాధించిన ఫలితాలను చూద్దాం. 1967లో 59 స్థానాల్లో పోటీచేయగా 19 స్థానాలు గెలిచి 4.28 శాతం ఓట్లు, 1971లో 85 స్థానాల్లో పోటిచేసి, 25 స్థానాల్లో విజయం సాధించి 5.12 ఓటింగ్ శాతను పొంద కల్గింది. 1977లో 53 స్థానాల్లో పోటిచేసి 22 స్థానాల్లో గెలిచి 4.29 శాతం ఓటింగ్, 1980లో 64 స్థానాల్లో పోటిచేసి 37 స్థానాల్లో విజయం సాధించి 6.24 శాతం ఓటింగ్‌ను సి.పి.ఎం పొందింది. 1999లో 72 స్థానాల్లో పోటి చేసి 33 స్థానాల్లో విజయం సాధించి 5.40 శాతం ఓటింగ్‌ను పొందింది. 2004లో 69 స్థానాల్లో పోటిచేసి 33 స్థానాల్లో గెలిచిన 5.66 శాతం ఓటింగ్‌ను పొందింది. 2009లో 82 స్థానాల్లో పోటిచేసి 16 స్థానాలు గెలిచి 5.33 శాతం ఓటింగ్‌ను సాధించింది. 2014లో 93 స్థానాల్లో పోటిచేసి 9 స్థానాలు గెలిచి 3.28 శాతం ఓటింగ్‌ను, 2019లో 69 స్థానాల్లో పోటిచేసి 3 స్థానాల్లో విజయం సాధించి 1.77 శాతం ఓటింగ్‌ను పొందింది. 1999, 2009, 2014, 2019లో జరిగిన ఎన్నికలు సిపిఐ నిరాశ కల్పించగా, 2014, 2019లో జరిగిన లోకసభ ఎన్నికలు సిపిఎంకు ఆందోళన కల్గించింది. రానున్న లోకసభ ఎన్నికల్లో సుత్తీ కొడవళ్ళకు సానబెట్టి ఎన్నికల కురుక్షేత్రంలో అరుణ పతాకాన్ని రెపరెపలాడించాల్సిన బాధ్యత సిపిఐ; సిపిఎం నాయకత్వంపై ఉంది. అభిప్రాయ బేదాలకు తావులేకుండా ఆలోచనలకు పదను పెట్టి ఎత్తగడ పదునైనా వ్యూహంతో ఎన్నికల సమరంలోకి సిపిఐ, సిపిఎం నాయకత్వం దిగి లోకసభ ఎర్రజెండా ను రెప రెపలాడించాలి.

**గుర్రం రాంమోహన్ రెడ్డి**
7981018644

**లేఖలు**

## గ్రేటర్ హైదరాబాద్ డ్రైనేజీ వ్యవస్థ పట్ల శ్రద్ధ చూపాలి

నేటి మారుతున్న కాలంలో ప్రతి తండా, పల్లె, గ్రామం, పట్నం, నగరం, మహానగరాలు ఎక్కడైనా మురుగునీటి పారుదల వ్యవస్థ అత్యంత ప్రాముఖ్యంతో కూడుకొని ఉంది మరియు ఈ వ్యవస్థలో ఆధునిక సాంకేతికతతో కూడిన యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈ వ్యవస్థ చక్కగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించటానికి వీలుపడుతుంది.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, నిర్వహణ అత్యంత దారుణమైన పరిస్థితిలో ఉంది. నగరంలో ప్రధానమైన, ప్రాముఖ్యమైన ప్రదేశాలు మినహాయించి ఇతర ప్రాంతాలలో అస్తవ్యస్తంగా మనకు కనిపిస్తుంటుంది. నాణ్యమైన వస్తువులు ఇతరత్రా ఉపయోగించకపోవడం వలన ఈ పరిస్థితి ఎదురవుతుంది. అంతేకాక నెలల తరబడి డ్రైనేజీ చాంబర్లను, పైపులను శుభ్రపరచకపోవడం వలన తరచుగా ప్రవాహంలో అంతరాయం ఏర్పడి దుర్గంధమైన వాసన వెదజల్లుతూ రోడ్లపై నదీ ప్రవాహంగా ఏర్పడుతుటుంది. అధిక కాలనీలలో నెలలు, సంవత్సరాలు తరబడి కూడా ఈ పైపులైన్ల వ్యవస్థ ను శుభ్రపరచుటకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు కనపడడం లేదు. ఫిర్యాదు చేసినప్పుడు అవసరమైన చోట మాత్రమే లైనును శుభ్రం చేస్తుంటారు.

పలు కాలనీలలో డ్రైనేజీ చాంబర్ల మరమ్మతులు చేస్తుంటారు కానీ ఈ పనిని రోజులు నెలల తరబడి దీర్ఘకాలంగా కొనసాగించడం వలన చాంబర్ల వద్ద ఉన్న పైపులైన్లలోనికి మట్టి నీరు పోయి తిరిగి సమస్య పునరావృతం అవుతున్నది. డ్రైనేజీ వ్యవస్థను నిరంతరంగా శుభ్రం చేయుటకు మానవ వనరులకు బదులుగా ఆధునిక యంత్రాలను వినియోగించాలి. ఒక కాల నిర్ణయం పట్టిక ఏర్పాటు చేసుకొని ప్రజలనుండి ఫిర్యాదులు రాక ముందే తగు మరమ్మత్తులు, నిర్వహణ కాలానుగుణంగా చేపట్టాలి. హైదరాబాద్ మహా నగరాన్ని అందంగా, శుభ్రం గా ఉంచుటకు ప్రజలందరూ సహకరించాలి. ప్రభుత్వం జిహెచ్‌ఎంసి ఉద్యోగు లు, అధికారులు తమ కర్తవ్యాన్ని అంకిత భావంతో నిర్వహించినప్పుడే సాధ్యం అవుతుంది.

దండంరాజు రాంచందర్ రావు

## మామిడి రైతులను ఆదుకోవాలి

పండ్ల తోటల్లో మామిడి పంట చాలా ప్రముఖమైనది. అందుకే దీనిని పండ్లలో రారాజు అని పిలుస్తారు. కొన్ని వందల సంవత్సరాల నుండి ఈ పంటను సాగుచేస్తున్నారు. ప్రపంచంలోనే మామిడిని పండించడంలో మన దేశం ప్రథమ స్థానంలో ఉంది. మామామిడిని మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా కృష్ణా, ఖమ్మం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, కరీంనగర్, విశాఖపట్నం, చిత్తూ రు, కడప, అదిలాబాదు, నల్గొండ జిల్లాల్లో సాగుచేస్తున్నారు. మామిడిని పండించడానికి అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉంటాయి. కానీ లోతైన నేలల్లో వేర్లు బాగా వ్యాపించి, చెట్టు అభివృద్ధి చెంది చాలాకాలం ఫలాన్నిస్తాయి. సంవత్సరంలో ఒకసారి వచ్చే మధురమైన పంట మామిడి పంట.

ఈ సంవత్సరం కాపు సంతృప్తికరంగా లేదు, డిసెంబర్ జనవరి నెలల నుండి విపరీతమైన ఎండలు ఉండడంతో పూత నిలవలేదు. కాపు పూర్తిగా పలుచగా ఉంది. కొన్నిచోట్ల కాపు లేదు. గత నెల రోజులుగా హోల్ సేల్ మార్కెట్లో ధర 900 నుండి 1800 వరకు బాక్స్‌కు ఉండటంతో సామాన్యుడికి అందుబాటులో లేని ధర. దళారీలు నెలకిందట తక్కువ ధరకు చెట్లు కొని ఎక్కువ ధరకు మార్కెటు కు తరలిస్తున్నారు. నిండా కాపు ఉన్న చెట్టు కాయలు ఐదు వందల నుంచి ఏడు వందల వరకు వ్యాపారస్తులు పెడుతున్నారు. మూడు వందల చెట్లకు రెండు లక్షలు మించడం లేదు. సంవత్సర కాలం కంటికి రెప్పలా చూసుకున్న కాపలాదారుడు జీతానికి సరిపోయేటట్లు ఉంది. రైతులకు పెట్టుబడి లేక చెట్లు తీసివేసే ప్రమాదం ఉంది. గత దశాబ్ద కాలంగా కోల్డ్ స్టోరేజ్ యూనిట్స్, ధాన్యం నిలువ చేసుకోవడానికి వేర్ హౌస్‌లు లేక రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. ప్రతి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు ప్రకటిస్తున్నారు కానీ ఎక్కడా మార్కెట్ సౌకర్యం, సరకు నిల్వ సౌకర్యం, గిట్టుబాటు ధర, రవాణా సౌకర్యం ఉండటం లేదు.

వేరుశెనగ వేసుకుంటే గిట్టుబాటు లేదని పత్తికి మారి, పత్తికి గిట్టుబాటు లేదని, టమోటా, టమోటా నుండి మిర్చీ మిర్చీ నుండి ఫల సంప్రదాయానికి మారినా నష్టాలు మిన్నంటుతున్నాయి. దేనికి మారిన అదృష్టం మార క అప్పుల ఊబిలో కొట్టుకుపోతున్నారు. అది తెలంగాణ అయినా ఆంధ్రాలో అయినా రైతు గోస ఒక్కటే.

అకాల వర్షాలకు పిందెలు, కాయలు రాలిపోయి చాలా చోట్ల ఇరవై కిలోల బాక్స్ మార్కెట్ ధర రెండు వేలు మార్కెట్ ధర. సాధారణంగా మామిడి, అరటి, బొప్పాయి పళ్ళను పూర్తిగా పండకుండానే చెట్ల నుండి కోసి, తర్వాత వాటిని మగ్గ బెడతారు. సాధారణంగా పళ్ళను మగ్గ పెట్టడానికి ఎథ్రెల్ స్ప్రే చేయడం గానీ, వాటిని ఎథ్రెల్ ద్రవంలో ముంచడం గానీ చేస్తారు. అయితే అది శ్రమతో కూడిన పని. అదీకాక బయట అమ్మే ఎథ్రెల్ లో కల్తీ రసాయనాలు ఉంటే సమస్యలు వస్తాయి. దీనికి ప్రత్యామ్నాయంగా, పళ్ళను మగ్గబెట్టి గోదాములలో ఇథిలీన్ గ్యాస్ ఉపయోగిస్తారు. అయితే దీనికి ఎక్కు వ పెట్టుబడి అవసరమవుతుంది. రైతులకు, చిన్న వ్యాపారులకు ఆర్థికంగా గిట్టుబాటు అవదు. కాబట్టి తక్కువ పెట్టుబడితో పళ్ళను మగ్గించడానికి ప్లాస్టిక్ టెంట్లలో ఇథలీన్ గ్యాస్‌ను వదిలి పళ్ళను పండబెట్టడం రూపొందించారు. ఇతర ఉద్యాన పంటలలో లాగానే, మామిడిని కూడా చాలా రకాల పురుగులు ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. వాటిలో ప్రధానమైనవి తేనెమంచు పురుగు, టెంక పురుగులు, వందు ఈగ, పిండి పురుగులు.

ఎన్ని ఎత్తులు వేసి మార్కెట్టుకు కాయ లు తరలించినా ఆరుగాలం శ్రమించిన రైతుకు దక్కేది శూన్యం, దళారులకు భోజ్యం. తక్షణం రైతులను ఆదుకొని రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మంత్రులు నిర్దిష్ట ప్రణాళికతో సత్వరమే మార్కెట్, నిల్వ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉంది.

డా ఎం. సురేష్ బాబు.

## బైండోవర్ ఉల్లంఘించిన వారిపై చర్యలు



**ప్రజాపక్షం / హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గల గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఇరువర్గాల వ్యక్తులపై హుజూర్‌నగర్ సిఐ,గరిడేపల్లి ఎస్ఐలు శుక్రవారం హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు ముందు 107 సిఆర్‌పిసి ప్రకారం 12 మందిని బైండోవర్ చేయనైనది. దీని ప్రకారం బైండోవర్ అయిన వ్యక్తులు ఒక సంవత్సర కాలంలో ఏదైనా కేసు వారిపైన నమోదు అయినచో వారు రూ.2లక్షలు కట్టవలసి ఉంటుందని, అట్టి డబ్బులు కట్టనిచో జైలుకు వెళ్లాలి. ఈ విషయం ఇరువర్గాల వారికి తెలియపరిచారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో హుజూర్‌నగర్ సర్కిల్ నందు గల అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్నికలకు విఘాతం కలిగించే వ్యక్తులు అయి న రౌడీలు, సస్పెక్ట్స్, ట్రబుల్ మంగర్స్, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తులను అసెంబ్లీ ఎన్నికలకు ముందే 110 సిఆర్‌పిసి ప్రకారం అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో తహసీల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగింది. దీని ప్రకారం బైండోవర్ అయిన వ్యక్తులు ఒక సంవత్సరం కాలంలో ఏదైనా కేసు వారిపై నమోదు అయినచో వారు లక్ష రూపాయలు కడతామని తమ సొంత పూచికత్ ఇచ్చినారు కానీ కొందరు అట్టి బైండోవర్‌ను లెక్క చేయకుండా అదిగమించి కేసులలో ఉన్నారు. అందులో హుజూర్‌నగర్ పిఎస్ 2, మఠంపల్లి పిఎస్ 6, గరిడేపల్లి పిఎస్ 1 పాలకవీడు పిఎస్ 2 మొత్తం 11 మంది బైండోవర్‌ను అధిగమించారు.కాబట్టి అట్టి వ్యక్తులను మొత్తం డబ్బులు కట్టించడం లేదు జైలు పంపడం జరుగుతుందని హుజూర్‌నగర్ సిఐ చరమంద రాజు తెలిపారు.

## హమాలీల మెరుపు సమ్మె

### 65వ జాతీయ రహదారిపై రాస్తారోకో



**ప్రజాపక్షం / సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం హమాలీ కార్మికులు మార్కెట్ కార్యదర్శికి నోటీసులు అందజేసి మెరుపు సమ్మెకు దిగారు. దీంతో మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఆగ్రహించిన అన్నదాతలు మార్కెట్ కార్యాలయానికి తాళం వేసి 65వ నెంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మార్కెట్ యార్డుకు రైతులు అమ్మకానికి 30వేల బస్తాల వరిధాన్యాన్ని తీసుకురావడం జరిగింది. ధాన్యం కొనుగోలు చేసేందుకు ఖరీదుదారులు ఇనాం పద్ధతిలో టెండర్లు కూడావేసి ధరలు నిర్ణయించారు. గతంలో హమాలీలకు ధాన్యం నింపేందుకు గన్నీబ్యాగులు ఇవ్వగా ఏ సమస్య లేకుండా కాంటాలు సాఫీగా చేసేవారు. వీటికి బదులుగా ప్లాస్టింగ్ బస్తాలు ఇవ్వడంతో ఎండ వేడిమితో బస్తాల్లో మేము కాంటాలు వేయమని తెగేసి చెప్పు మెరుపు సమ్మెకు దిగారు. దీంతో రైతులు ఆగ్రహానికిలోనై మార్కెట్ కార్యాలయానికి తాళం వేసి సమీపంలోని హైద్రాబాద్–విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రైతుల రాస్తారోకోతో జాతీయ రహదారిపై ఇరువైపుల వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మార్కెట్‌లో తమ ధాన్యం అమ్ముకునేందుకు నాలుగు రోజుల క్రితం ధాన్యం తీసుకువచ్చామని కానీ కొనుగోలు జరగలేదన్నారు. ఈ రోజు (శుక్రవారం) అయిన కాంటాలు పూర్తి అవుతాయని తాము ఆశతో ఎదురు చూస్తే హమాలీలు కాంటాలు వేయకుండా సమ్మెకు దిగడం జరిగిందన్నారు. ఇక చేసేది ఏమి లేక తాము ఆందోళనకు దిగామని చెప్పారు. రైతులు రాస్తారోకో చేస్తున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్, జిల్లా మార్కెటింగ్ అధికారి కె నాగేశ్వర్ శర్మ, ఆర్‌డిఓ వేణుమాధవ్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డిలు రైతుల సమస్యల పరిష్కరించాలని ఆదేశించడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని హమాలీలతో చర్చలు జరిపారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కాంటాలు వేయ్యాలని కోరారు. మార్కెట్ కార్యదర్శికి నోటీసులు ఇచ్చి సమ్మెకు దిగడం సరికాదని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో వారు శనివారం ఉదయం 6 గంటల నుండి కాంటాలు వేస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. శుక్రవారం జరిగిన టెండర్ల ప్రకారం యధావిధిగా ధర చెల్లిస్తామని రైతులకు అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

## రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలి



**ప్రజాపక్షం / నల్లగొండ :** లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోజ్ కుమార్, మానిక్‌రావు, సూర్య వంశీ కోరారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీలో ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు . లోకసభ ఎన్నికలకు సంబందించి ఓటరు జాబితా అన్ని పార్టీలకు అందించడం జరిగింది అన్నారు. ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈవిఎం ద్వారా పోలింగ్ రోజు నిర్వహించే మాక్‌పోల్ విషయంలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, సి–విజిల్ ఆప్, సువిధ తదితర అంశాల గురించి ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు కళ్యాణ్ కుమార్‌దాస్ మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీలు వారికి సంబందించిన ఎన్నికల ఖర్చుల నిర్వహణను పక్కగా నిర్వహించాలని, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎన్నికల పోలీసు పరిశీలకులు ఆమోఘ్ జీవన్ గాంకర్, జడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యాదాద్రి జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు



**ప్రజాపక్షం /యాదాద్రి ప్రతినిధి:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగంగా జరుగుతున్నాయని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ శాలోమ్ నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 323 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరుగుతున్నాయని, దీనితో పాటు అదనంగా గుండాల మండలం వంగాల గ్రామంలో ఐకెపి ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 8483 మంది రైతుల నుండి 85,549 మెటిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 35 కోట్ల రూపాయలు వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతు కల్పించడం జరిగిందని, ప్రతి కేంద్రంలో 25 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, మిల్లర్ల కోసం కొనుగోలు కేంద్రాల దగ్గరలో ఉన్న ఎ.ఎం.సి. గోదాములను తెరవడం జరిగిందని, వర్షాలు ఇతర అవసరారాల దృష్ట్యా వాటిని స్టాక్ పాయింట్లుగా వినియోగించడం జరుగుతుందని తెలిపారు. బీహారు ఎన్నికల దృష్ట్యా హమాలీల కొరత రాకుండా మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఇతర హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, ట్రక్ షీట్లను మిల్లుల నుండి కొనుగోలు కేంద్రాలకు వెంటనే పంపాలని హెచ్చరించడం జరిగిందని, తద్వారా ట్యాబ్ ఎంట్రీలు పెరిగాయని, రైతుల పేమెంట్లు పెరిగాయని అన్నారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ద్వారా వ్యవసాయ విస్తరణాధికారులకు ధాన్యం గ్రేడ్లపై అవగాహన కలిగించడం జరిగిందని, మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేయవద్దని ట్రేడర్స్ కు హెచ్చరించారు. ప్రతి మండలంలో ధాన్యం కొనుగోళ్ల సమస్యల పట్ల మండల స్పెషల్ ఆఫీసర్ల ఫోన్ నెంబర్లు కొనుగోలు కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతున్నదని తెలిపారు.

## గోదావరి జలాలతో సాగునీరు అందించి సస్యశ్యామలం చేసే బాధ్యత మాది

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి





**ప్రజాపక్షం / భూదాన్ పోచంపల్లి:** తలాపున పారుతున్న గోదావరి జలాలతో ప్రతి ఎకరాకు సాగునీరు అందించి పోచంపల్లి మండల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని రైతులను అన్ని వర్గాల ప్రజలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో పార్లమెంటరీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన రోడ్డు వెంబడి అత్యంత ప్రతిష్టాత్మకంగా సాగిన భారీ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పార్లమెంటరీ ఎంపి అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డిలు ప్రచార రథంపై సాగుతూ వుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఈ ర్యాలీలో పాల్గొని బ్యాండ్ బాజా లతో పూల వర్షాన్ని కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి అసెంబ్లీ ప్రజలు 40 ఏళ్ల చరిత్రను తిరగరాసి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి పట్టం కట్టారని ఈ సందర్భంగా ప్రజలకు అభినందనలు తెలియజేశారు. బస్వాపురం రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను తీసుకువచ్చి చెరువులను కాలువల్లో నీళ్లు నింపి ప్రతి ఎకరాలు నీళ్ళందించి సస్యశ్యామలం చేసి రైతన్నను ఆదుకొని అన్నపూర్ణ నేలగా మార్చుకునే వరకు నిద్రపోనని శపథం పూనారు. తాను గతంలో ఎంపిగా పనిచేసినప్పుడు చేసిన అభివృద్ధిని కరువు వచ్చినప్పుడు సొంత నిధులు వెచ్చించి రైతాంగాన్ని కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. పేదల పార్టీ అన్నం పెట్టేది స్వాతంత్రం తీసుకొచ్చినది తెలంగాణ రాష్ట్రం ఇచ్చినది ప్రజాపాలన అభివృద్ధికి చిరునామాగా మార్చే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నంటే నిలిచి చేయి గుర్తుపై ఓటు వేసి చామల కిరణ్ కుమార్ రెడ్డిని ఎంపిగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. భువనగిరి నియోజకవర్గం ప్రజలకు ఏ ఆపద వచ్చినా మంత్రులతో పాటు మా అందరి అండదండలు పూర్తిగా ఉంటాయని భరోసానిచ్చారు.

### క్రాఫ్ట్ విలేజ్‌గా పోచంపల్లిని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

అంతర్జాతీయంగా యూనిస్కోతో గుర్తింపు పొంది హెరిటేజ్ విలేజ్ గా విలసిల్లుతున్న పోచంపల్లిలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అలాగే చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.30 కోట్లతో క్రాఫ్ట్ విలేజ్‌గా పోచంపల్లిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కనుముకుల గ్రామంలో ఉన్న పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన అన్నారు. శ్రీరామానంద తీర్థ సంస్థలు సంస్థను స్కిల్ డెవలప్మెంట్ విశ్వవిద్యాలయంగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు.

### తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చింది కెసిఆర్: ఎంపి అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి

9 ఏళ్ల పాలనలో నీళ్లు నిధులు నియామకాలు పేరు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసి అప్పుల రాష్ట్రంగా మార్చింది కెసిఆర్ అని విమర్శించారు. విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యుఐ 20 సంవత్సరాలుగా పోరాడుతూ ఉన్నానని ఎంపిగా అధిష్టానం అందరి సహకారంతో గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజా సమస్యల పట్ల గొంతు విప్పి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్ , కైలాష్, పట్టణ మండల శాఖ అధ్యక్షులు భారత లవ కుమార్ ,పాక మల్లేష్ యాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నరసింహారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి , గునిగంటి రమేష్ గౌడ,పకీరు మల్లారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బండారు ప్రకాష్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ లేకుండా గుండెకు అరుదైన చికిత్స

### సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డా.ప్రమోద్ కుమార్



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:** హైదరాబాద్ సోమాజిగూడలో యశోధ ఆస్పత్రిలో అత్యంత అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి ఓ మహిళకు కొత్త జీవితాన్ని అందించినట్లు సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ కుచులకంటి ప్రమోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్‌లోని యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. గోదావరిఖనికి చెందిన నరెడ్ల సుజాత, ఏడాదికాలం గా దగ్గుతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితిలో 8 నెలల క్రితం సోమాజిగూడలోని తమ ఆస్పత్రికి వచ్చిందన్నారు. ఆమెకు పరీక్షలు నిర్వహించగా గుండెకు సంబంధించిన థొరాసిక ఉదర బృహద్ధమని రక్తనాళం ఉబ్బిపోయి బాధపడుతుందని తెలిసిందన్నారు. ఆమెకు అధునాతన చికిత్స ద్వారా ఆయోటిక్ స్టంట్ వే సి ఆమెను కాపాడినట్లు తెలిపారు. ఆపరేషన్ లేకుండా గుండె వాల్వులను సైతం రిప్లేస్మెంట్ చేస్తున్నామన్నారు. ఇటీవల కార్డియాక్ అరెస్టుల సంఖ్య పెరుగుతుందన్నారు. దీనికి ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో పాటు, దూమపానం, మద్యపానం, ఆరోగ్యకరమైన జీవన శైలి లేకపోవడమని పేర్కొన్నారు. వైద్య విధా నంలో అడ్వాన్సుడ్ పరీక్షలతో పాటు అధునాతన చికిత్సలు అం దుబాటులోకి వచ్చాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని జీవించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. యశోదలో కార్డియాలజీ టీం ఉందని, ఎప్పటికప్పు డు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని, రోగులకు నాణ్యమైన చికిత్సను అందిస్తూ మెరుగైన ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. తాము అందించిన చికిత్స ద్వారా సుజాత పూర్తిగా కోలుకుని 8 నెలలుగా ఆరోగ్యంగా జీవిస్తోందన్నారు. గుండె వైఫ ల్యం అనేది అతికొద్ది మందిలో మాత్రమే వస్తుందని, అప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. అన్నిరకాల వైద్యులు, అధునాత వైద్య సదుపాయాలు యశోద ఆస్పత్రిలో ఉండడం వల్లే ఇలాంటి ఆపరేషన్లు విజయవంతం అవుతున్నాయని తెలిపారు. ముప్పై సంవత్సరాలు దాటిన వారు సిటీ కరొనరీ యాంజియోగ్రామ్ చేసుకుంటే ఐదేళ్ల వరకు హ్యా పీగా జీవించవచ్చన్నారు. అనంతరం సుజాత మాట్లాడుతూ తా ను బతుకుతానని అనుకోలేదని, యశోద ఆస్పత్రి వైద్యులు అందించిన అధునాతన వైద్యంతో ఇప్పుడు సాధారణ జీవితాన్ని గడపడం సంతోషంగా ఉందన్నారు. గోధావరిఖని, కరీంనగర్, హైదరాబాద్ ఇలా పలుచోట్ల ఎన్నో ఆస్పత్రులను తిరిగినా సరైన పరిష్కారం అందించకపోగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని, అం దుకు రూ.25 నుంచి రూ.30 లక్షల వుతుందని తెలిపారు. య శోద ఆస్పత్రిలో ఆపరేషన్ లేకుండా, ఎటువంటి ఇబ్బంది లే కుండా తక్కువ ఖర్చులో వైద్యం అందించారన్నారు. తనకు య శోద ఆస్పత్రి వైద్యులు పునర్జన్మను అందించారని డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## పక్కాగా పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్: కలెక్టర్




**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పక్కాగా నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించారు. ఈ ప్రక్రియను కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల సాధారణ, పరిశీలకులు అమిత్ కటారియా పర్యవేక్షించారు. సాఫ్ట్‌వేర్ పనితీరు, పోలింగ్ సిబ్బంది అలాట్‌మెంట్ వివరాలను టెక్నికల్ మేనేజర్‌ను పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. ఎంత మందిని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కేటాయించారని వివరంగా తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ సిబ్బందిని సెకండ్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేశామని పేర్కొన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఓపిఓలను మొత్తం 5066 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అలాట్ చేశామని చెప్పారు. వీరికి ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమం త్వరలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. బాధ్యతాయుతంగా అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, కరీంనగర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్‌వో పవన్ కుమార్, సిపివో కొమురయ్య, డిఐవో శివరాములుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రూ.5 కోట్ల విలువగల గంజాయి దగ్ధం

### గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు : ఎస్‌పి చందనా



**ప్రజాపక్షం / నార్కట్‌పల్లి :** మాదక ద్రవ్యాల నిర్ములనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా అక్రమ గంజాయి రవాణా పైన జిల్లా పోలీసుల ఉక్కుపాదం మోపడంతో పాటు అక్రమ గంజాయి నివారణపైన నిరంతర నిఘా పెడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలలో 39 కేసులలో 2043 కేజీల గంజాయిని సీజ్ చేసిన 5 కోట్ల 10 లక్షల 75 వేలవిలువ గల 2043 కేజీల గంజాయిని కోర్టు ఉత్తర్వుల ప్రకారం నిర్మానుషంగా జనావాసానికి దూరంగా ఉన్నటువంటి నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్‌రేంజ్‌నందు శుక్రవారం జిల్లా ఎస్‌పి, డ్రగ్ డిస్పోజల్ కమిటీ అధ్వర్యంలో నిర్వీర్యం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు అక్రమ గంజాయి సరఫరా చేయు వారిపైన ప్రత్యేక నిఘా పెడుతూ 39 కేసులలో 2043 కిలోల గంజాయిని సీజ్ చేసి నిర్వీర్యం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా పరిధిలో అక్రమ గంజాయి, డ్రగ్స్ రవాణా మరియు వినియోగం అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నమని మత్తు పదార్థాల రవాణా మీద ఎన్నో దాడులు నిర్వహిస్తూ, ఎంతో మందిని అరెస్టు చేసి జైలు పాలు చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. యువత డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని, యువత తెలిసి తెలియక మత్తు పదార్థాల బారిన పడడంవల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని అన్నారు. నిషేదిత డ్రగ్స్ వాడడం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాలకు పాల్పడుతూ కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. నిషేదిత డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. జిల్లాలో యువతలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల పట్ల కళాశాలల్లో పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల జీవితం నాశనం చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ఎవరైనా అక్రమ గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు అని, జిల్లా పోలీసులు నిరంతరం నిఘా ఉంటుందని అన్నారు. ఎవరైన గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, టోల్ ఫ్రీ నంబర్ 8712671111 కి సమాచారం తెలపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి రాములు నాయక్, డిఎస్‌పి శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సిఐ నాగరాజు, ఎస్ఐ అంతిరెడ్డి, డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## 1201 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్



**ప్రజాపక్షం / సూర్యాపేట కలెక్టరేట్:** పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. శు క్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేస మందిరంలో జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, బిఎస్ లతలతో కలిసి వెబెక్స్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకోని ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు ఏర్పాట్లు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వికలాంగులు, వృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు ఏర్పాటు చేసి వీల్ చైర్లు అందుబాటులో ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు పోలింగ్ కేంద్రాలను శుభ్రం చేయాలన్నారు. 1201 పోలింగ్ కేంద్రాల్లో నూరు శాతం వెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని, ఏ చిన్న తప్పైన కేంద్ర సమస్యగా మారుతుందని, ఎన్నికల ఏర్పాట్లను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ జరిగేరోజు కేంద్రాల తీరును సిఈవో పరిశీలిస్తారని తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏ అధికారికి కూడా పోలింగ్ కేంద్రంలో మొబైల్ అనుమతి లేదని తెలిపారు. ఈ వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డివోలు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మేధావులు క్రియాశీల పాత్ర పోషించాలి





**ప్రజాపక్షం/నందికొండ/చింతపల్లి :** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మేధావులు మౌనంవీడి లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణకోసం పాటుపడాలని మాజీ హోం మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన నివాసంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ పంచాయతీరాజ్ ఎంఎ కరీం, సీనియర్ జర్నలిస్ట్ కోటగిరి దైవదీనం స్వచ్ఛంద సంస్థల నాయకులు, విద్యావంతులు, అడ్వకేట్లు, పాత్రికేయులు ఆర్‌టిఐ రాష్ట్ర నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ దేశంలో సుపరిపాలన కొరకు యుపిఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టంతో పాటూ, లోక్‌పాల్ చట్టం, పోక్సో చట్టం, గృహహింస చట్టం, వయోవృద్ధుల సంక్షేమ చట్టం, జాతీయ ఉపాధిహామీ పథకం, విద్యాహక్కు చట్టం లాం టి చట్టాలను ప్రజలకు అందించిన ఘనత కాం గ్రెస్ పార్టీ దేనని అయన అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పై చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయ ని వాటిని రక్షించటానికి మేధావులు, విద్యావంతులు, ఆర్టీఐ కార్యకర్తలు, క్రియాశీలక పాత్ర పోషించి దేశంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నా రు అందులో భాగంగా నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛందంగా తన గెలుపుకు కృషి చేస్తున్న మేధావులు, విద్యావంతులు స్వచ్ఛంద సంస్థ నాయకులు, ఆర్టీఐ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర నాయకులు వై కృష్ణారెడ్డి, ఎమ్ఏ కుర్షీద్ పాషా, జి ముకుంద రెడ్డి, వై హేమలత, బైరు సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం: జానారెడ్డి

దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, స్థానిక శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్, నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీరారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జానారెడ్డి, బాలునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చుతుందని పునరుద్ఘటించారు. త్వరలోనే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తామని, 500 రూపాయల బోనస్‌ను అందిస్తామని అన్నారు. ఇప్పటికే ఇచ్చిన మాట ప్రకారం పలు హామీలను నెరవేర్చామని గుర్తు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో బిజెపిని, రాష్ట్రంలో బిఆర్ఎస్‌ని చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ఎంపిపి కొండూరి భవాని పవన్‌కుమార్, డిసిసి ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, ఎంపిపి, వైస్ ఎంపిపి, సిసిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.


## కొడుకును రోకలిబండతో కొట్టి చంపిన తండ్రి



**ప్రజాపక్షం / కొత్తపల్లి:** కన్న కొడుకును రోకలిబండతో తలపై కొట్టి చంపి తండ్రి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన పెరుమాళ్ల శివసాయి (21) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఇంట్లో శుభకార్యానికి వచ్చిన శివసాయిని కన్న తండ్రి పెరుమాండ్ల శ్రీనివాస్ శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కళ్లల్లో కారంపొడి చల్లి, రోకలిబండతో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఈతకు వెళ్లి తండ్రీకొడుకులు మృతి





**ప్రజాపక్షం / మోటకొండూర్:** శుభకార్యానికి బంధువుల ఇంటికి వచ్చిన చుట్టాలు ఈతకు వెళ్ళిన తండ్రీకొడుకులు మృత్యువాత పడ్డారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు (యం) మండలం రాయిపల్లికి చెందిన బోడ నరేష్ (42), సాయికుమార్ (11) మోటకొండూరు మండలంలోని చాడలో సమీప బంధువుల ఇంట్లో జరిగే ఎల్లమ్మ పండుగకు శుభకార్యానికి హాజరయ్యారు. మధ్యాహ్నం సమయంలో పిల్లలకు ఈత నేర్పించే క్రమంలో ప్రమాదవశాత్తు తండ్రీకొడుకులు మృతి చెందారు. వ్యవసాయ బావి వెలుపల ఉన్న పెద్ద కుమారుడు అరుపులు, కేకలు వేయడంతో గ్రామస్థులు చెరుకొని రక్షణ, సహాయక చర్యలు చేపట్టినప్పటికీ అప్పటికే మృతి చెందారు. సంఘటన స్థలానికి పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకొని మృతదేహాలను వెలికి తీసే ప్రయత్నం చేశారు. కొడుకు మృతదేహం దొరకగా, తండ్రి మృతదేహం దొరకలేదు. గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## అప్పల బాధతో రైతు ఆత్మహత్య

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సోలిపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ అయ్యాల శ్వేత తెలిపిన వివరాల ప్రకారం సోలిపురం గ్రామానికి చెందిన ఉచ్చంతల శ్రీను (47) తన వ్యవసాయ పొలంలో 30 సంవత్సరాల నుండి 10 ఎకరాలలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. వ్యవసాయ పొలంలో నాలుగు బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది. దీనికి తోడు అప్పులు ఎక్కువై చేతికొచ్చే వరిపంట కూడా నీళ్ల లేక ఎండిపోవడంతో ఇటు అప్పులు కూడా పెరగడంతో తన వ్యవసాయ క్షేత్రం వద్ద శుక్రవారం ఉదయం చెట్టుకు తాడుతో ఉరివేసుకొని మృతిచెందడం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్వేత తెలిపారు.



## మరో అవకాశం ఇవ్వండి : మాలోత్ కవిత

**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండల పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ అధ్యక్షతన మండలంలో రాజుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిధిగా మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత హాజరై మాట్లాడుతూ మోసపూరిత కాంగ్రెస్ పార్టీనీ రైతులు నమ్మొద్దని రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తూ పబ్బం గడుపుతూ రైతులను మోసం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ పాలనలో మండువేసవిలో చెరువులు మత్తడి పోశాయని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో చుక్కనీరు లేక వెలవెల బోతున్నాయన్నారు. మోసపూరిత మాటలు చెప్పి కాంగ్రెస్ మరొక్కసారి తెలంగాణ ప్రజలను మోసం చెయ్యాలని చూస్తోంది. నన్ను గెలిపిస్తే ప్రతిపక్షంగా ఉండి పార్లమెంట్‌లో కొట్లాడతానని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను వేడుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బడే నాగ జ్యోతి జిల్లా పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మాజీ గ్రంథాలయ చైర్మన్ గోవిందా నాయక్, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్ తోట రమేష్, యడ్లపల్లి నరసింహారావు, మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి, గ్రామం కమిటీ అధ్యక్షులు, చదలావాడ సాంబశివరావు పాల్గొన్నారు.




## మద్దతు ధర చట్టం కోసం ఐక్య రైతాంగ ఉద్యమాలు అవసరం

**ప్రజాపక్షం/ నర్సంపేట :** వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధర చట్టం కోసం ఐక్య రైతాంగ ఉద్యమాలు అవసరమని, ఆరుగాలం కష్టపడి దేశ ప్రజానీకంకు అన్నంపెట్టే రైతన్న పండించే పంటలకు మద్దతు ధర చట్టాలు అవసరమని హైకోర్టు రిటైర్డ్ చంద్ర కుమార్ అన్నారు. వరంగల్ నగరంలోని లేబర్‌కాలనీలో ఉన్న అల్పాహారం ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా సదస్సు వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమడి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని దోచుకుంటున్న వారికి అనుకూలంగా చట్టాలు తయారు చేసి కాపాడుతున్నారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు పండించే పంటలకు చట్టాలు లేవని అంటూ ఇది వివిధ రాజకీయ పార్టీల వైఫల్యమన్నారు. ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై, రైతు సంఘాల ఐక్య ఉద్యమాల ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట్ నారాయణ, ఆచార్యులు వీరస్వామి, రైతు సంఘాల నాయకులు గడ్డం సదానందం, రాచర్ల బాలరాజ్, వల్లందాస్ కుమార్, ఓదెల రాజయ్య, సోమ రాంమూర్తి, నగేష్, ఊరటి హంసల్‌రెడ్డి, సిరుల రవీందర్, మోహన్‌రావు, బుచ్చిరెడ్డి, అంబయ్య, దామోదర్‌రెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు కుళ్ళిన కోడిగుడ్లు

### పట్టించుకోని ఐసిడిఎస్ అధికారులు



**ప్రజాపక్షం / చెన్నారావుపేట :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణిలు ,బాలింతలు ,పిల్లలు పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్నారని జనాభా ప్రాతిపదికన గ్రామానికో అంగన్‌వాడి కేంద్రాలను నెలకొల్పితే పౌష్టికాహారం కలుషితంతో పాటు కుళ్ళిన కోడిగుడ్లను అందిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు . వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో 30 గ్రామ పంచాయతీలు ఉండగా 59 అంగన్‌వాడి కేంద్రాలు ఉన్నాయి . అంగన్‌వాడి కేంద్రాలకు నిత్యం పిల్లలకు ,గర్భిణిలకు ,బాలింతలకు పౌష్టికాహారం సరైన సమయంలో అందించిక పోయిన లబ్ధిదారులు ఏమాత్రం అంగన్‌వాడి కేంద్రాల నిర్వహకులను అడిగిన సందర్భం లేదని గర్భిణి మహిళలు వాపోతున్నారు . కానీ ఈ మధ్య కాలంలో కుళ్ళిన కోడిగుడ్లను సరఫరా చేస్తూ దుర్వాసన వస్తున్న గుడ్లను అందిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు . కుళ్ళిన కోడిగుడ్లను అందిస్తున్నారని అంగన్‌వాడి టీచర్లను అడిగితే మాకు ప్రభుత్వం అందిస్తుంది మీ ఇష్టం ఉంటే తీసుకెళ్ళండి లేకుంటే అక్కడే వదిలిపెట్టి వెళ్లండని అంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టరే అలా కుళ్ళిన కోడిగుడ్లను పంపిస్తున్నారని మేము ఏమి చెయ్యాలని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహకులు వాపోతున్నారు. కేంద్రాలను పర్యవేక్షించే అధికారులే పట్టించుకోవడం లేదని కాంట్రాక్టరు సరఫరా చేస్తున్నగుడ్లు పగిలి వస్తున్న బాగోతం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళిన ఫలితం లేదని అంటున్నారు . ఇప్పటికైనా ఐసిడిఎస్ అధికారులు స్పందించి పగిలి ,దుర్వసన ,కుళ్ళిన కోడిగుడ్లను సరఫర చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోని నాణ్యమైన పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు .

## సాధారణ వ్యయ పరిశీలకులకు ఎన్నికల ఫిర్యాదులు చేయవచ్చు

### ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు , సాధారణ వ్యయ పరిశీలకులకు చేయవచ్చునని కలెక్టరేట్‌లో పరిశీలకులు అందుబాటులో ఉంటారని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు గోపాల్ జి. తివారి వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్ శేట్ కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని ఆమె వివరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. సాధారణ ఎన్నికల పరిశీలకులుగా గోపాల్ జి. తివారి ఐ.ఎ.ఎస్. 7995692890. వ్యయ పరిశీలకులు మోతిలాల్ ఎస్ ఐఆర్ఎస్ 7995692887 ఫోన్ నెంబర్‌లలో వీరిని సంప్రదించవచ్చునని ఆమె తెలిపారు.

# దేవుళ్ల పేరుతో బిజెపి రాజకీయం

### హరీశ్‌రావు ఆగస్టు 15 తర్వాత రాజీనామాకు సిద్ధంగా ఉండాలి : మంత్రి కొండ సురేఖ



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ఓటమి భయంతో బిజెపి దేవుల పేరుతో రాజకీయం చేసేందుకు తేరదించిందని, రాష్ట్రంలో ప్రజాధరణ కోల్పోయిన ప్రతిపక్ష బిఆర్ఎస్ నాయకులు రాజీ నామాల పేరుతో చాలేంజీలు చేస్తున్నారని రాష్ట్ర దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మం దలంలోని దౌలాపూర్‌లో కాం గ్రెస్ నాయకులు రాచమల్ల బంగారురెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలును జీర్ణించుకోలేక కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధిని చూపెట్టి ఓట్లడిగే సత్తాలేని బిజెపి మతాల మధ్య చిచ్చు లేపే ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు. గడిచిన తొమ్మిదిన్నర పాలనలో బిఆర్ఎస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేని వారు నేడు చాలెంజిలు చేస్తున్నారని ఎద్దేవ చేశారు. గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేసిన హరీశ్‌రావు వారు ఇచ్చిన ఎన్నికల హామీలు ఎన్ని అమలు చేశారని సవాల్ విసిరారు.కాంగ్రెస్ ఆరు గ్యారంటీలలో రైతు రుణమాఫీ అగస్టు 15 వరకు పూర్తిగా అమలు చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొంటూ, హరీశ్‌రావు అగస్టు 15 నాడు తన ఎంఎల్‌ఎ పదివి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉండాలని చాలెంజ్‌లు చేయడం కాదు దానికి కట్టుబడి ఉండాలన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, రైతు ఆత్మహత్యలపై ఏనాడు స్పందించని కెసిఆర్ నేడు రోడ్ షోలతో రైతుల పక్షపాతిని అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రజాధరణ కోల్పోయి పదవుల కాంక్షతో అమర వీరుల స్తూపం వరకు రాజీనామా లేఖలతో రావడం హాస్యస్పదంగా ఉందని అన్నారు. ఓటర్లను అగమాగం చేసి ఓట్లను దండుకోవడానికి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. అంబాని, అదాని కోసం బిజెపి ఆరాట పడుతుంటే, చేసిన తప్పులను సరిదిద్దుకోనేందుకు కెసిఆర్ బస్సు యాత్రలు చేపడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండే మెదక్ పార్లమెంటు నియోజక వర్గం నుండి బహుజన బిడ్డా నీలం మధు కాంగ్రెస్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నందున మంచి మనుసుతో ఓట్లేసి ఆదారించాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ నుండి నీలం మధును గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎంఎల్‌ఎ, సిద్దిపేట కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎంఎల్‌ఎ హనుమంతరావు, జల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంక్షరెడ్డి, జగదేవ్‌పూర్ ఎంపిపి అధ్యక్షులు బాలేషంగౌడ్, మండల పార్టీ రవీందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, హనుమంతారెడ్డి, మల్లేశం, మచ్చేందర్‌రెడ్డి,సుధాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, గాల్‌రెడ్డి, పాష, అజీస్, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులకు చర్యలు

### తాగునీటి సమస్య రాకుండా చూడాలి : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఉపాధి హామీ పథకం పనులకు కూలీలు అధిక సంఖ్యలో వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ హాల్లో ఉపాధి హామీ పథకం, మంచినీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు,పై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం పనుల జాబ్ కార్డులు జారీ చేయాలని, ఎంపిడీవోలకు సూచించారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. కూలీలు తక్కువగా వస్తున్న గ్రామాలలో ఉపాధి హామీ పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలకు తగ్గకుండా పని కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో గత సంవత్సరం కంటే 10 శాతం ఎక్కువ పని దినాలు కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో 200 మందికి తగ్గకుండా ఉపాధి హామీ పథకం పనులకు కూలీలు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రదేశాలలో నీడ కొరకు షేడ్ నెట్లు, త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వచ్చేవారం నిర్వహించే సమావేశంలో ఎంపీడీవోలు తమ మండలాలలో ఉపాధి హామీ పనుల్లో ముందు, వెనుకంజలో ఉన్న గ్రామాల సమగ్ర నివేదికలను అందించాలని తెలిపారు. పంచాయితీ కార్యదర్శులు గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ చేయాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని పక్కా ప్రణాళిక బద్ధంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో 271 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాల్సి ఉండగా 209 పాఠశాలలకు ఇంజినీరింగ్ అధికారులు అందచేసిన ప్రతి పాదనలు మేరకు పరిపాలనా అనుమతులు జారీ చేశామని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని అన్నారు. పనులకు సంబంధించి కొనుగోలు చేయనున్న మెటీరియల్, పనులు వివరాలను ఎంబి రికార్డు చేయాలని అన్నారు. ఈ మూడు నెలలపాటు మంచినీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితిని బట్టి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, అధికారులు అనునిత్యం పంచాయతీలలో పర్యవేక్షణ చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులను గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ఎక్కడ తాగునీటి సమస్య వచ్చిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఓ నారాయణరావు, జడ్పి సీఈఓ విజయలక్ష్మి, డిఆర్డీఓ నరేష్, గ్రిడ్ ఈ ఈ మాణిక్యరావు, అన్ని మండలాల మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎపివోలు, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### జిల్లా పౌరసరఫరాల అధికారిణి రోజారాణి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారిణి రోజారాణి ఆదేశించారు. శుక్రవారం బచ్చన్నపేట మండలంలోని నాగిరెడ్డిపల్లి, పడమటికేశవాపూర్, రామచంద్రాపురం, కొన్నె, ఇటుకాలపల్లి పీఏసీఎస్‌లు, గంగాపురం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల అధికారిణి రోజారాణి సందర్శించి పరిశీలించి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పర్యవేక్షించి తేమశాతంపై సంబంధించిన రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం కాంటా అవ్వగానే ఎప్పటికపుడు రైస్ మిల్లులకు తరలించాలని, ఓపీఎంఎస్ వెంటనే నమోదు చేయాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం బచ్చన్నపేటలోని చల్లా మిల్లు, లక్ష్మి వెంకటేశ్వర, లక్ష్మి శ్రీనివాస, తదితర మిల్లులను సందర్శించి పర్యవేక్షించారు. ఈ కేంద్రాల పరిశీలనలో సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మెదక్ ఎంపి స్థానానికి

## 53 నామినేషన్లు ఆమోదం

### ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి అయ్యిందని, మెదక్ స్థానానికి 54 మంది అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేశారని, అందులో ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ లోని ఆర్ ఓ కార్యాలయం లో శుక్రవారం నామినేషన్ల పరిశీలనలో భాగంగాఎన్నికల సాధారణ పరిశీలకులుగా సమీర్ మాధవ్ కుర్కోటి, పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టారు. పరిశీలనకు పలు రాజకీయ పార్టీల అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25 వరకు కొనసాగిన నామినేషన్ ప్రక్రియలో భాగంగా మొత్తం 54 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. అందులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సంగారెడ్డి కి చెందిన కళ్ళు నరసింహులు గౌడ్ ఎన్నికల నియమావళి ప్రకారం కొత్త ఓటర్ల లిస్టు, పార్ట్ నెంబర్, సీరియల్ నెంబర్, ప్రపోజల్స్ సరైన పత్రాలు సమర్పించని సందర్భంగా పరిశీలనలో భాగంగా నామినేషన్ ను తిరస్కరించడం జరిగిందని వివరించారు. 53 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. అభ్యర్థి వ్యయానికి సంబంధించి సంబంధించిన పుస్తకాలు అభ్యర్థులకు అందజేయడం జరిగిందన్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు తప్పనిసరిగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలని సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించినప్పుడు ముందస్తు అనుమతి తప్పనిసరని తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఖర్చులు ఆ అకౌంట్ ద్వారానే నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ ఏజెంట్ రాండిమైజేషన్ ప్రక్రియలో హాజరు కావాలని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పోలింగ్ స్టేషన్స్ అలాట్మెంట్ చేయడం జరిగిందని ఈవీఎం రిలేటెడ్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలియజేశారు.



## సిద్దిపేటలో కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ

### నీలం మధుకు మద్దతుగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిధిలుగా జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, ఎంపి అభ్యర్థి నీలం మధు, మాజీ ఎంఎల్‌ఎ మైనంపల్లి హన్మంతారావు, డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డిలు హాజరైనారు. సిద్దిపేట పట్టణ కేంద్రంలోని బిజెఆర్ చౌరస్తాలో మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి నీలం మధుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం బిజెఆర్ చౌరస్తా నుండి ఎన్ఎస్‌యుఐ,కాంగ్రెస్ పార్టీ యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో పాత బస్టాండ్, విక్టరీ చౌరస్తా, భారత్‌నగర్ మీదుగా భారీ ర్యాలీ జరిగినది. మైనంపల్లి హన్మంతారావు బైక్‌పై ర్యాలీలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. మెదక్ ఎంపిగా నీలం మధుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు దరిపల్లి చంద్రం,తాడూరి శ్రీనివాస్‌గౌడ్, సూర్యవర్మ, జీవన్‌రెడ్డి, బొమ్మల యాదగిరి, చక్రధర్‌గౌడ్, చిట్టి దేవేందర్‌రెడ్డి, ముద్దం లక్ష్మి , అత్తు ఇమామ్, సతీష్‌గౌడ్, కలీమోద్దిన్, దేవులపల్లి యాదగిరి పాల్గొన్నారు.



## అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

### కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

**ప్రజాపక్షం/కొహెడ :** ఎన్నికల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కొహెడ, చిగురుమామిడి, సైదాపూర్, మండల కేంద్రాల్లో రాజేందర్‌రావు రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ అవకాశం ఇస్తే నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తానన్నారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్‌కు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు తీసుకొచ్చారని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తానని కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు హామీ ఇచ్చారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో రాక్షస ప్రభుత్వంపై పోరాడి బిఆర్ఎస్ పార్టీని చిత్తు చేశారని, మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్న బిజెపిపై పోరాడి బిజెపి ప్రభుత్వాన్ని పాతాళంలోకి తొక్కాలని పిలుపునిచ్చారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## బిజెపి అభ్యర్థి చెల్లని రూపాయి

### బిఆర్ ఎస్ అభ్యర్థి వెంకటరాంరెడ్డి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** గత శాసన సభ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం నుండి ఓటమి చెందిన బిజెపి అభ్యర్థి మళ్లీ పార్లమెంటు ఎన్నికల బరిలో నిలిచిన వ్యక్తి చెల్లని రూపాయి లాంటి వాడని బిఆర్ఎస్ మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకటరాంరెడ్డి ఘాటు వాఖ్యలు చేశారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదవరెడ్డి నూతన దుకాణ సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో గత తొమ్మిదిన్నర సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో అన్ని వసతులు సమకూర్చిన వాటిని సద్వినియోగం చేయడంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫల చెందిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రతి పక్షపార్టీ బిఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తుందన్నారు. పారిపాలన చేత గాని సిఎం రేవంత్‌రెడ్డి మాజీ సిఎం కెసిఆర్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ మెజార్టీ స్థానాలు గెలుచుకోబోతుందన్నారు. మెదక్ నియోజకవర్గం నుండి గెలుపొందిన 30 రోజుల్లో 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి నీరు పేద విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేపడుతానని ప్రమాణం చేశారు. కలెక్టర్‌గా జిల్లాలో చేసిన సేవలను గుర్తించి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి యాదవరెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఎంపిటిసి కవిత, కావ్యదర్గయ్య, మాజీ సర్పంచ్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలను మభ్యపెట్టేందుకు

# రాజీనామా నాటకం



రఘునందన్‌రావు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం పార్లమెంట్ బిజెపి పార్టీ అభ్యర్థి రఘునందన్ రావు రోడ్డు షో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రఘునందరావును మండల బిజెపి నాయకులు డోలు చప్పులు కోలాట ఆటపాటల మధ్య మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ దొందు దొందే అన్నారు. రేవంత్ రెడ్డి, హరీశ్‌రావులు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున నాటకానికి తెర లేపడం తెలంగాణ ప్రజలను మభ్య పెట్టేందుకు చీకట్లో రాజీనామా అనే కొత్త నాటకానికి వెలుగులోకి తీసుకొస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలను మర్చిపోయి ఆగస్టు 15న రైతులకు రెండు లక్షల రుణమాఫీచేస్తామనడం సిగ్గుచేటు అన్నారు. రైతుల పక్షాన ఉండే కాంగ్రెస్ పార్టీ జనవరిలోనే రుణమాఫీ చేయొచ్చు కదా ఆగస్టు 15 ఎందుకు డెడ్ లైన్ విధించారని ప్రశ్నించారు. ఈ రుణమాఫీ కోసం ఏడుపాయల దుర్గామాత మీద ప్రమాణం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 10 సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ పార్టీలో ఆర్థిక శాఖ మంత్రిగా విధుల్లో కొనసాగిన హరీశ్‌రావు రుణమాఫీ గురించి ఎందుకు ఆలోచించలేదన్నారు. కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలను బొంద పెట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భారతదేశం అగ్రగామి దేశంగా తీర్చిదిద్దాలంటే కేవలం నరేంద్ర మోదీతోనే సాధ్యమని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో నరేంద్ర మోదీ బలపరిచిన అభ్యర్థి రఘునందన్ రావుకి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, బిజెపి సీనియర్ నాయకులు, శ్రీనివాస్,తీగల శ్రీనివాస్ గౌడ్,శంకర్ గౌడ్, రాజిరెడ్డి, నరేష్ మహంకాళి, బీజేవైఎం ప్రశాంత్ గౌడ్, ఆకుల రమేష్, శంకర్, నవీన్, నీలం తిరుపతి, సంజీవులు, జాల పోచయ్య, జిపి స్వామి, గెరిగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో ఆయిల్‌పామ్ తోటల పెంపకం



హార్టికల్చర్ కమిషనర్ అశోక్‌రెడ్డి

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో ఈసంవత్సరం నిర్దేశించిన 7వేల ఎకరాల లక్ష్యానికి అనుగుణంగా అయిల్‌పామ్ తోటల పెంపకానికి సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర హార్టికల్చర్ , సెరికల్చర్ కమిషనర్ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం హార్టికల్చర్, సెరికల్చర్ కమిషనర్, అయిల్‌ఫెడ్ ఎండి అశోక్‌రెడ్డి నంగునూరు మండలం నర్మెట్ట పర్యటించి అయిల్ ఫామ్ నిర్మాణ పనులను పరిశీలించి,నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అదే విధంగా జూన్ వరకు జిల్లాలో వచ్చే అయిల్‌ఫామ్ పంటను రైతుల నుండి స్వీకరించేందుకు ఫ్యాక్టరీ వద్ద కలెక్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అశ్వరావుపేట అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీకి పంపించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆనంతరం కలెక్టర్ మనుచౌదరి కార్యాలయంలో ఉద్యానవన,వ్యవసాయ అయిల్‌ఫెడ్,మైక్రోఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించిజిల్లాలో పామాయిల్ తోటల పెంపకంపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ తోటల పెంపకానికి చాల అవకశాలున్నాయని ,పామాయిల్ తోటల విస్తీర్ణంలో ఖమ్మం,భద్రాద్రి కొత్తగూడెం, జిల్లాల తర్వాత 11.140 ఎకరాల్లో మూడోస్థానంలో సిద్దిపేట జిల్లా ఉందన్నారు. అలాగే నర్మెట్టలో 300 కోట్ల రూపాయిల పామాయిల్ ఫ్యాక్టరీ కూడ నిర్మాణం జరుగుతుందన్నారు. రైతులు పండించిన పామాయిల్ పంట మార్కెటింగ్ ఏలాంటి ఇబ్బంది లేనందున ఈసంవత్సరం జిల్లాలో నిర్దేశించిన 7000 ఎకరాల్లో నూతనంగా పామాయిల్ తోటలు పెంపకానికి ఉద్యానవనానికి, వ్యవసాయం, మార్క్‌ఫెడ్,ఇరిగేషన్అధికారులు సంయుక్తంగా కృషిచేయాలన్నారు. రానున్న రేండేళ్లలో 25 ఎకరాల్లో అయిల్‌పామ్ తోటలసాగు జిల్లాలో జరుగాలన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఇప్పటికే 30 నుండి 40 కోట్లుఖర్చు చేయటం జరిగిందన్నారు. పామాయిల్‌కు అంతర్జాతీయంగా విపరీతంగా డిమాండ్ ఉన్నందున రైతులకు అత్యధికంగా లాభం జరుగుతుందన్నారు. పామాయిల్ తోటలను ఉన్నతాధికారులు తరుచుగా సందర్శించి పర్యావేక్షణ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ,హార్టికల్చర్ అధికారిసువర్ణ, వ్యవసాయఅధికారి శివప్రసాద్, అయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ (ఎంపిసి) స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ ఎస్.అనూజ్ఞ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనూజ్ఞను సిఎం రేవంత్‌రెడ్డి అభినంధించారు.



నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్‌సి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను మార్యదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలిప్‌కుమార్, నాయకుడు మధు, సత్యంగౌడ్ ఉన్నారు.

## మోదీని రక్షించేందుకు ఇసి ప్రయత్నిస్తోంది : నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మత విద్వేషాలు రెచ్చగొట్టెలా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపైన కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలకు మోదీకి నోటీసులు ఇవ్వకుండా బిజెపి అధ్యక్షుడికి ఇసి నోటీసులు జారీ చేసిందని, మోదీని రక్షించేందుకు ఇసి ప్రయత్నిస్తోందన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహించలేదని అధికారులపై చర్యలు తీసుకుంటున్న ఇసి, మోదీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

### బిసిలకు న్యాయం చేయని మోదీ : హనుమంతరావు



రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందని పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగాలు రావాలన్నా, పదోన్నతులు కావాలన్న రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నా రు. మోదీ బిసిలకు ఎటువంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. మోదీ కి ఓటు వేస్తే ఆదాని, అంబానీలకు ఓటు వేసినట్టేనన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేయించే బాధ్యతను బిసిలు తీసుకోవాలన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన సంభాని చంద్రశేఖర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ టిపిసిసి చేరికల కమిటీ సభ్యులు జగ్గారెడ్డి, కోదండరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరారు. బిఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, ఖమ్మం జిల్లా కామేపల్లి జెడ్పిటిసి బాణోత్ ప్రవీణ్ కుమార్ నాయక్, ఎంపిటిసి శంకర్‌నాయక్ తదితరులు గాంధీభవన్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యడవెల్లి కృష్ణ, రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మరణదశలో సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పాత బస్తికి చెందిన ఆటో యూనియన్ నాయకుడు కె.అహ్మద్ షరీఫ్‌ను ఆల్ ఇండియా అసంఘటిత కార్మికులు,ఉద్యోగుల కాంగ్రెస్(కామ్‌గర్, కర్మచారి కాంగ్రెస్ కెకెసి) తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినట్లు ఆల్ ఇండియా అసంఘటిత కార్మికులు,ఉద్యోగుల కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కె.అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అసంఘటిత కార్మికుల సామాజిక, సంక్షేమ సేవలు, పథకాలు మరణదశలో ఉన్నాయని ఆరోపించారు. అదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉద్యోగ భద్రత అంశాలను కార్మికుల హక్కుల నుండి తొలగించేందుకు మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించిందన్నారు. రాష్ట్రంలో కెకెసిని మరింత బలోపితం చేసేందుకు కృషి చేస్తానని అహ్మద్ షరీఫ్ తెలిపారు.

# బిజెపి హటావో దేశ్‌కో బచావో



### మతోన్మాద బిజెపిని ఓడించడమే లక్ష్యం
### కాంగ్రెస్‌కు మద్దతుగా సిపిఐ
### చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** బిజెపి హటావో–దేశ్‌కో బచావో నినాదంతో మతతత్వ బిజెపిని ఓడించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని రుచి గ్రాండ్ హోటల్‌లో పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన పెద్దపల్లి నియోజకవర్గ పార్లమెంటరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో పదేళ్ల పరిపాలించి దేశాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. కార్పొరేట్ సంస్థల చేతిలో మోదీ ప్రభుత్వం కీలుబొమ్మగా మారిందన్నారు. రాజస్థాన్ ఎన్నికల సభలో మోదీ వాడిన భాషతో దేశం అల్లకల్లోలం అవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం ఓటు ద్వారా చెప్పి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇండియా కూటమిలో భాగంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కాకా వారసుడిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకే తమ మద్దతు అని తెలిపారు. చెన్నూరు ఎంఎల్‌ఎ గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంఎల్‌ఎ చింతకుంట విజయ రమణా రావులు మాట్లాడుతూ కాకా హయాంలో పెద్దపల్లికి నల్ల బంగారం అయినా సింగరేణి సంస్థకు రూ.400 కోట్లు కేటాయించి సింగరేణి బొగ్గు గనులను, కార్మికులను ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. దళితుల అభ్యున్నతికి, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకునేది కాకా కుటుంబం మాత్రమేనని, ఎవరి ఎన్ని ఆరోపణలు చేసిన తాము ప్రజల కోసమే పాటు పడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దేశ అభ్యున్నతి జరిగిందన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పార్టీని ఓడించిన విధంగానే, బిజెపి ప్రభుత్వాన్ని కేంద్రంలో నుంచి వెలివేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కరమైన శంకర్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంలో మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలనతో దేశంలో ఓవైపు ధరలు, మరోవైపు నిరుద్యోగం పెరింగిందన్నారు. నిరుద్యోగ సమస్య పోవాలంటే కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## లౌకిక వ్యవస్థలను కాపాడుకోవాలి

### సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి వేణు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాలని, ఎంపి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిం చుకోవాలని జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. శుక్రవారం సిపిఐ కార్మిక భవన్‌లో సిరిసిల్ల నియోజకవర్గం స్థాయి సమావేశం పంతం రావే అధ్యక్షతన జరిగినది. సమావేశంలో వేణు మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు తమ మద్దతు ఉంటుందన్నారు. రాజేందర్‌రావు గెలుపులో సిపిఐ ముఖ్య పాత్ర పోషించాలని పార్టీ శ్రేణులను కోరారు. గత ఐదు సంవత్సరాలుగా కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న బండి సంజయ్ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ మీద ఆధారపడి 30వేల మంది కార్మికులు జీవిస్తుంటే వాళ్ల జీవితాల కోసం, జీవనోపాధి కోసం కేంద్రప్రభుత్వం నుంచి ఏమి సంక్షేమ పథకాలు తెచ్చాడో బహిరంగపరిచి ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని చేతి గుర్తుకు ఓటెయ్యాలని లౌకిక ప్రజాసంత్ర వామపక్షాలన్నీ బిజెపిని ఓడించటానికి ఓటు ద్వారా బిజెపి ప్రభుత్వాన్ని గద్దదించాలని పార్లమెంటు నియోజకవర్గం లోని ప్రజలను కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు అజ్జవేను సోమ నాగరాజు, కొంక విజయ్, సదానంద తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి విధ్వంస పాలనతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/కాజీపేట :** పది సంవత్సరాల మోదీపాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగం సంక్షోభంలోకి నెట్టబడి, పౌరహక్కులు ధ్వంసం చేయబడ్డాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. శుక్రవారం కాజీపేట ఎఆర్ నగర్‌లో దీన అధ్యక్షతన సిపిఐ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో జ్యోతి మాట్లాడుతూ లౌకిక, ప్రజాస్వామ్య వ్యవసలను కాపాడుకోడానికి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం ఆదాని, అంబానీ లాంటి బడా వ్యాపారవేత్తలకు మాత్రమే పనిచేసిందన్నారు. అనేక ప్రభుత్వరంగ సంస్థలను మోదీ కనుసన్నల్లో ఉన్నవారికి అప్పన్నంగా కట్టబెట్టారన్నారు. దీంతో కోట్లాదిమంది కార్మికులు నిరుద్యోగులుగా మారి దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. మరోమారు మోదీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే ప్రమాదం ఉందన్నారు. ఆదానీలకు, అంబానీలకు కార్పొరేట్ వ్యాపార దిగ్గజాలకు దేశంలోని అన్నిరకాల సంపదలను దోచి పెట్టే విధంగా చట్టాలు తీసుకవస్తారన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. కార్మిక వర్గానికి ఉపయోగపడే చట్టాలను మార్చడానికి మోదీ ప్రభుత్వం కుటిల నీతిని ప్రదర్శిస్తున్నదన్నారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్ లాంటి ప్రభుత్వరంగసంస్థలను సైతం విధ్వంసం చేసి తన సహచరవర్గానికి అప్పనంగా అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నదని, ఉపాధిహామీ చట్టాన్ని నాశనం చేయటానికి పూనుకున్నదన్నారు. పది సంవత్సరాలలో విధ్వంసకర విధానాలు అవలంబిస్తూ సమాజంలోకి అన్నివర్గాల మధ్య విభేదాలను సృష్టించారని ఆరోపించారు. మతోన్మాదం, కుల ఉన్మాదాన్ని సృష్టిస్తూ ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలపై దాడులు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో దేశంలో లౌకిక, ప్రజాస్వామ్యవ్యవస్థల రక్షణకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ప్రజాస్వామ్యం, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందన్నారు. వరంగల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోత్ శంకర్, మహిళా సమాఖ్య జిల్లా సహాయకార్యదర్శి రాజమణి, లావణ్య, అనిత, స్వరూప, లక్ష్మి , రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకు పోరాడుదాం

### ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్



**ప్రజాపక్షం/వరంగల్ :** మేడే స్ఫూర్తితో హక్కుల రక్షణకు కార్మిక లోకం పోరాడాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. మేడే దినోత్సవం సందర్భంగా వరంగల్ సికెఎం ఆస్పత్రి ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు, ఇతర కార్మిక సంఘాలు వారి జెండాలను సృష్టించుకున్నారని, కేవలం ఎర్రజెండా మాత్రం కార్మికుల రక్తం నుండి ఉద్భవించిందన్నారు. దేశంలోకి మొదటిసారిగా ఎఐటియూసి ద్వారానే ఎర్రజెండా వచ్చిందన్నారు. 104 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక సంఘం ఎఐటియుసి అని కొనియాడారు. 1923వ సంవత్సరంలో మద్రాస్ నగరంలో ఎగరవేశారన్నారు. కార్మికుల సంక్షేమ కొరకు జరిగే పోరాటానికి ఎఐటియుసి ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.అన్నివర్గాల కార్మికులు ఐక్య మత్యంతో మేడే వేడుకల్లో పాల్గొని కార్మిక సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో ఎండి యాకుబ్, నాగవల్లి శంకర్, శోభ, రాజు, శ్రీనివాస్, బాబు, దేవి, స్వరూప, త్రివేణి, స్వప్న, అనిత, సుధాకర్, సిద్దు, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

## మన్నికమైన సేవలతోనే వినియోగదారుల్లో గుర్తింపు

### కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** మన్నికమైన సేవలతోనే వినియోగదారుల్లో గుర్తింపు లభిస్తుందని కొత్తగూడెం ఎంఎల్‌ఉ కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాత నగర్ మండల కేంద్రంలో శివ సాయి శ్రీనివాస్ ట్రేడర్స్ షాపును కూనంనేని సాంబశివరావు శుక్రవారం ప్రారంభించారు. షాపు యజమాని బాలు లక్ష్మినారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు మంచి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంపీపీ భూక్యా పద్మావతి, మండల కార్యదర్శి ధస్రు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి, కుమారి హనుమంతూరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, వేల్పుల భాస్కర్ రైతు సంఘం నాయకులు, తాళ్లూరి పాపారావు, తాళ్లూరి ధర్మారావు, తాళ్ళ వెంకటేశ్వర్లు, కుమారి కృష్ణ, ఎంపీటీసీ గణేష్, ఎంపీటీసీ భద్రం, దండు సురేష్, దండు నాగేశ్వరావు, గోపి, జోలెబోయిన కొమరయ్య, బొడ్డు కేశవరావు, భూక్యా తేజ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుజాతనగర్ మండలంలోని పలు శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## మందా జగన్నాథం నామినేషన్ తిరస్కరణ

**ప్రజాపక్షం/ నాగర్‌కర్నూల్ ప్రతినిధి:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం బిఎస్‌పి అభ్యర్థి, మాజీ ఎంపి మందా జగన్నాథం నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఎన్నికల అధికారులు శుక్రవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియను చేపట్టారు. మంద జగన్నాథం మాత్రం తను వేసిన నామినేషన్‌లో బిఎస్‌పి అభ్యర్థిగా పేర్కొన్నప్పటికీ బి ఫామ్ సమర్పించకపోవడంతో మందా జగన్నాథం నామినేషన్ తిరస్కరణకు గురైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మందా జగన్నాథం స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండాలని భావించారని సమాచారం. అయితే ఎంపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు 10 మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉండగా, మంద జగన్నాథం పోటీ చేయడానికి ఆయన అభ్యర్థిత్వాన్ని కేవలం ఐదు మంది ఓటర్లు మాత్రమే ప్రతిపాదించడంతో ఆయన ఎంపిగా పోటీ చేసే అవకాశాన్ని కూడా కోల్పోయారు. అయితే బిఎస్‌పి బి ఫామ్ యూసుఫ్ అనే వ్యక్తికి కేటాయించడం గమనార్హం. మంద జగన్నాథం కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ ఆశించి బంగపడటంతో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి కొన్ని రోజుల కిందనే బిఎస్‌పిలో చేరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ ఎంపి మంద జగన్నాథం నామినేషన్ తిరస్కరణకు గురికావడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయంశంగా మారింది.


## 29న కడియం కావ్యకు మద్దతుగా సభ


**ప్రజాపక్షం/హన్మకొండ :** వరంగల్ పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా 29న సిపిఐ ఆధ్వర్యంలో హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్‌లో సభ నిర్వహించడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సిపిఐ నేతలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## విద్యాకుసుమాలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల వారీగా విద్యార్థుల పరీక్షల ఫలితాలు వెలువడే సమయంలో మార్కులు తక్కువగా వచ్చాయని కొందరు, ఫెయిల్ అయ్యామనే భావనతో మరి కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతూ కష్టపడి కనిపెంచిన తల్లిదండ్రులను జీవితకాలం శోకసంద్రంలో ముంచుతున్న ఘటనలను అనేకం చూస్తున్నాం. విద్యార్థులు ఇటువంటి చర్యలకు పాల్పడడానికి కారణాలు ఏమిటి? విద్యా వ్యవస్థలో లోపాలా? తల్లిదండ్రుల పెంపకమా? ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో యాజమాన్యాలు నిర్ణయించిన లెక్కకు మించిన అనేక ఫీజులను రేయింబవళ్లు ఎంతో కష్టపడి తల్లిదండ్రులు కట్టినప్పటికీ పరీక్షలలో అనుకున్న మార్కులు సాధించలేదని, ఉత్తీర్ణులు కాలేకపోయామని, బలవన్మరణాలకు పాల్పడుతున్నారా? లేదా ప్రైవేటు విద్యావ్యవస్థలోని పాఠశాల, పాఠశాలలకు, కళాశాల, కళాశాలలకు విద్యార్థులకు విద్యార్థులకు మధ్య కృత్రిమ పోటీ వాతావరణాన్ని సృష్టిస్తున్న విద్యా సంస్థలదా? విద్యా సంస్థల యాజమాన్యాలు సొసైటీలో తమ ఉనికిని చాటుకునేందుకు, గొప్ప పేరు కోసం, కేవలం ర్యాంకుల కొరకు చదువుకునే విద్యార్థులని మరచి, అనుక్షణం వారిని విద్య యంత్రాలుగా పరిగణిస్తున్నారు. ఇలాంటి కఠినమైన వాతావరణాన్ని తట్టుకోలేని విద్యార్థులు ఈ పరిస్థితులను తల్లిదండ్రులకు చెప్పిన అర్థం చేసుకుంటారా.. లేదా అనే మనోవేదనకు లోనై అర్థాంతరంగా తనువులను చాలిస్తున్నారు. మరోవైపు కొంతమంది తల్లిదండ్రులు ఓ రకమైన చాదస్తం కారణంగా వారి పిల్లలకు వచ్చిన మార్కులు గుర్తించకపోగా, ఇతరుల పిల్లల మార్కులతో పోల్చుతూ కించపరిచే మాటల వలన మనస్థాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దేనందుకు విద్యాశాఖ యంత్రాంగం కలుగజేసుకుని ప్రైవేట్ పాఠశాల, కళాశాల యాజమాన్యాలతో విస్తృతస్థాయి సమావేశాలను ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు పరీక్షలలో ఫెయిల్ అయిన మళ్లీ చదువుకుని పాస్ అవుతారనే భరోసాను విద్యార్థి స్థాయి నుండి ఒత్తిడిని తట్టుకునే విధంగా, ఆత్మన్యూనత భావన తొలిగే విధంగా అవగాహన కల్పించాలి.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ — రంగారెడ్డి
కరీంనగర్ | శనివారం | 27 ఏప్రిల్, 2024 | 9

## చేవెళ్లలో 17 నామినేషన్లు తిరస్కరణ



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : చేవెళ్ల లోక్‌సభ నామినేషన్లలో స్క్రూట్నీ అనంతరం 17 తిరస్కరణకు గురయ్యాయని చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంక తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి 66మంది నుండి 88 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీటిలో శుక్రవారం నిర్వహించిన స్క్రూట్నీలో 17 మంది తిరస్కరణకు గురి కాగా 47 మందికి ఆమోదం లభించిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వివరించారు. తిరస్కరణకు గురైన వాటిలో ప్రధాన పార్టీలకు సంబంధించిన వారు ఎవరూ లేరని ఎన్నికల అధికారి శశాంక పేర్కొన్నారు.

## చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా విధులు : ఆర్‌డిఒ



ప్రజాపక్షం/కేశంపేట: కేశంపేట మండలం కోనాయపల్లిలో చెక్‌పోస్టును శుక్రవారం షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు తనిఖీ చేశారు. ఎన్నికల సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అదేవిధంగా కొత్తపేట ఓటరు సమాచార పత్రాలను పంపిణీ చేశారు. చెక్‌పోస్టు వద్ద పకడ్బందిగా పోలీసులు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేసి ఎన్నికల నిభంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆజం అలీ, ఆర్ఐ నివేదిత, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగం

షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామ దేవతలను పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో బొడ్రాయి, మైసమ్మ దేవతల విగ్రహావిష్కరణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మన పూర్వికులు గ్రామాల్లో మొదటగా గ్రామ దేవతలను కొలిచేవారని, అందుకే అనాడు గ్రామీణ ప్రాంతాలు పాడి పంటలతో ఎంతో అభివృద్ధి సాధించాయని, వర్షాలు సైతం ఎక్కువగా కురిసేవని వివరించారు. గ్రామ సరిహద్దులను కాపాడే దేవతలను అన్నివిధాల పాడేందుకు ఎంతో కృషి చేసేవని, వేప చెట్టు సమీపంలో గ్రామానికి నాలుగు వైపుల పోలిమేరలో అప్పటి గ్రామం మధ్యలో ఎటువంటి ఆలయాలు లేకుండా నాభీ శిలా బొడ్రాయి, ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ విగ్రహాలను ప్రతిష్టించారని గుర్తు చేశారు. పంచభూతాలు గాలి, నీరు, సూర్యుడు, భూమి, అకాశలకు ప్రతీకగానే ఐదు ప్రదేశాలనందు గ్రామ దేవతలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గ్రామంలో కార్యక్రమాలను ఎంతో వైభవంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజుగౌడ్, గణేష్, నర్సింహ్మా, బాల్‌రాజ్ గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆగీరు శేఖర్ గుప్తా, రాయికల్ శ్రీనివాస్, తుపాలకు శేఖర్, లింగారెడ్డిగూడ అశోక్, సీతారాములు, ప్రవీణ్, బచ్చలి నరేష్, ఖదీర్ పాల్గొన్నారు.

## ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట




ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని నజ్దిక్‌సింగారం గ్రామంలో శ్రీ గోల్ల కెతమ్మ శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ట వేడుక దేవాలయ కమిటి అధ్వర్యంలో ఘనంగా జరిగింది. శివ నంది, ధ్వజస్థభం, శిఖర, ఎల్లమ్మ దేవత , చౌడమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ అరుణ పాండురంగారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి కాలం కావడం తో ఎండ వేడిమిని తట్టుకోవడానికి చల్లటి నీడను ఎర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీఅచార్య పరిశుద్ధానందస్వామి, రేవల్లి రాజుశర్మ, అరవింద్ శర్మ, జంగయ్య యాదవ్, రాజుయాదవ్, మాజీ సర్పంచ్ అరుణా పాండురంగారెడ్డి, మాజీఉపసర్పంచ్ వరప్రసాద్‌రెడ్డి, వన్నవాడ రవీంధర్ రెడ్డి, లక్ష్మ ణ్, శ్రీశైలం, మాధవచారి, జగదీష్, నందు, గణేశ్, చిత్తారి, పవన్, విజయ్‌కుమార్. తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల ప్రకారమే భూమిని కొనుగోలు చేశా

ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ప్రభుత్వం నిభంధనల ప్రకారమే భూములు కోనుగొలు చేసినట్లు శ్రీ లక్ష్మి నర్సింహ్మా స్వామి దవలపర్సు బ్రహ్మాచారి అన్నారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలో ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వేనంబర్ 77 లో 17 ఎకరాల 20 గుంటల భూమిని కోనుగొలు చేశామని అన్నారు. రైతుల అంగికారం ప్రకారమే ప్రభుత్వ నిభంధనల ప్రకారం రిజిస్రేష్టన్ చేసుకున్నామని తెలిపారు. గతంలో కూడ చింతపట్ల, మెండిగౌరెల్లి గ్రామాల పరిధిలో కూడా భూములు కోనుగొలు చేసి వెంచరు ఎర్పాటు చేశామని గుర్తు చేశారు.చింతపట్ల రెవేన్యూ పరిధిలోని 83, 84,85 లో 5 ఎకరాల 20 గుంటల భూమిని కొనుగోలు చేశానని తెలిపారు. అయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు కూడి అంగికరించారని అన్నారు. సర్వేనంబర్ 77లో 17 ఎకరాల 20 గుంటల భూమిని చదును చేశాను. ప్రభుత్వం నిభంధనల ప్రకారం వెంచరు వేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అందులో నాలా ఉందని కోందరు ,రైతులు ఒప్పు కొవడంలేదని కోంతమంది వ్యక్తులు తమ పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అక్రమ వెంచరు చేస్తున్నారని అరోపిస్తూ సోషల్ మిడియాలో పెట్టి తమ సంస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులను, ప్రజలను , రైతులను తప్పు దారి పట్టిస్తున్నారని అవేధన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం నాలా కన్వర్షన్, డిటిసిపి పర్మిషన్ తీసుకోని వెంచరు వేస్తున్నామని అన్నారు. వెంచరు విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడడం లేదని తెలిపారు. నిరూపిస్తే దెనికైన సిద్ధమని అన్నారు.

## భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ప్రజాపక్షం/షాద్‌నగర్: భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని తిరుమన్ దేవునిపల్లి (తంగేళ్ళపల్లి) గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా బిఆర్ఎస్ ఎంఎల్‌సి అభ్యర్థి నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, అప్పుడే మనస్సుకు ప్రశాంతత అనేది ఉంటుందని పేర్కొన్నారు. దైవ కార్యక్రమాలను గ్రామస్తులందరు కలిసి కట్టుగా నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. దేవతలను భక్తిశ్రద్ధలతో పూజిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. దాంతో గ్రామస్తులు నవీన్‌కుమార్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామకృష్ణతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆల్విన్ ఫార్మసి పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

ప్రాణాపాయం నుంచి బయటపడిన కార్మికులు

ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు



ప్రజాపక్షం/షాద్‌నగర్ : అల్మిన్ ఫార్మసి పరిశ్రమలో భారీఅగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగులు తీశారు. శుక్రవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పరిశ్రమ కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్ ఫార్మసి పరిశ్రమలో ఒక వ్యక్తి వెల్డింగ్ చేస్తుండ గా ఆ నిప్పు రవ్వలు టాబ్లెట్‌కు సంబంధించిన కెమికల్‌పై పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించినట్లు తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్న సుమారు 300 మంది కార్మికులకుగాను 150మంది కార్మికులు సురక్షితంగా బయటకు వచ్చారని వివరించారు. పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఫార్మసి కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను పైఅంతస్తుల నుంచి ఉన్న కిటికిల నుంచి బయటకు వచ్చి పెద్దఎత్తున కేకలు వేశారు. దట్టమైన పొగల్లో చిక్కుకున్న ఐదు గురిలో ఒక వ్యక్తి భయాందోళనకు గురై భవనం పై నుండి దూకడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఫైరింజన్ అధికారులు ఫార్మసి కంపెనీ వద్దకు చేరుకొని మంటలను ఆదుపు చేయడంతోపాటు భారీ నిచ్చెన వేసి కార్మికులను బయటకు తీశారు. దీంతో అందరూ ఊపిరిపిల్చుకున్నారు. షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్, శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసిపి రంగస్వామిలతోపాటు స్థానిక పోలీస్ సిబ్బంది ఆల్మిన్ ఫార్మసి పరిశ్రమ వద్దకు చేరుకొని ప్రమాదానికి గల కారణాలను కార్మికుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

### అగ్నిప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు

షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్

అగ్నిప్రమాదాలను నియంత్రించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ వివరించారు. స్థానిక పరిశ్రమల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని, అందువల్ల మరో అగ్నిమాపక యాంత్రాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆల్మిన్ ఫార్మసి కంపెనీలో ప్రమాదం చోటు చేసుకోవడంతో గ్రామస్తులు, రాజకీయ నాయకులు అప్రమత్తం కావడంతోనే కార్మికులందరూ ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు.





## కోమటికుంట చెరువులో నిర్మాణాలపై స్పందించిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ పరిధిలోని కోమటికుంట చెరువులో వాసవి ఇన్ ఫ్రా అక్రమంగా నిర్మాణాలు చేపడుతుందంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. చెరువుకు చెందిన బఫర్ జోన్లో నిర్మాణాలు చేస్తోందంటూ నగరానికి చెందిన సతీష్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ అలోక్ అరథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. బఫర్ జోన్లో నిర్మాణాల వ్యవహారంపై ఆధారాలను అందజేయాలని పిటిషనర్ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ఆదేశించింది. నిర్మాణాలను నిలిపివేయాలన్న ఉత్తర్వులను వాసవీ ఇన్ఫ్రా సవాల్ చేసిన పిటిషన్ను కూడా విచారించింది. వీటిపై విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపడుతున్నామని వాసవి వాదన. హెచ్‌ఎండిఏను హైకోర్టు వివరణ కోరింది.

## హైకోర్టులో సునీల్ యాదవ్ పిటిషన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో బెయిల్ మంజూరు చేయాలని హత్య కేసు నిందితుడు సునీల్ యాదవ్ హైకోర్టులో మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ లక్ష్మ ణ్ శుక్రవారం విచారించారు. సీబీఐ వాదనల నిమిత్తం విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు. గూగుల్ ఢ్గుల్ అవుట్ ఆధారంగా నిందితుడిని ఇంతకాలంగా జైలులో ఉంచటం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ లాయర్ వాదన. నిందితుడు దస్తగిరి వాంగ్మూలం తప్ప సునీల్ యాదవ్‌కి వ్యతిరేకంగా మరో ఆధారం లేదన్నారు. ఇంతకాలంగా సునీల్ యాదవ్‌ను జైల్లో ఉంచటం రాజ్యాంగ కల్పించిన హక్కులను హరించడమేనని న్యాయవాది బి రమేష్ వాదించారు. బెయిల్ ఇవ్వొద్దని వివేకా కుమార్తె సునీత న్యాయవాది వాదించారు. సీబీఐ వాదనల నిమిత్తం విచారణ సోమవారానికి వాయిదా పడింది.

## ఎంఎల్‌సి ఎన్నికల్లో మనమే గెలుస్తున్నాం : నవీన్‌రెడ్డి



ప్రజాపక్షం/షాద్‌నగర్: శాసన మండలి ఎన్నికల్లో మనమే విజయం సాధిస్తామని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నవీన్‌రెడ్డిని అభినంధించారు. శుక్రవారం మినర్వ హోటల్ వద్ద కొద్ది సేపు అగారు. నవీన్‌కుమార్‌రెడ్డి ఎలా ఉన్నావయ్యా.. బాగున్నావా ఎంఎల్‌సి ఎన్నికల్లో మనమే గెలుస్తాం..సర్వే రిపోర్టులు పాజిటివ్‌గానే వచ్చాయని కెసిఆర్‌కు నవీన్‌కుమార్‌రెడ్డి వివరించినట్లు తెలిపారు. దాంతో నవీన్‌కుమార్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినంధించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ నేతలు కష్టపడి పని చేసి అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని సూచించినట్లు వివరించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎన్నికల్లో ఎలాగైన విజయం సాధించేందుకు బిఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# దళిత, గిరిజన, బలహీనవర్గాల వ్యతిరేకి బిజెపి

చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల వ్యతిరేకి బిజెపి అని, కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వస్తే దేశంలో ఇప్పుడున్న రిజర్వేషన్లు అన్ని రద్దవుతాయని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వందేళ్లు అవుతున్న సందర్భంగా కాశాయ పార్టీ ఈ నిర్ణయం తీసుకోబోతోందన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పుణ్యమానీ దళితులు, గిరిజనులు, బడుగు, బలహీనవర్గాల వారు, మహిళలు రాజ్యంగబద్ధంగా రిజర్వేషన్ల ఫలితాలను అనుభవిస్తున్నారన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు బిజెపికి కట్టబెడితే, పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీతో రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్‌లను రద్దు చేయొచ్చని భారతీయ జనతా పార్టీ భావిస్తోందని రంజిత్‌రెడ్డి హెచ్చరించారు. అందుకే ఈసారి 400కు పైగా ఎంపి సీట్లు సాధిస్తామంటూ ఆపార్టీ నేతలు భ్రమల్లో ఉన్నారని విమర్శించారు. బిజెపి నాయకులు కలలుగంటున్నట్లు బిజెపి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని మార్చటం ఖాయమనీ, దాంతో రిజర్వేషనులు ఇక మరిచి పోవాల్సిందేనని రంజిత్‌రెడ్డి హెచ్చరించారు. అందువల్ల బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనలు అణగదొక్కేలా పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించాలని, చేవెళ్ల నియోజకవర్గంలో చెయ్యిగుర్తుకు ఓటేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ఎంపిగా గెలిపిస్తే చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తానని లోక్‌సభ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చేవెళ్ల ప్రాంతానికి ప్రత్యేకంగా ఎన్నికల మేనిఫెస్టో రూపొందించి శుక్రవారం బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి, బిజెపి హైదరాబాద్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ అంజన్‌కుమార్ గౌడ్, స్పోక్ పర్సన్స్ సునీతరెడ్డి, తుళ్ల వీరేందర్‌గౌడ్, కెఎస్ రత్నంలతో కలిసి ఆవిష్కరించారు. తనను గెలిపిస్తే చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు రాబోయే ఐదేళ్లలో చేయనున్న పనులను సంకల్ప పత్రం పేరిట ప్రజల ముందుకు తీసుకొచ్చారు. శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మొయినాబాద్ మండలం అజీజ్ నగర్‌లోని బిజెపి కార్యాలయంలో సంకల్ప పత్రాన్ని మీడియాకు వివరించారు. చేవెళ్లను దేశంలో అత్యుత్తమ పార్లమెంట్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం కోసం ఈ సంకల్ప పత్రాన్ని రూపొందించినట్లు బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రకటించారు. అత్యంత వైవిధ్యత కలిగిన చేవెళ్ల నియోజకవర్గంలో 29 లక్షల మంది విభిన్న కులాలు, మతాలు, భాషా బేధాలు కలిగిన వారు ఉన్నారని విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అనుగుణంగా తన సంకల్ప పత్రాన్ని రూపొందించినట్లు విశ్వేశ్వర్‌రెడ్డి వివరించారు. చేవెళ్ల ఎంపి గా ఈ ప్రాంతానికి విద్య, వైద్యంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పంజర్ల ప్రకాష్, మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, మధుసూదన్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



### చేవెళ్లలో ఎగిరేది బిజెపి జెండానే

సార్వత్రిక ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌పై బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమని ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిఅన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్, గాయత్రి నగర్, లెనిన్ నగర్, బడంగ్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విప్లవాత్మక నిర్ణయాలతో నరేంద్ర మోడీ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేశారని, ఆయన చిత్తశుద్ధి,అంకితభావం కారణంగానే ఇవాళ భారతదేశ ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. గ్యారెంటీల పేరు చెప్పి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని, సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించడం ద్వారా బుద్ధి చెప్పాలని విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి బస్సుయాత్ర పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అందెల శ్రీరాములు యాదవ్, కోలను శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశం మరింతగా అభివృద్ధి చెందాలంటే బిజెపితోనే సాధ్యం

బూర నర్సయ్యగౌడ్



ప్రజాపక్షం/యాచారం : దేశం మరింత అభివృద్ధి చెందాలంటే బిజెపితోనే సాధ్యమని బిజెపి భువనగిరి ఎంపి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని మొండిగౌరేల్లి, నల్లవెల్లి, మాల్, తక్కళ్ళపల్లి, మేడిపల్లి, నందివనపర్తి, యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో బూర నర్సయ్యగౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసంధర్బంగా ఆయన మాట్లాడుతూ తనను ఎంపిగా గెలిపిస్తే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గతంలో ఎంపిగా పనిచేసినప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు గుర్తుచేశారు. ఇబ్రహింపట్నం నియోజకవర్గానికి మెడికల్ కళాశాల తేవడానికి కృషి చేస్తానన్నారు. హైద్రాబాద్ నుండి ఇబ్రహీంపట్నం మీదుగా సాగర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. కాంగ్రేస్, బిఅర్‌ఎస్‌లు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కోప్పు సుకన్యభాషా, నాయకులు తాండ్ర రవీంధర్, మర్పల్లి అంజయ్య యాదవ్, డెరంగుల రాజు, వినోద్, రాయికంటి విజయ్‌కుమార్, శ్రీశైలం, యం.జంగయ్య, బూర యాదయ్య, నడికుడి కృష్ణ, జంగయ్య గౌడ్, మేకల యాదగిరి రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో మూడవ ర్యాంకు సాధించిన అఖిల

అభినందించిన ఉప్పల వెంకటేష్



ప్రజాపక్షం/కడ్తాల్: ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లోఆమనగల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన బండ్ల అఖిల రాష్ట్ర స్థాయిలో తృతీయ ర్యాంకు సాధించడం పట్ల ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,తలకొండపల్లి జెడ్‌పిటిసి ఉప్పల వెంకటేష్ విద్యార్థినిని అభినందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అఖిల ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చేరదీసి, హైదరాబాద్ బిఎన్ రెడ్డి, సాగర్ కాంప్లెక్స్‌లోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను చదివించారు. సంకల్పమే శ్వాసగా, సమస్త కష్టాలను, దరిద్రాలను దూరం చేసేది చదివే అని తనను చదివించిన వారి పేరు నిలబెట్టడం కోసం కష్టపడి చదివిన అఖిల బైపిసిలో రాష్ట్రంలో మూడవ ర్యాంకు (990/1000) సాధించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ కు మంచి పేరు తీసుకొచ్చి పలువురి ప్రశంసలు అందుకుంటుంది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చదివిన అఖిల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన అఖిల అభినందనీయురాలని మరెందరో అనాధలు, దిక్కులేని ఆడబిడ్డలను చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, విద్యాదాత, సమసమాజ నిర్మాత, తలకొండపల్లి జెడ్‌పిటిసి ఉప్పల వెంకటేష్‌ను పలువురు అభినందించారు.

# లోక్‌సభ ఎన్నికలకు పటిష్ఠ భద్రత

రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : లోక్‌సభ ఎన్నికలకు అవసరమైన పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. శుక్రవారం లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో చేపడుతున్న భద్రత ఏర్పాట్లను, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి కమిషనరేట్ పరిధిలోని డిసిపి, అదనపు డిసిపిలు, ఎసిపి, ఇతర అధికారులతో నాగోల్‌లోని శ్రేయ ఇంజనీర్ కాలేజీలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సిపి తరుణ్ జోషి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్నిస్థాయిల సిబ్బంది సమాయత్తమయ్యారని తెలిపారు. మల్కాజిగిరి, హైదరాబాద్, చేవెళ్ల, భువనగిరి, నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల వారీగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాచకొండ పరిధిలో పలు జిల్లా సరిహద్దులు, ఇతర ప్రధాన రహదారి మార్గాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద బారికేడ్లు, టెంట్లు, కుర్చీలు, లైటింగ్ వ్యవస్థ, సమాచార సాధనాలు, సిసి కెమెరాల వంటి వాటిని ఏర్పాటు చేశామని తెలిపారు. రాచకొండ పోలీసు సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ రక్షణ బృందాలు కూడా చెక్ పోస్టుల వద్ద తగిన సంఖ్యలో బందోబస్తు విధుల్లో ఉంటారని చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న డబ్బును పట్టుకోవడానికి అవసరమైన చోట్ల మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని సిపి సూచించారు. అధికారులు క్రమం తప్పకుండా చెక్ పోస్టుల వద్ద ఉన్న భద్రతా ఏర్పాట్లను, సిబ్బందిని తనిఖీ చేస్తున్నట్లు, ఆయా జోన్లు,డివిజన్ల వారీగా ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు, తనిఖీల్లో పాటించ వలసిన విధానాలను, చట్టపరమైన నిబంధనలను సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు పెర్కొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** దేశంలో పార్లమెంటు ఎన్నికలు పురస్కరించుకుని నేడు బాలానగర్ మండలంలోని హేమజిపూర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కి మద్దతుగా ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి, గ్రామంలో పర్యటించి ప్రచారం నిర్వహించారు.



## నేడు కెసిఆర్ బస్సుయాత్ర

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** బిఆర్ఎస్‌పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలోభాగంగా తెలంగాణరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించడం జరుగుతుందని కార్యక్రమానికి తెలంగాణరాష్ట్ర అభివృద్ధిప్రధాత చంద్రశేఖర్‌రావు రోడ్‌షో ర్యాలీకి స్వచ్ఛందంగా పార్టీశ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలందరూ పెద్ద ఎత్తున నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి విచ్చేసి రోడ్‌షో కార్యక్రమాన్ని విజయవంతంచేసి పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీ నాయకులు విష్ణు, నరేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

## స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో సంగీతనృత్య శిక్షణ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో స్థానిక విజడమ్‌ది పాఠశాలలో శనివారం వేసవిసంగీతనృత్య శిక్షణశిబిరం 2024 ప్రారంభించబోతున్నారు. 35రోజులపాటు కొనసాగే ఈశిబిరంలో కూచిపూడి శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, పాశ్చాత్యనృత్యం, లలిత సంగీతం, సంగీత వాయిద్యాలు కీబోర్డు, తబలా, డోలక్, దప్పు, రిధమ్ ప్యాడ్‌లలో శిక్షణ ఇవ్వబడును. శిబిరం ముగింపురోజున 17వ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించబడతాయి. చిన్నారులు వేసవి సెలవులను వృథాచేయకుండా శిబిరంలోచేరి కళానైపుణ్యాన్ని పెంపొంచుకోవాలని సంస్థ కార్యదర్శి కె.నరేషాచారి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.



## పలు వివాహవేడుకల్లో రాష్ట్రఫుడ్ కమిషన్‌చైర్మన్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం గట్టి ఇప్పలపల్లి గ్రామానికిచెందిన కృష్ణయ్య కుమారుడు మహేష్ వివాహంలోపాల్గొని నూతన వధూవరులను రాష్ట్రఫుడ్‌కమీషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీమార్కెట్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి మండల బిఆర్ఎస్‌పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, గురువయ్య, రాజు, అశోక్, మల్లేష్, రాములు పాల్గొన్నారు.

## ఎస్‌సి మోర్చా ఆధ్వర్యంలో ఇంటింటి బిజెపి ప్రచారం

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల నియోజకవర్గం ఊరుకొండ మండలం ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఇంటింటి బిజెపి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా పాలమూరు పార్లమెంటు ఎస్సీ మోర్చా ఇంచార్జి డా.కొంగలి శ్రీకాంత్ అడ్వకేట్ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నీరజన్ గౌడ్ సర్పంచు కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మహేందర్ ఊరుకొండ మండలం ఎస్సి మోర్చా జర్నల్ సెక్రెటరీ బిజేవైఎం సీనియర్ నాయకులు అరవింద్ గౌడ్ కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు రాజ్ నాథ్ రెడ్డి, బిజెపి ఊరుకొండ మండలం సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, ఆనంద్ మాచారం మల్లేశ్, బిజెపి నాయకులు గోపాల్, శివ, శివరాజు, నరేందర్ గౌడ్, బిజెపి బిజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల మండలంలోని కోడుగల్ సెక్టార్ ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని గ్రామ పంచాయితీ లక్ష్మి నాయక్ గైరాన్ తాండ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాభ్యాసానికి పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేసి పాఠశాల విద్యాభ్యాసం కోసం వారిని ప్రోత్సాహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గైరాన్ తాండ కృష్ణమ్మ, లక్ష్మి నాయక్ తండా సరస్వతి, మొరంబాయి తండా మేఘమాల , కోడుగల్ 2 జయమ్మ , కుర్వపల్లి భాగ్య, వార్డు నెం రతన్, మాజీ సర్పంచు మోహన్, పిల్లల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్టలో పాల్గొన్న వంశీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బోయపల్లిలో శ్రీశ్రీశ్రీ కోటమైసమ్మ దేవాలయ నాబి, బొడ్రాయి, శిఖర కలశములు ప్రతిష్ట కార్యక్రమాలలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు వంశీచంద్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ మోతిలాల్, నర్సింహ్మా, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్, పురుషోత్తం, ఆంజనేయులు, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి అంటేే... బ్రిటిష్ జనతా పార్టీ

### 'రిజర్వేషన్లు రద్దు కావాలంటే బిజెపికి ఓటు వేయండి
### కోటా పెంచాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయండి
### 'కాంగ్రెస్ జన జాతర' బహిరంగసభలో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / మెదక్ ప్రతినిధి :** "బిజెపి అంటే భారతీయ జనతా పార్టీ కాదు.. బ్రిటిష్ జనతా పార్టీ... మతాలు, జాతుల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని దోచుకోవాలని బిజెపి ప్రయత్నిస్తోంది" అని టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విరుచుకుపడ్డారు. 'రిజర్వేషన్లు రద్దు కావాలంటే బిజెపికి ఓటు వేయండి. రిజర్వేషన్లు పెంచాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేసి అండగా నిలబడాలి. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది. బిఆర్ఎస్, బిజెపి ఒక్కటే. వాళ్ళిద్దరి గూడుపుఠానీ కూడా ఒక్కటే., పదేళ్లు మోసం చేసిన వారికి ఓటేస్తారా.. వంద రోజుల్లో మీకు సంక్షేమం అందించిన వారికి ఓటేస్తారా ఆలోచించాలి' అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో జరిగిన 'కాంగ్రెస్ జన జాతర' బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. దొర గడీలు బద్దలు కొట్టి తెలంగాణ తల్లిని బంధ విముక్తి కల్పించిన ఘనత మెదక్ ప్రజలదని, ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని ప్రజాపాలన కొనసాగించుకుంటున్నామని ఆయన అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తానన్న కెసిఆర్ మాట తప్పారని, అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.22,500 కోట్లు మంజూరు చేసామన్నారు. ఇంటి నిండా ఉద్యోగాలు ఇచ్చుకున్న కెసిఆర్ పదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30వేల ఉద్యోగాలు భర్తీ చేసామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, రిజర్వేషన్లు ఇచ్చి వారికి దామాషా ప్రకారం అవకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. బిసి జనగణన చేపడితేనే ఈ వర్గాల వారికి దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందుతాయని, అందుకే బిసి జనగణన చేపట్టేందుకు అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించుకున్నామన్నారు. మేమిద్దరం మాకు ఇద్దరు అన్నట్లు మోదీ, అమిత్‌షాకు ఆదాని, అంబానీ తొడయ్యారని, వాళ్లంతా కలిసి రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర చేస్తున్నారని రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేసేందుకే లోక్‌సభలో బిజెపికి 400 సీట్లు కావాలంటోందని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ కాలనాగు లాంటి వ్యక్తి అని మనసులో పగ పెట్టుకుంటారని, నల్ల చట్టాలపై కొట్లాడిన రైతులపై మోదీ పగ పట్టారన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి రైతులను ఆదాని, అంబానీలకు బానిసలుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు. అంగి మార్చినా.. రంగు మార్చినా బిజినెస్ పాటిల్ ను బండకేసి కొడతారని, కెసిఆర్‌కు చెప్పిన అనంతరమే బీబీ పాటిల్ బిజెపిలో చేరారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బిడ్డ బెయిల్ కోసం జహీరాబాద్‌లో బిజెపిని గెలిపించాలని కెసిఆర్ కంకణం కట్టుకున్నారన్నారు. జహీరాబాద్ అభివృద్ధి జరగాలంటే ఈ గడ్డపై కాంగ్రెస్ గెలవాలని, నీతికి, నిజాయితీకి మారుపేరు సురేష్ షెట్కర్‌కు ప్రజలు అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు.

**ర్యాంకులు సాధించిన కళాశాలలకు రూ.2 కోట్లు**

ఇంటర్మీడియట్ మొదటి, రెండవ, నాలుగవ ర్యాంకు సాధించిన ప్రభుత్వ కళాశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు రూ.2 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాంతానికి మహిళా ఐటిఐ ఇచ్చే బాధ్యత తనదేనని, నారాయణఖేడ్‌లో 2 వేల ఎకరాలు సేకరిస్తే ఫార్మా విలేజ్ తెచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత కూడా తనదేనని సిఎం హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటున్నామని, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, రూ.500లకే పేదలకు గ్యాస్ సిలిండర్ ఇచ్చి 40లక్షల కుటుంబాలను ఆదుకున్నామని, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించి మీ కళ్లల్లో ఆనందం చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని రేవంత్‌రెడ్డి వివరించారు.

**ధైర్యానికి, తెగింపునకు మారుపేరు రేవంత్‌రెడ్డి**

ధైర్యానికి, తెగింపుకు మారు పేరు సీఎం రేవంత్ రెడ్డి అని రాష్ట్ర మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ప్రత్యేక రాష్ట్ర కలను కాంగ్రెస్ పార్టీ సాకారం చేస్తే తొమ్మిదిన్నర ఏళ్ల కుటుంబ పాలనలో తెలంగాణ నాశనం అయ్యిందని మండిపడ్డారు. మాట ఇచ్చి నెరవేర్చే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపి అభ్యర్థి సురేష్, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ ఆలీతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మోదీ పాలన... దేశ్ కి వినాశ్

### నల్ల చట్టాల మూలంగా 750 మంది రైతులు చనిపోయారు
### పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు
### మహబూబ్‌నగర్ కార్నర్ మీటింగులో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సబ్కా వికాస్ జరగలేదని, దేశ్ కి వినాశ్ జరిగిందని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ విమర్శించారు. శుక్రవారం రాత్రి మహబూబ్‌నగర్‌లో పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా క్లాక్ టవర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగులో ఆయన మాట్లాడారు. గత పదిహేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర భారత్, బేటి పడావో, బేటి బచావో, డిజిటల్ ఇండియా జంధన్ ఖాతా, పసల్ బీమా లాంటి పథకాలతో ఎవరికి లబ్ది చేకూరిందో ప్రజలు ఆలోచించాలన్నారు. ముఖ్యంగా ఓటు వేసి యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాల మూలంగా ఉద్యమం చేస్తున్న రైతులు 750 మంది చనిపోయారని, రైతు వ్యతిరేక ప్రభుత్వం మళ్లీ ప్రజల ముందుకు వచ్చి ఓట్లు వేయాలని ఎలా అడుగుతుందని ఆయన విమర్శించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేస్తున్నామని, విశ్వగురువుగా నరేంద్రమోదీ ఎదిగారని బిజెపి నేతలు గొప్పలు చెప్పుకుంటున్న, రూపాయి విలువ దిగజారి పోవడానికి కారణం ఏంటని ఆయన ప్రశ్నించారు. దేశంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వాటన్నింటిని నింపడానికి నరేంద్ర మోడీ ఎందుకు ప్రయత్నించడం లేదని కెసిఆర్ దుయ్యబట్టారు. దేశంలోని అన్ని రాష్ట్రల లోని జిల్లాలలో ఒక్కో జిల్లాకు ఒక్కో నవోదయ పాఠశాల ఇవ్వాల్సి ఉన్న తెలంగాణ రాష్ట్రంలో గడచిన పదేళ్లలో ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదన్నారు. దేశ వ్యాప్తంగా కొత్తగా 157 మెడికల్ కళాశాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే ఏ ఒక్క మెడికల్ కళాశాల కూడా తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వలేదని అలాంటి బిజెపి పార్టీకి తెలంగాణలో ఓట్లు అడిగే హక్కు లేదని కెసిఆర్ ఫైరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని ఏడు మండలాలను ఆంధ్రాలో కలుపుకున్న మోడీ ఒక్కమాట అనకపోవడం విడ్డూరమన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంతగా నష్టం చేకూర్చిన బిజెపి పార్టీకి ఏ విధంగా ఓట్లు వేయాలో యువత, ప్రజలు ఆలోచించాలని కేసీఆర్ అన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలం చెందిన డీకే అరుణ మళ్లీ తనను గెలిపించాలంటూ ప్రచారాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. తమదే అసలైన సెక్యులర్ పార్టీ అని, పాలమూరు పార్లమెంటు బరిలో బిజెపి, టీఆర్ఎస్ కు మాత్రమే పోటీ ఉందని కాంగ్రెస్ మూడో స్థానంలో ఉందనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. గడిచిన ఐదు నెలలుగా రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ విధ్వంసం చేయడానికి చూస్తుందని, నా ప్రాణం పోయినా రాష్ట్రాన్ని విచ్చిన్నం కానీయనని, మరో యుద్ధం చేయడానికి మీరంతా సిద్దంగా ఉండాలని కెసిఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం 15 ఏండ్లు పోరాటం చేస్తే ఒకతను నిన్ను జైల్లో పెడతా అంటూ పిట్ట కథలు చెబుతున్నారని కెసిఆర్ ఆరోపించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి బిఆర్ఎస్‌కు బలాన్ని చేకూర్చాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు డా.లక్ష్మా రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్ కు ఘన స్వాగతం

**ప్రజాపక్షం/బాలానగర్:** బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు బాలనగర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఘన స్వాగతం పలికారు. కెసిఆర్ బస్సులో ఉండి ప్రజలకు అభివాదం చేశారు. స్థానిక నాయకులు కేసీఆర్‌పై పూలవర్షం కురిపించారు. బిఆర్ఎస్ ఓటమి తర్వాత కెసిఆర్ ప్రజల వద్దకు రావడంతో కార్యకర్తలు ఘన స్వాగతం పలికి హర్షం వ్యక్తం చేశారు.



## బిజెపికి ఓటేస్తే అభివృద్ధి అంధకారం

### మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** కొత్తకోట పామపురం గ్రామంలో ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి దంపతులకు, స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి లకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీరామాలయంలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి లాంఛనంగా ఎన్నికల ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతాభివద్ధిని భ్రష్టు పట్టించిన బిజెపి పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక దేవుడు పేరుతో ఓట్లడుగుతూ రాజకీయం చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. నిజంగా బిజెపి పార్టీ నాయకులకు దేవుడిపై భక్తి ఉంటే 10 ఏండ్లుగా పాలమూరు జిల్లా అన్ని రంగాల్లో ఎండబెట్టి ఇప్పుడు కూడా అభివృద్ధి కోసం ఈ ప్రాంతానికి ఏమి చేశారో తెలుపకుండా కేవలం దేవుడు పేరుతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కలనుకునే ఈ గంట నక్కలకు బుద్ధి చెప్పాలని ఆయన తెలిపారు. బిజెపి మేకవన్నె పులిలా 400 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తామని బిజెపి నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇది కేవలం ప్రజలను మభ్యపెట్టే చర్యలే తప్పా... మరొకటి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ బిజెపి పార్టీ మళ్లీ అధికారంలో వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి ఆనాటి అంబేద్కర్ కృషిని ఈనాటి కాంగ్రెస్ పార్టీ లక్ష్యాన్నే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు ఖచ్చితమైన కుట్రలకు మార్గం ఎంచుకున్నారని ఆయన తెలిపారు. దేశ ప్రజల ఐక్య కోసం రాహుల్ గాంధీ తలపెట్టిన స్ఫూర్తే పాలమూరు అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునాదులు వేశారని అందుకే ప్రజలందరూ మన ప్రాంత ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ ఓటేసి మన అభివృద్ధి మనమే గెలిపించుకుందామని ఆయన పేర్కొన్నారు. అనంతరం జోగులాంబ సన్నిధిలో వంశీచంద్ రెడ్డి శుక్రవారం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయంలో ఆయన సతీమణి అశ్లేషా రెడ్డితో కలిసి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్‌రెడ్డి దంపతులను వేద మంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు ఆలయ అర్చకులు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి అరవింద్ కుమార్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచుపల్లి యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రమోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరేశ్, రామచంద్రి, అంజి, కుర్మన్న, నిరంజన్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

## రేపు మాదిగ విద్యార్థుల సదస్సు

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** నెల 27న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల మాదిగ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెస్ ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు మొలక్కలపల్లి పరుషరాముడు మాదిగ కోరారు. వీపనగండ్ల మండలం కేంద్రంలో ఎస్సీ అంబేడ్కర్ బవనంలో ఎంఎస్ఎఫ్ వీపనగండ్ల్ మండల అధ్యక్షులు దయ్యపు కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెస్ ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు మొలక్కలపల్లి పరుషరాముడు మాదిగ హాజరై మాట్లాడుతూ ఎస్సీ రిజర్వే,న్లు ఏబిసిడి వర్గీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, మాదిగ విద్యార్థులకి మాదిగల చిరకాల ఆకాంక్ష అయినటువంటి ఎస్‌సీ రిజర్వేషన్ల ఏబిసిడి వర్గీకరణ సాధన కోసం నరేంద్రమోడీ హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహసభకు విచ్చేసి మీకు తోడుగా ఉంటాడని త్వరలోనే వర్గీకరణ చేస్తానని మాట ఇవ్వడం జరిగిందన్నారు. 27వ తేదీన ఉస్మానియా యూనివర్శిటీలో జరిగే మాదిగ విద్యార్థుల సదస్సుకు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారు విష్ణు మాదిగ, దయ్యపు కృష్ణ మాదిగ, గడమీది శ్రీరాం మాదిగ, జొల్లు సంజీవ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల పర్యటనలో బీజేపీ నాయకులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలం వడ్డేవాట, చర్లపల్లి గ్రామాలలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల పర్యటనలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించి రాబోవు పార్లమెంట్ ఎలక్షన్లో బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో డికె. అరుణని భారీ మెజార్టీతో గెలిపించాలని వారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మద్దిగట్ల శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము భరత్ భూషణ్ , జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, కొత్తకోట మండల అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్ , రిటైర్డ్ ఆర్మీ బాలస్వామి, వడ్డేవాటా చర్లపల్లి బూత్ అధ్యక్షులు , బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / కొత్తకోట :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మ్ములపల్లి , కనిమెట్ట గ్రామాల్లో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నబిన్నం చేసిన, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ ఇచ్చిన హమీలు నెరవేరుస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలు అమలు చేసిందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , రూ. 500లకే గ్యాస్ సిలిండర్ హమీలను నెరవేర్చిందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పథకాలు అమలుకు నోచుకోలేదని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఇచ్చిన హమీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని, ఆగస్టు 15 నాటికి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలియజేశారు. అసెంబ్లీలో ఎన్నికల్లో ఆదరించినట్లే పార్లమెంట్ ఎలక్షన్ లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

## సొంతగూటికి తిరుపతమ్మ గౌడ్


**ప్రజాపక్షం / వీపనగండ్ల :** గత అసెంబ్లీ ఎన్నికల ముందు కొల్లాపూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్ కోసం ప్రయత్నం చేసి టికెట్ రాకపోవడంతో బీఆర్ఎస్ పార్టీలో చేరిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి తిరుపతమ్మగౌడ్ , ఆమె భర్త కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ మాజీ అధ్యక్షులు కృష్ణయ్యగౌడ్ లు, కాంగ్రెస్ పార్టీలో సొంత గూటికి చేరుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎఐసిసి చేరికల కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ అధ్యక్షుడు ఏఐసీసీ చేరికలు కమిటీ సభ్యులు కోదండరెడ్డిలు తిరుపతమ్మగౌడ్ , కృష్ణయ్యగౌడ్ లకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల విజయానికి తమ శయా శక్తుల కృషి చేస్తామని వారన్నారు.



## వంశీచంద్‌రెడ్డి గెలుపే లక్ష్యం : సిపిఐ(ఎం)

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః జిల్లా సిపిఎం కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి కుల, మత వర్గాల పేరుతో విచ్చిన్నం చేస్తున్న ఈ సమయంలో దేశ వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో భావ సారూపకృత కలిగిన పార్టీలుగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఒక్కటై పనిచేసి బిజెపి ఓటమే లక్ష్యంగా కేంద్ర నాయకత్వం తలపెట్టిన ఇండియా కూటమిని గెలిపించే దిశగా మనందరం ఐక్యంగా పనిచేయాలని అదే విధంగా పాలమూరు అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజా పాలనకు మద్దతుగా తనను ఎంపీగా గెలిపించాలని ఆయన మద్దతు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ నేపథ్యంలో పలు అంశాలను వారు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ, కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి రాములు, వెంకట్రాములు, జబ్బార్, కురుమూర్తి పాల్గొన్నారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/అడ్డాకుల :** అడ్డాకుల మండలం, కన్మనూర్ గ్రామంలో శుక్రవారం ప్రతిష్టించిన 11 అడుగుల అభయ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేతో వేద పండితులు సురేష్ అయ్యగారు ప్రత్యేక పూజల కార్యక్రమాలు చేయించారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సైతం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, గట్ట ఖానాపురం ఎంపీటీసీ దామోదర్, వెల్టూర్ ప్రస్తుతం మాజీ సర్పంచు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సత్యశీల రెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ సి.వెంకటేశ్, వివేక్, రవి, కన్మనూరు గ్రామ పెద్దలు అగ్గిరాముడు యాదవ్, గ్రామ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, గ్రామ యూత్ అధ్యక్షుడు భరత్ సింగరెడ్డి, ఉప అధ్యక్షులు రాంచరణ్ యాదవ్, యూత్ ఉప అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, చిలుకటోన్ పల్లి డీలర్ శ్రీనివాసులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ఓటింగ్ శాతం పెంచేలా కృషి : మున్సిపల్ కమిషనర్

### కళాబృందం గీతాలతో విస్తృత అవగాహన

**ప్రజాపక్షం/జడ్చర్ల:** శుక్రవారం నాడు జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా సిబ్బందికి జిల్లా స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటింగ్ శాతం పెంచడానికి ప్రత్యేక సమావేశంలో నిర్వహించబడింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు పాతబజార్ హనుమాన్ మందిరం వద్ద మున్సిపల్ కమీషనర్ రాజయ్య అధ్యక్షతన మెప్మా సిబ్బందికి సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి డా.శ్రీధర్ సుమన్ ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. స్వీప్ నోడల్ అధికారి ఓటరు చైతన్యం కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగా మెప్మా సిబ్బంది తప్పక తమ తమ ప్రాంతాల్లో ఓటింగు శాతం పెంచడం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ రాజయ్య మాట్లాడుతూ ఒక్క ఓటు కూడా వృథం కాకుండా అందరూ ఓటింగ్‌లో పాల్గొనాలని అన్నారు. 18 సం.దాటిన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి కృషి చేయాలని అన్నారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్ల కొరకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి స్వీప్ ఆధ్వర్యంలో విస్తృాత ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో పలు నినాదాలిచ్చారు. 1.ఎన్నికల పర్వం... దేశానికి గర్వం 2. ఓటు హక్కు.... ప్రజల హక్కు 3. నిర్భయంగా ఓటేద్దాం... ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం. 4. ఓటేసే బాధ్యత... మనందరి బాధ్యత 5.ఓటరు చైతన్యం ప్రజాస్వామ్య ప్రభంజనం వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత బృందంచే పలు ఆకర్షణీయమైన పాటలు, గీతాలాపనతో ఆకట్టుకున్నారు. ఓటర్లందరూ ఓటింగులో పాల్గొనేలా తమ బంధువులు సమీప ఓటర్లను చైతన్యం చేయాలని పాటలతో, గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేష్, మెప్మా జడ్చర్ల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సునీత, లక్ష్మి , మాసూం బాబా, సాధిక్, మరియు 200 మందికి పైగా మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మేడేను విజయవంతం చేద్దాం

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి.వి శ్రీనివాస్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా శ్రమదోపిడి గురయ్యే కార్మికుల పక్షాన ఏఐటియుసి రాజీలేని పోరాటాలు చేస్తూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులందరూ పోరాడుతున్న బాధ్యత మన అందరిపై ఉన్నదని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్ అన్నారు. మతోన్మాద ముసుగులో ప్రజా సమస్యలను ప్రక్కదారి పట్టిస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు మే డే స్ఫూర్తితో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. గోడపత్రికను ఆవిష్కరించారు. సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణ, శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి మనోజ్ చారి, ఇంద్రానగర్‌శాఖకార్యదర్శి దావీద్, ఏఐటీయూసీ నాయకులు రాజుగౌడ్ అంజి పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న అంతర్జాతీయ సదస్సు




**ప్రజాపక్షం/దుండిగల్ :** వివిఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ అండ్ ఇంజనీరింగ్ స్ సైన్స్ విభాగం సిఎస్‌ఈ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మెట్రిక్స్ మ్యాథమెటిక్స్ అండ్ అడ్వాన్స్ డేటా అనలాటిక్స్ ఇండస్ట్రీస్ పేరిట అంతర్జాతీయ సదస్సు ప్రారంభించారు. లెఫ్టినెంట్ గిరీష్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశం 16 శతాబ్దం నాటి నుండి కొంత ప్రయాణీకరణ జరిగిందని ఒకనాడు కేవలం ఇక ప్రదేశిక మ్యాపులు రూపొందించడమే కష్టం మైన కాలం నుండి ఉపగ్రహ దారిత అంతరిక్ష సాంకేతిక దాక పరిణామం లో గణితశాస్త్రం డేటా సైన్స్ రంగాల పాత్ర ప్రాముఖ్యమని వివరించారు. ప్రధాన కార్యదర్శి జెవిఎస్ రావు ప్రధానోపాధ్యాయులు ఆచార్య సిడి నాయుడు, బి.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నేత బండాల సత్యనారాయణ ఆకస్మిక మృతి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** కార్మిక వర్గాలకు ఏఐటియుసి కార్మిక నేతగా, సిపిఐ పార్టీ నాయకుడిగా ఎన లేని సేవలందించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి కామ్రేడ్ బండాల సత్యనారాయణ ఆకస్మిక మృతి తీరని లోటని పార్టీ నేతలు అన్నారు. అ నారోగ్యంతో శుక్రవారం కన్ను మూసిన ఆయన ఇంటికి చేరుకొన్న పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పార్థీవ దేహంపై ఎర్ర జెండా కప్పి జోహారులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ మాట్లాడుతూ కామ్రేడ్ బండాల సత్యనారాయణ పార్టీలో చేరి నాలుగు దశాబ్దాల పాటు సేవలందించారని, పార్టీ కోసం, కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు పని చేసారన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఆయన శ్రమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సంతాప కార్యక్రమంలో పార్టీ ఆల్వాల్ మండల కార్యదర్శి కె,సహదేవ్, మల్కాజిగిరి మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి పి.చంద్రయ్య, రొయ్యల కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్‌లు పాల్గొని బండాల సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి

### సత్యనారాయణ సేవలు అపూర్వం

**ప్రజాపక్షం/ జవహర్‌నగర్:** కామ్రేడ్ బండాల సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని, పేదల పక్షాన నిరంతరం పోరాడిన శ్రమ జీవి అని, వారి ఆశయ సాధన కోసం పోరాటం ఉధృతం చేస్తామని సీపీఐ, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. యాప్రాల్‌లోని తన నివాసంలో శుక్రవారం బండాల సత్యనారాయణ కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సీపీఐ, ఏఐటీయూసీ, ఆర్‌టీసీ మాజీ కార్మికులు నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు దశరథ్, కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్, సహదేవ్, యాదయ్యగౌడ్, చంద్రయ్య, నరేంద్రచారి, యాదగిరి, వెంకటేష్‌గౌడ్, బాబు, వై వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రగతి కోసం గెలిపించాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** నిజమైన రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి సునీతా రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలంటూ మల్కాజిగిరి స్థానిక నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నేరేడ్‌మెట్ డివిజన్‌లో శుక్రవారం ప్రచారం కొనసాగించారు. కేవలం నాలుగు మాసాల్లో కాంగ్రెస్ పాలనలో కొనసాగుతున్న అనేక సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎంపిగా పార్టీ అభ్యర్థి గెలుపొందటం ద్వారా మరింత బలోపేతంతో అభివృద్ధి వేగంగా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. డివిజన్‌లోని జెజె నగర్ కాలనీలో జరిగిన ప్రచారంలో చెన్నారెడ్డి, చంద్రశేఖర్, నారాయణరెడ్డి, రాజు, యాదగిరి, కృష్ణ బిల్డర్‌లతో పాటు పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఓల్డ్ సఫిల్‌గూడలోని ద్వారకామాయి కాలనీలో ఉన్న శ్రీనాగేశ్వర సాయినాథ దేవాలయ 12వ వార్షికోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి శాసనభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ చైర్మన్ వెంకటేశ్వరరావు ఆయనను ఘనంగా స్వాగతించారు. ఆయన వెంట భాగ్యనంద రావు, మహేష్‌గౌడ్, నరసింహా గౌడ్, భరత్, తదితరులు ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే మల్కాజిగిరిలోని సర్దార్ పటేల్ నగర్‌లోని నాగదేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ముర్గేష్ గౌడ్, శ్రీనివాసగౌడ్, శ్రీకాంత్, నర్సింగ్, రాములు తదితరులతో కల్సి పాల్గొన్నారు.

## రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేష్‌జైవన్షి సమక్షంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలవారిగా ర్యాండమైజేషన్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పూర్తిచేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్‌ఐసిహాలులో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ప్రక్రియలో రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టినట్లు ఇందులోభాగంగా 1090 ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 1089 అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 2266 ఓపిఓ, 150 మైక్రో అబ్జర్వర్స్‌కు ఎన్నికల విధులు కేటాయించినట్లు తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోగల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలవిధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వుసిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని, పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడిన ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్‌సిబ్బంది ఉంటారని అన్నారు. ఈర్యాండమైజేషన్ ప్రక్రియ కార్యక్రమాన్ని జనరల్ అబ్జర్వర్ రుచేష్‌జైవన్షి నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, వనపర్తిజిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో బిజెపిని చిత్తుగా ఓడిద్దాం

కార్మిక వర్గాలకు వివిఎస్ బోస్ పిలుపు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** అణచి వేత ధోరణితో బిజెపి పాలనలో కేంద్ర ప్రభుత్వం తీసుకొంటున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నష్టం చేస్తూ ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించాలంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉప్పల్‌లో ఏఐటియుసి ఆధ్వర్యంలోకరపత్రాల పంపిణీ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలంటూఆయన ఓటర్లను, కార్మికులను కోరారు.ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా బ్రిటిష్ వారితో సహా పోరాడి సాధించుకొన్న కార్మిక సంబంధిత 44 చట్టాలను, హక్కులను మోడి ప్రభుత్వం రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తెచ్చి కార్మికులపై బలవంతంగా రుద్దుంటంతో కార్మిక హక్కులన్నీ హరించుకొని పోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికులకు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉంటూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని, 8 గంటల పని కాలాన్ని 12 గంటలకు పెంచటం, పర్మినెంటు ఉద్యోగం అనేది లేకుండా చేయటం, కంట్రాక్ట్ విధానాన్ని తేవటం ద్వారా ఉద్యోగ కార్మికుల హక్కులు పోయాయన్నారు. ఉద్యోగులకు ఎప్పుడు ఉపాధి ఉంటుందా ఎప్పుడు ఊడుతుందా అన్న భయంతో కాలం గడపాల్సి వస్తోందన్నారు. , ఎయిర్ పోర్టులు, ఓడరేవులు, బిఎస్‌ఎన్‌ఎల్, బ్యాంకులు, ఎల్‌ఐసి, స్టీల్ మరియు కోల్‌మైన్స్ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నిటినీ బిజెపి ప్రభుత్వం అంబానీ, ఆదానిలకు మోడీ ప్రభుత్వం ధారాధత్తం చేస్తోందన్నారు. మన ఉప్పల్ ప్రాంతంలోని హెచ్‌సిఎల్, హెచ్‌ఎంటి బేరింగ్‌ల్లాంటి సంస్థలు మోడీ అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాల వల్లే మూతబడ్డాయన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కార్మికులందరూ సంఘటితంగా ప్రజావ్యతిరేక బిజెపిని ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలంటూ వివిఎస్ బోస్ కోరారు.

## లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ మల్కాజ్‌గిరి బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని శామీర్‌పేట ఎంపిపి ఎల్లుబాయిబాబు అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండల కేంద్రంలో బిఆర్‌ఎస్ అభ్యర్థి తరుపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోమొట్ట మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని చెప్పారు. బిఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని గమనించి కారు గుర్తుకు ఓటు వేసి ఎంపి అభ్యర్థిని లోక్‌సభకు పంపించాలని ప్రజలను కోరారు. జనరల్ సెక్రటరి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఐలయ్య, డైరక్టర్ భూమిరెడ్డి, మాజి వార్డు సభ్యుడు ఉప్పలయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధు, బాబు, రవి, శేఖర్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై వివక్ష తగదు

తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పౌరహక్కుల దినోత్సవాన్నిఅధికారికంగా నిర్వ హించాలని తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బి ఎన్ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ దేవరయాంజాల్‌కు చెందిన రామ్మోహన్ దేశ రాజధాని న్యూఢిల్లీలోని జాతీయ కమిషన్ ఆఫ్ షెడ్యూల్డ్ కులాల చైర్మన్ కిషోర్ మక్వానాను కార్యాలయంలో కలిసి దళితుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికి దళితులపై వివక్ష కొనసాగుతుందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16,(4) ప్రకారం సమాన అవకాశాలను అందుబాటులో ఉంచడానికి సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించాడానికి ఉద్దేశించబడ్డాయని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం దలితులు, బలహీన వర్గాల సంక్షేమం సమర్థవంతమైన అమలు కోసం ఆశిద్దాం అని తెలిపారు. సానూకులంగా స్పందించిన చైర్మన్ కిషోర్ మక్వానా వీలైనంత త్వరగా అ విషయంపై రాష్ట్ర డిజిపికి లేఖ పంపిస్తానని చెప్పారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/తాండూరు:** చేవెళ్ళ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపి గడ్డం రంజీత్‌రెడ్డికు మద్దతుగా తాం దూరు పట్టణంలో భారి బైక్ ర్యాలీని నిర్వహించారు.శుక్రవారం తాండూరు పట్టణంలో స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యాన పట్టణంలోని విలేమూన్ చౌరస్తా నుండి ఇందిరాచౌక్, ప్రధాన చౌరస్తాల మీదుగా బైక్ ర్యాలీ సాయిపూర్‌కు చేకుంది. ఈ సందర్భంగా సాయిపూర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్న్ మీటింగ్ ఎంపి, ఎంఎల్‌ఎ పాల్గోన్నారు.


# ఎన్నికల ఏర్పాటుపై ప్రత్యేక సూచనలు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ఎన్నికల విధులను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ జరగబోయే లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఓటరు జాబితా పూర్తి అయినందున ప్రతి నియోజకవర్గం వారీగా ఒక టీం ను ఏర్పాటు చేసి ఓటరు జాబితా ను ప్రింట్ తీసుకొని గుర్తించిన రాజకీయ పార్టీల వారికి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి పోలీంగ్ స్టేషన్ నెంబర్ పూర్తి చిరునామా కరెక్ట్‌గా ఉన్నాయా లేదా అని చేక్ చేసుకోవాలని అన్నారు. జిల్లాలో ఓటర్ స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణి చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని అన్నారు. రెండవ విడత శిక్షణ కార్యాక్రమం ఏర్పాటు చేయాలని 17సిపిసి డైరి పూర్తి అవగాహన కలిపించాలని అదేశించారు. త్రాగు నీరు ,వికలాంగులకు కోసం వీలు చైర్ ఏర్పాటు చేయాలని ,ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరుగకుండ ఎన్నికల సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఇదిలా ఉండగా వికారాబాద్ నియోజకవర్గం మేరీ నాట్ పాఠశాలలో భద్రపరిచిన ఈవీఎం,వివి ప్యాట్లస్ట్రాంగ్ రూమ్‌లను జిల్లాకలెక్టర్ నారాయణరెడ్డి ,జిల్లా ఎస్పి కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి సందర్శంచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. విదులునిర్వహిస్తున్న సిబ్బందిని పలకరించి, వారికి ఉన్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.



కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ క్రింద చేపట్టే పనులకు లేబర్ మొబిలైజేషన్ జరిగితే గ్రామా అభివృద్ధి పనులు జరుగుతాయిని ,మే చివరి వరకు ఎన్‌ఆర్‌జిఎస్ పూర్తి చేయాలనీ అధికారును అదేశించారు. ఏ గ్రామ పంచాయతీలో ఎంత మంది లేబర్ ను సమీకరిస్తున్నారు. టార్కెట్ ను పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో ఎంత మంది లేబర్ వస్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ ప్రజలకు త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని అధికారులను అదేశించారు.

## కమలానికి పట్టని నిబంధనలు



**ప్రజాపక్షం/తాండూరు:**ఎన్నికల నగర మోగిన తాండూరు పట్టణంలో ఆ నిబంధనలు అమలు కావడం లేదు. కోడ్ కూసిన వెంటనే అయా పార్టీల పోస్టర్లు, గుర్తులను వెంటనే తొలగించాల్సి ఉంటుంది. కాని అధికారులు మాత్రం అటు వైపు కన్నెతి కూడా చూడటం లేదన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. తాండూరు పట్టణంలో మాత్రం అదేది పట్టడం లేదు. ఓ పార్టీకి చెందిన గుర్తు తాండూరు పట్టణంలో మెరుమీట్లు మెరుస్తుంది. తాండూరు పట్టణంలో ఆ పార్టీకి ఎన్నికల కోడ్ నిబధనలు పట్టవా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓ పార్టీకి ఓ రూల్...మరో పార్టీకి ఓ రూల్ ఉంటుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిని బట్టి చూస్తుంటే తాండూరు పట్టణంలో కోడ్‌లు అమలు తీరుపై విమర్శలు వ్యక్తవుతున్నాయి. ఎన్నికల శెడ్యూల్ వచ్చి ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్‌లు సైతం దాఖాలు చేసిన తాండూరు పట్టణంలో మాత్రం గోడలపై రాతలు, బిల్డింగ్‌లపై గుర్తులను మాత్రం అట్టే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా తాండూరు పట్టణంలోని శాంత్ మహాల్ చౌరస్తా సమీపంలో ఓ బిల్డింగ్‌పై పువ్వుగ్తు రాత్రి పూట రంగులతో విరజిల్లుతుంది. ఇప్పటికైన సంబంధింత అధికారులు స్పందించిన ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయాలని అయా పార్టీల నేతలు సూచిస్తున్నారు.

## మన ప్రాంత అభివృద్ధి..మనచేతుల్లోనే



కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్

**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** మల్కాజ్గిరి పార్లమెంట్ బిఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం రంగారెడ్డి నగర్ డివిజన్ గురుమూర్తి నగర్ లో కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా రాజకీయాలకతీతంగా ప్రజాసేవలో నిమగ్నమై ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించిన నాయకుడు బిఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మరో పక్క ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి పదవుల కోసం పాకులాడే నాయకులు బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకులన్నారు. మనకు ప్రజా సంక్షేమం కోసం పాటు పడే నాయకులు కావాలి కానీ, పదవుల కోసం పాకులాడే నాయకులు అవసరం లేదన్నారు. ఇలాంటి నాయకులను మే 13న జరిగే ఎన్నికల్లో ఓడించి ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సంక్షేమ కోసం పనిచేసే నాయకుడు బిఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గాగిల్లపూర్‌లో భూవివాదం

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఘర్షణ వాతావరణం

**ప్రజాపక్షం/దుండిగల్ :** హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో రోజు రోజుకు భూముల ధరలు ఆకాశానికి అంటుతుండడంతో అదే స్థాయిలో భూవివాదాలు చోటు చేసుకుంటున్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లపూర్‌లో మరో సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఓ వివాదంలో గ్రామస్తులు గురువారం జైలుకు వెళ్లడంతో ఇదే అదనుగా భావించిన నగరానికి చెందిన అల్వాల్ రెడ్డి మనుషులు సుమారు 10 మంది అడ్డాకూలీలను,మరో 20 మందికి పైగా రప్పించి పట్టాభూమిలో ఉన్న షెడ్లను తొలగించే ప్రయ త్నం చేశారు. గ్రామస్తులు,బాధిత మహి ళలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దుండిగల్ పెట్రోలింగ్ పోలీస్ లు ఇరువురికి సర్దిచెప్పడంతో సమస్య సద్దుమనిగింది. కొందరు వ్యక్తులు బొందలగడ్డలను ఆక్రముస్తుండడంతో అడ్డుకున్న మా వారిని కావాలనే పోలీస్ తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని, మా వాళ్ళు జైలుకు వెళ్లిన మరుసటి రోజే అల్వాల్ రెడ్డి మనుషులు పోలీస్ ల సహకారంతో మా భూములను ఆక్రమించేందుకు పక్కా ప్రణాళికతో వచ్చి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ బాధిత మహిళలు ఆ రోపిస్తున్నారు. గాగిల్లపూర్ గామ పరిధిలోని సర్వే నంబర్.235 లోని 4 ఎకరాల స్థలాన్ని గాగిల్లపూర్ గ్రామానికి చెందిన మోర భూమి సాయిలు 1989లో అదే గ్రామానికి చెందిన మహమ్మద్ కరీముద్ది నుండి కొనుగోలు చేసాడు.725 రూపాయల స్టాంపు డ్యూటీ తో అప్పటి కుత్బుల్లాపూర్ తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేశారు అప్పటి నుండి ఆయన తదనంతరం కుమారులు మోర మల్లేష్, మోర అశోక్, మోర యాదయ్య, మోర గోపాల్ అనుభవిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అదే సర్వే నంబర్ లో ఉన్న మిగతా 2 ఎకరాల 15గుంటల స్థలాన్ని నగరానికి చెందిన అల్వాల్ రెడ్డి 2023 లో కొనుగోలు చేసాడు,గాగిల్లపూర్ లో ఎకరా పొలం 20 కోట్లకు పైగా పలుకుటుండడం, కొన్న స్థలంలో రోడ్డు వెడల్పు రూపంలో కొంత వెళ్లడంతోనే ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. 2024 జనవరిలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. సర్వే అనంతర స్థలం తగ్గడంతోనే అల్వాల్ రెడ్డి మా పొలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. మోర భూమి సాయిలు కుమారులు జైలుకు వెళ్లడంతో ఇదే అదనుగా బావించిన సదరు వ్యక్తులు స్థానిక పోలీస్ ల సహకారంతో 30 మంది గుండాలతో గ్రామంలో హల్చల్ చేస్తూ షెడ్లను తొలగించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. జైలు నుండి వచ్చాక సమస్యను పరిష్కరించుకుందామని మహిళలు అడ్డుకున్న వినకపోవడంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. చివరకు పెట్రోలింగ్ పోలీస్ లు వచ్చి సర్దిచెప్పడంతో గొడవ సద్దుమనిగింది. దుండిగల్ మున్సిపాలిటీ లో సివిల్ తగాదాలలో పోలీస్ ల జ్యోక్యం చేసుకుంటున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. గాగిల్లపూర్ లో భూయజమానులు జైలుకు వెళ్లడంతో అదునుగా భావించిన కొందరు వ్యక్తులు పోలీస్ సహకారంతో గాగిల్లపూర్ సర్వే నంబర్ 235 లోని 4 ఎకరాల స్థలాన్ని కబ్జాకు యత్నిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

## ప్రత్యేక అవసరాలున్న వారి జీవితాలకు సాధికారత కల్పించడంలో మేటి

శంకర్ ఫౌండేషన్ సంస్థాపకులు శ్రీదేవి ప్రసాద్‌కు యుద్ధవీర్ అవార్డు

12మందికి పైగా పిల్లలు, పెద్దలకు వైద్య చికిత్స అందజేత

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రత్యేక అవసరాలు ఉన్న వారి జీవితాలకు సాధికారత కల్పించడంతో పాటు వారికి నాణ్యమైన పునరావాస సేవలు అందించడం కోసం నిబద్ధతతో నిర్విరామంగా చేస్తున్న కృషికి గుర్తింపుగా శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులుశ్రీదేవి ప్రసాద్ కు యుద్ధవీర్ ఫౌండేషన్ మెమోరియల్ అవార్డు ను ప్రకటించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఏప్రిల్ 30వ తేదీ మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు కింగ్ కోఠిలోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియం, హైదరాబాద్ లో ఈ అవార్డును అందజేయనున్నారు. ఈ అవార్డుతో పాటు లక్ష రూపాయల నగదు పురస్కారం, ప్రశంసా పత్రాన్ని కూడా ప్రదానం చేయనున్నారు. గత 24 సంవత్సరాలలో ఆమె దాదాపు 1,200 మందికి పైగా పిల్లలు, పెద్దలకు అవసరమైన చికిత్స, అంద చేయడంతో పాటు విద్య, వృత్తి విద్య, పరివర్తనా శిక్షణ అందించి వారిని తమ కాళ్ళపై తాము నిలబడేలా తయారు చేశారు.కాగా, మూడు విభిన్న కార్యక్రమాల



ద్వారా ప్రత్యేక అవసరాలు ఉన్న వారి వికాసం కోసం ఆమె పని చేస్తున్నారు. దీనిలో మొదటిది శ్రద్ధ సబూరి కేంద్రం. ఇక్కడ విద్య ను అందిస్తున్నారు. అలాగే రెండోదైన సమర్థ్‌సాకార్ కేంద్రం ద్వారా 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల పెద్దలకు ఉపాధిని కల్పిస్తున్నారు. ఇక మూడోది సన్నిధి స్వాంతన కేంద్రం. ఇక్కడ ప్రత్యేక అవసరాలు ఉన్న వారు తమ జీవితాన్ని ఎవరిపైనా ఆధార పడకుండా జీవించేందుకు అవసరమైన శిక్షణను అందిస్తున్నారు. ఇక్కడ వృద్ధాప్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ మూడు కార్యక్రమాల మద్దతుతో వెల్స్ ఫార్గో బ్యాంక్, టాటా అడ్వాన్సడ్ సిస్టమ్స్, ఎల్ టీ ఐ మైండ్ట్రీ వంటి ప్రముఖ కంపెనీలతో అనేకమంది ఉపాధి పొందారు. మరికొందరు సేంద్రీయ ఉత్పత్తులు, సబ్బులు తయారీ తదితర పనులు చేసుకుంటూ గౌరవప్రదమైన జీవనం సాగిస్తున్నారు.

## ఎన్నికల విధులపై అవగాహన

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత సముదాయాలభవనంలోని ఎన్‌ఐసిహాల్లో గుర్తింపుపొందిన రాజకీయపార్టీల నాయకులతో ఓటరుస్లిప్పుల పం పిణీ, హోమ్ ఓటింగ్, బూత్‌లెవల్ ఏజెంట్, ఆక్సిలరీ పోలింగ్‌స్టేషన్స్ అంశాలపై శుక్రవారం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆక్సిలరీ పోలింగ్‌స్టేషన్స్ 92 ఏర్పాటుచేశామని, ప్రతిఓటరుకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తామని, ఓటరు అందరికి స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ఈనెల 25నుంచి వచ్చేనెల 8వతేదివరకు పంపిణీ పూర్తిచేస్తామని తెలిపారు. ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ సంబంధిత తహసీల్దార్ల పర్యవేక్షణలో బిఎల్‌ఓలద్వారా పంపిణీ చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టామని వివరించారు. తమ బూత్‌పరిధిలో బిఎల్‌ఓ ఓటరు స్లిపును నమోదిత ఓటరుకు, ఓటరుకుటుంబంలోని సభ్యునికి అందజేస్తామన్నారు. బిఎల్‌ఓ ఓటరు స్లిపును స్వీకరించినందుకు రశీదుగా, రిజిస్టర్‌లో ఓటరుస్లిప్ పంపిణీచేయబడిన వ్యక్తియొక్క సంతకం తీసుకుంటారని చెప్పారు.

# బిజెపి, బిఆర్‌ఎస్‌లను బొందపెట్టండి

తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

మల్కాపూర్‌లో పర్యటన



**ప్రజాపక్షం/తాండూరు:** వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బిజేపి, బిఆర్‌ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరు మండల పరిధి మల్కాపూర్ తదితర గ్రామాలలో ఎంపి రంజీత్‌రెడ్డితో కలసిన పర్యాటించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాష్ట్రంలో బిజేపి, బిఆర్‌ఎస్ పార్టీలో తోడు దొంగలని విమర్శించారు.ఈ ఎన్నికలలో ఆ పార్టీలకు ప్రజలు బొంద పెట్టాలని సూచించారు. కార్పోరేట్ గద్దలకు కాపలా కాస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోదిని గద్దే దించాల్సిన సమయం అసన్నమైందన్నారు. దేశ సంపదను ఆదానిలకు కట్టాబెట్టారే తప్ప పేద ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని విమర్శించారు. చేవెళ్ళ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజీత్‌రెడ్డి విజయం సాదించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. రంజీత్‌రెడ్డి ఎంపిగా విజయం సాదిస్తే ఆయన సహకారంతో తాండూరు అధికన నిధులు తీసుకవచ్చి తాండూరును అన్ని రంగాలలో ముందు ఉంచుతామన్నారు. విద్యపరంగా ఐటిఐ,ఇంజనీరింగ్ కళాశాలను తాండూరుకు వచ్చే విధంగా చూస్తామన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ళ ఎంపి అభ్యర్థి రంజీత్‌రెడ్డి మాట్లాడుతూ మతం పేరుతో రాజకీయం చేస్తున్న బిజేపి పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మరో మారు చేవెళ్ళ ఎంపిగా గెలిపిస్తే తాండూరుకు మరింత సేవా చేస్తానని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తిని గెలిపంచుకోవాలని, హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యాధిక మేజార్టీని అందించాలని కోరారు. హామీలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. గెలుపునకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిఎస్‌సిఎస్ చైర్మన్ రవిందర్ గౌడ్, ఉత్తమ్‌చంద్, జనార్ధన్‌రెడ్డి,డాక్టర్ సంపత్‌కుమార్, జడ్పీటిసి ధారాసింగ్, మాజీ జడ్పీటిసి రాకేష్ మహారాజ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వద్దే శ్రీనివాస్,మండల పార్టీ అధ్యక్షులు నాగప్ప, మాజీ సర్పంచ్ రవిశిందే తదితరులు పాల్గోన్నారు.

## క్రీడ

# పంజాబ్ రికార్డు ఛేజింగ్




**కోల్‌కతా:** ఐపిఎల్ 2024లో రికార్డు ఛేజింగ్‌తో కోల్‌కతాపై పంజాబ్ భారీ విజయాన్ని నమోదు చేసింది. 262 పరుగుల లక్ష్యాన్ని.. పంజాబ్ 18.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెయిర్‌స్టో (108*; 48 బంతుల్లో) శతకంతో చెలరేగిపోయాడు. శశాంక్ సింగ్ (68*; 28 బంతుల్లో), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (54; 20 బంతుల్లో) అర్ధశతకాలతో అదరగొట్టారు. కోల్‌కతా బౌలర్లలో నరైన్ 1 వికెట్ తీశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 6 వికెట్లకు 261 పరుగులు చేసింది. సాల్ట్ (75), నరైన్ (71) చెలరేగి ఆడారు. అర్ష్‌దీప్ 2, కరన్ 1, రాహుల్ 1, హర్షల్ 1 వికెట్ తీశారు.


# యువీకి అరుదైన గౌరవం
# టి20 వరల్డ్‌కప్ అంబాసిడర్‌గా ఎంపిక




**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్‌కు అరుదైన గౌరవం దక్కింది. అతడు 2024 టి20 వరల్డ్‌కప్ అంబాసిడర్‌గా ఎంపికయ్యాడు. 2007 వరల్డ్‌కప్‌లో భాగంగా 6 బంతుల్లో 6 సిక్స్‌లు బాదిన యువిని పొట్టి ప్రపంచకప్‌కు అంబాసిడర్‌గా ఐసిసి నియమించింది. ఈ విషయాన్ని ఐసీసీ సోషల్ మీడియాలో గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ అంబాసిడర్ పాత్రలో భాగంగా యువీ, జూన్ 9న జరగనున్న భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌తోపాటు వరల్డ్‌కప్ టోర్నీలో ప్రమోషన్ ఈవెంట్లు, ఆయా కార్యక్రమాల బాధ్యతలు చూడనున్నాడు. దీనిపై యువరాజ్ స్పందించాడు. 'ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు బాదడం సహా టీ20 వరల్డ్‌కప్ ద్వారానే క్రికెట్‌లో నాకు కొన్ని జ్ఞాపకాలు ఉన్నాయి. రానున్న వరల్డ్‌కప్‌లో భాగం కాబోతున్నందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నాను' అని యువీ అన్నాడు. కాగా, ఐసిసి వెస్టిండీస్ మాజీ ప్లేయర్ క్రిస్ గేల్, ఒలింపిక్ మెడల్ విన్నర్ ఉసెన్ బోల్ట్‌ను రీసెంట్‌గా అంబాసిడర్‌లుగా ఎంపిక చేసింది. తాజాగా యువీ కూడా ఈ లిస్ట్‌లో చేరిపోయాడు. దీంతో ఈ ముగ్గురు 2024 వరల్డ్‌కప్ అంబాసిడర్‌లుగా వ్యవహరించనున్నారు. కాగా, జూన్ 1 నుంచి పొట్టి ప్రపంచకప్ సమరం ప్రారంభం కానుంది. ఈ టోర్నీకి అమెరికా, వెస్టిండీస్ దేశాలు ఆతిథ్యమివ్వనున్నాయి. ఇప్పటికే టోర్నీకి సంబంధించిన పనులను నిర్వాహకులు దాదాపు పూర్తి చేశారు. ఇక ఈ టోర్నమెంట్‌లో 20 జట్లు నాలుగు గ్రూపులుగా విడిపోయి పోటీ పడతాయి. ఈ నేపథ్యంలో భారత్ గ్రుప్ 'ఎ'లో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్‌తో పాటు పాకిస్థాన్, ఐర్లాండ, యుఎస్‌ఎ, కెనడా ఉన్నాయి. ఇక క్రికెట్‌లోనే హై వోల్టేజ్ మ్యాచ్ భారత్ పాకిస్థాన్ పోరుకు న్యూయార్క్ వేదిక కానుంది.

# యూట్యూబ్ ఛానెల్ స్టార్ట్ చేసిన బుమ్రా

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం సోషల్ మీడియా వినియోగదారుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి ప్లాట్‌ఫామ్‌లు ఎక్కువగా యూజ్ చేస్తున్నారు. ఈ అప్లికేషన్‌ల ద్వారా అభిమానులకు టచ్‌లో ఉండేందుకు చాలా మంది సెలబ్రిటీలు ప్రయత్నిస్తున్నారు. సినిమా, టీవీ స్టార్‌లే కాదు క్రికెటర్‌లూ కంటెంట్ క్రియేటర్‌లుగా మారుతున్నారు. ఇప్పటికే చాలా మంది పాపులర్ ప్లేయర్‌లు యూట్యూబ్ ఛానెల్స్ స్టార్ట్ చేశారు. తాజాగా ఈ లిస్టులో టీమ్ ఇండియా, ముంబయి ఇండియన్స్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కూడా చేరాడు. తాజాగా ఈ విషయాన్ని బుమ్రా ట్విట్టర్ ద్వారా షేర్ చేసుకున్నాడు. శుక్రవారం బుమ్రా చేసిన ట్వీట్‌లో 'అందరికీ హాలో, నేను నా సొంత యూట్యూబ్ ఛానెల్ స్టార్ట్ చేశానని చెప్పడానికి వచ్చాను. మీరు ఇంతకు ముందు ఎప్పుడూ చూడని కంటెంట్‌ను అందించబోతున్నాను. నా జీవితంలోకి ఆసక్తికర అంశాలను మీతో పంచుకుంటాను. కాబట్టి కింది లింక్‌ను క్లిక్ చేసి, నా జర్నీలో నాతో చేరండి. మిమ్మల్ని అక్కడ కలుస్తా.' అని పేర్కొన్నాడు.




## రీల్




# విశ్వక్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి టీజర్

టాలీవుడ్ యంగ్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ఈ చిత్రంను మే 17, 2024న వరల్ వైడ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం టీజర్‌ను రేపు రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా టీజర్ లాంఛ్ ఈవెంట్ కి సంబంధించిన వివరాలను మేకర్స్ వెల్లడించారు. ఎఎంబిసిని మాస్, స్క్రీన్ 1, హైదరాబాద్ లో రేపు సాయంత్రం 4:01 గంటలకి ఈ ఈవెంట్ ప్రారంభం కానుంది. చిత్ర యూనిట్ రిలీజ్ చేసిన సరికొత్త పోస్టర్ ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ టీజర్ కట్ చాలా బాగా వచ్చినట్లు సమాచారం. ఈ చిత్రంలో హీరో విశ్వక్ సేన్ లంకల రత్న అనే పాత్రలో నటిస్తున్నారు. నేహ శెట్టి హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లపై నిర్మిస్తున్నారు. అంజలి కీలకపాత్రలో నటిస్తుండగా, యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

## తెలంగాణ గవర్నర్‌తో హనుమాన్ హీరో, దర్శకుడు

మన టాలీవుడ్ సినిమా హిస్టరీ లోనే సంక్రాంతి బరిలో వచ్చిన ఓ సినిమా భారీ సక్సెస్ ని అందుకున్నది ఏదన్నా ఉంది అంటే అది యంగ్ హీరో తేజ సజ్జ అలాగే దర్శకుడు ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో చేసిన చిత్రం హనుమాన్ ఒక్కటే అని చెప్పాలి. భారీ వసూళ్లు సాధించి తెలుగు సినిమా దగ్గర చెరగని ముద్ర వేసుకున్న ఈ సినిమా విజయం తర్వాత కూడా ఇంకా ఏదొక అంశంలో వినిపిస్తూనే ఉంది. మరి తాజాగా మరోసారి హను మాన్ ద్యూయో వైరల్ గా మారారు. తెలంగాణ నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ని కలిశారు. మరి తమ హనుమాన్ ప్రతిమని వారికి అందజేసి కాసేపు ముగ్గురు కలిసి ముచ్చటించారు. మరి మూమెంట్ పిక్స్ బయటకి రాగా స్పెషల్ మూమెంట్‌గా ఇవి వైరల్‌గా మారాయి. ఇక ఇప్పుడు తేజ సజ్జ భారీ చిత్రం మిరాయ్, జై హనుమాన్ లతో బిజీగా ఉండగా ప్రశాంత్ వర్మ జై హనుమాన్ అలాగే ఆక్టోపస్ సహా మరిన్ని సినిమాలతో బిజీగా ఉన్నాడు.





## 'ఆ ఒక్కటీ అడక్కు' మెలోడియస్ గా ఆకట్టుకుంటున్న 'హమ్మమ్మో' సాంగ్

అల్లరి నరేష్ హీరోగా ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా యువ దర్శకుడు మల్లి అంకం దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ కామెడీ యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ ఆ ఒక్కటీ అడక్కు. ఈ మూవీని చిలక ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజీవ్ చిలక నిర్మించగా గోపి సుందర్ సంగీతం అందించారు. ఇక ఈ మూవీ నుండి నేడు హమ్మమ్మో అనే పల్లవితో సాగే మెలోడియస్ సాంగ్ ని రిలీజ్ చేసారు. భాస్కరభట్ల రచించిన ఈ సాంగ్ ని యశస్వి కొండేపూడి అద్భుతంగా ఆలపించారు. అలరించే లిరిక్స్ తో ఆకట్టుకుంటున్న ఈ లిరికల్ మెలోడియస్ సాంగ్ కి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ తో అందరిలో మంచి అంచనాలు ఏర్పరిచిన ఆ ఒక్కటీ అడక్కు మూవీ మే 3న గ్రాండ్ గా ఆడియన్స్ ముందుకి రానుంది.

## అనంతనాగ్-రాజౌరి ఎన్నిక వాయిదా వద్దు..

### ఇసికి మాజీ సిఎంల లేఖ

**శ్రీనగర్:** మూడో విడత లోక్‌స్భ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జమ్మకశ్మీర్‌లోని అనంతనాగ్–రాజౌరి నియోజకవర్గంలో జరగాల్సిన ఎన్నికలను వాయిదా వేయనున్నారనే ఊహాగానాల మధ్య ఎన్నికల కమిషన్‌కు నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా, పిడిపి అధ్యక్షురాలు మెహబాబూ ముఫ్తీ లేఖ రాశారు. ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేయవద్దని ఈసీకి ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులైన ఒమర్, మెహబూబా వేర్వేరు పత్రికా ప్రకటనల్లో ఇసికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని తెలియజేశారు. వాతావరణ ప్రతికూలత కారణంగా ఎన్నికలను వాయిదా వేయాలని కొన్ని పార్టీలు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశాయి. ఈ క్రమంలో జమ్ముకశ్మీర్ చీఫ్ సెక్రటరీ అటల్ డుల్లూ, చీఫ్ ఎలక్టోరల్ అధికారని ఇసి నివేదిక కోరింది. ఈ క్రమంలో ఎన్నికలను వాయిదా వేస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఎన్నికల వాయిదా నిర్ణయాన్ని ఇసి తీసుకోరాదని ఒమర్ అబ్దుల్లా శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. వాయిదా డిమాండ్ అన్ని పార్టీల నుంచి వచ్చినది కాదని, అదీగాక పోటీలో లేని కొందరు వ్యక్తులు ఇసిని ఎన్నికల వాయిదా కోరారని చెప్పారు. తమిళనాడు, లేదా వేరే రాష్ట్రంలోని నియోజకవర్గాల గురించి తాను ఇసికి లేఖ రాస్తే వాళ్లు నోటీసు ఇస్తారా? అని ప్రశ్నించారు.

**పార్లమెంటుకు రాకుండా చేసేందుకే: మెహబూబా:** అనంతనాగ్–రాజౌరీలో ఎన్నికలు వాయిదాకు కొందరు ప్రయత్నిస్తున్నారనే వార్తలపై మెహబూబా ముఫ్తీ మండిపడ్డారు. వాళ్లంతా తనపై ముఠా కట్టారని, తనను పార్లమెంటులో చూడకూడదని వారు కోరుకుంటున్నారని ఆరోపించారు. పార్టీలు, మతాలకు అతీతంగా ప్రజలంతా తనకు మద్దతిస్తున్నారని, ఆ కారణంగానే ఎన్నికల వాయిదాకు, రిగ్గింగ్‌కు యోచన చేస్తున్నారని తన రాజకీయ ప్రత్యర్థులపై ఆమె విమర్శలు గుప్పించారు. ఎన్నికలు వాయిదా వేయడం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్తాయని, తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఆమె నిశ్చితాభిప్రాయం వ్యక్తం చేశారు. 1987 అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరగడం, మిలటరీని దింపడం వంటివి చోటుచేసుకున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్ ఎంతో కోల్పోవడంతో పాటు ఎన్నికల కమిషన్‌పై విశ్వాసం కూడా సన్నగిల్లిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఎలాంటి అడ్వెంచర్ (వాయిదా నిర్ణయం) చేయవద్దని ఆమె కోరారు.

**ఇసి నిర్ణయమే ఫైనల్: జితేంద్ర సింగ్:** కాగా, అనంతనాగ్‌రౌజౌరి ఎన్నికల రీషెడ్యూల్ అంశంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ను ప్రశ్నించగా, ఇసి స్వతంత్ర సంస్థ అని తెలిపారు. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి బిజెపి కట్టుబడి ఉంటుందని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం మే 7న మూడో విడత ఎన్నికల్లో భాగంగా అనంతనాగ్–రాజౌరి నియోజకవర్గంలో పోలింగ్ జరగాల్సి ఉంది. 21 మంది అభ్యర్థులు ఇక్కడి నుంచి పోటీలో ఉన్నారు.

## ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం : అమిత్ షా

**మధ్యప్రదేశ్ :** దేశంలో ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని అమలు చేస్తామని, ఇందుకు మోదీ గ్యారంటీ అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పోటీ చేస్తున్న గుణ నియోజకవర్గంలో శుక్రవారం నాడు ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పర్సనల్ లాను మరోసారి తీసుకువస్తామని ఉన్నదని, అంటే ముస్లిం పర్సనల్ లాను తీసుకురావాలని వారికి ఉన్నదని, అలాగే ట్రిపుల్ తలాఖ్‌ను కూడా అని ఆరోపించారు. దేశం షరియా(ముస్లిం చట్టం) ప్రకారం నడవాలా? అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ బుజ్జగింపు కోసం ఏదంటే అది చేస్తారని, తాము ఉన్నంత వరకు పర్సనల్ లాను తీసుకురానివ్వబోమని, ఈ దేశం ఉమ్మడి పౌర స్మృతి ఆధారంగానే నడుస్తుందని, ఇప్పటికే దీనిని ఉత్తరాఖండ్‌లో అమలు చేశారని తెలిపారు. ప్రధాని మోదీ దేశంలో ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని నిర్మూలించారని అన్నారు.

# మోడీలో భయం కనిపిస్తోంది...

### త్వరలో వేదికలపై కన్నీళ్లు పెట్టుకోవచ్చు : రాహుల్‌గాంధీ



**విజయపుర :** కాంగ్రెస్ పార్టీపై పదే పదే విమర్శలు చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనలో భయం కనిపిస్తుందన్నారు. కొన్ని రోజుల తరువాత బహుశ వేదికలపైనే కన్నీళ్లు కాడా కారుస్తారేమోనని ఎద్దేవా చేశారు. శుక్రవారం రాహుల్‌గాంధీ విజయపురిలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఇటీవలి కాలంగా మోదీ చేస్తున్న ప్రసంగాలు చూస్తుంటే ఆయనలో భయం కనిపిస్తుందని చెప్పారు. 'మంగళసూత్రాలు, సంపద పునఃపంపిణీ, వారసత్వపన్ను' సహా వివిధరకాల అంశాలపై కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని మోదీ ఇటీవల ఎన్నికల ప్రచారంలో మాట్లాడాతున్నారన్నారు. వాటి ద్వారా వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలుస్తున్నారని దుయ్యబట్టారు. కొన్నిసార్లు చైనా, పాకిస్థాన్ గురించి మాట్లాడుతూ, మరికొన్ని సార్లు ప్లేట్లు వాయించాలని అంటారు, ఇంకొన్నిసార్లు మెబైల్ ఫోన్లలో టార్చిలు వేయాలని కోరుతాడని వ్యంగ్యానించారు. పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుల వంటి సహా దేశంలో నాలుగు కోట్ల సమస్యలు ఉన్నాయని రాహుల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మాత్రమే నిరుద్యోగాన్ని నిర్మూలిస్తుందని, ధరల పెరుగుదలను నియంత్రిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. మోదీ మాత్రం పేదల నుంచి డబ్బులు దోచుకుంటున్నారన్నారు. కొంత మందిని బిలియనీర్లను చేస్తున్నారన్నారు. దేశంలో 70 శాతం జనాభా వద్ద ఉన్న సంపద సమానంగా 22 మంది ఉందన్నారు. కేవలం ఒకశాతం మంది దేశంలోని 40 శాతం సంపదను నియంత్రిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న పథకాలతో దళితులు, ఒబిసిలు, గిరిజనులు, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సందనంతా మోదీ బిలియనీర్లకు దోచిపెడుతున్నారని, పేదలకు కొద్దిమొత్తం మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 'అగ్నివీర్' పథకాన్ని రద్దు చేస్తామని యువతకు రాహుల్ హామీనిచ్చారు. యువత నుంచి ఆర్మీ ఉద్యోగాలను మోదీ దోపిడీ చేశారన్నారు. దీంతో ఇండియన్ ఆర్మీ, సైనికులను తీవ్ర అవమానించారన్నారు. ఈ నేపథ్యంలో ఈ పథకాన్ని రద్దు చేస్తామని చెప్పారు. జిఎస్‌టి అమలుపై రాహుల్ విరుచుకుపడ్డారు. అదే విధంగా కర్నాటకకు అన్యాయం చేశారన్నారు. జిఎస్‌టిలో కాంగ్రెస్ మార్పులు తీసుకువస్తామన్నారు. కర్ణాటకలో బిజెపి, జెడిఎస్ కలిసి లోక్‌సభ ఎన్నికల బరిలో దిగాయి. కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేస్తోంది. ఎక్కువ సీట్లు దక్కించుకోవాలని కాంగ్రెస్, బిజెపి పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. బిజెపి తరఫున ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రచారం చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డికె శివకుమార్ అన్నీ తామై ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

## భార్య తెచ్చిన కట్నంపై భర్తకు హక్కు ఉండదు..

### తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** భార్య స్త్రీ నిధి (కట్నం)పై భర్తకు హక్కు ఉండదని, ఆపద సమయంలో దానిని ఉపయోగించినప్పటికీ, భార్యకు తిరిగి ఇచ్చేయాలని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఓ కేసుపై గురువారం విచారించిన ధర్మాసనం మహిళ కోల్పోయిన బంగారానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని భర్తను ఆదేశించింది. ఇంతకు ఏం జరిగిందంటే.. కేరళకు చెందిన ఓ మహిళ తనకు పుట్టింటివారు ఇచ్చిన 89 గ్రాములు బంగారాన్ని భర్త తన అవసరాల మేరకు వాడుకున్నారని ఆరోపిస్తూ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. పెళ్లయిన తొలి రాత్రే భర్త తన నగలన్నీ తీసుకుని ఆయన తల్లికి అందజేశాడని.. కారణం అడిగితే జాగ్రత్తపరచడానికి అని చెప్పి.. తన హక్కుల్ని పూర్తిగా లాక్కున్నారని భార్య ఆరోపించింది. ఆ బంగారాన్ని అప్పటికే వారి కుటుంబానికి ఉన్న అప్పులు కట్టడానికి వినియోగించారని ఆమె తెలిపింది. బంగారం గురించి అడిగితే భర్త, అత్త బెదిరించేవారని 2011లో ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. భర్త చేసింది తప్పేనని ఫ్యామిలీ కోర్టు తీర్పు వెలువరించింది. దీంతో భర్త కేరళ హైకోర్టు మెట్లెక్కాడు. అయితే హైకోర్టు భర్తకు అనుకూల తీర్పు ఇచ్చింది. ఆమె నగలను భర్త దుర్వినియోగం చేసినట్లు నిరూపితం కాలేదని తెలుపుతూ భార్య పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో భార్య సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఈ క్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారించి తీర్పు వెలువరించారు. 'కట్నం ఉమ్మడి ఆస్తి రాదు. ఆమెకు సొంతంగా సంక్రమించిన ఆస్తి, నగలు, ధనాన్ని భర్త ఏ అవసరానికి వాడుకోరాదు. వాడుకుంటే తప్పనిసరిగా ఆమెకు తిరిగి ఇవ్వాలి. భార్యకు పెళ్లికి ముందు కానీ , పెళ్లి దశలో కానీ , అప్పగింతలు లేదా ఆ తరువాతి దశల్లో ఏ రూపంలో అయినా పుట్టింటి నుంచి ధనం, ఆస్తి అందితే అది పూర్తిగా భార్యకే చెందుతుంది. భార్య దాన్ని ఇష్టానుసారంగా వాడుకునే అవకాశం ఉంటుంది.. కానీ భర్తకు ఎలాంటి హక్కులు ఉండవు. కష్టాల్లో భర్త వాడుకున్నా మళ్లీ తిరిగి భార్యకకు ఇచ్చేయాలి. వివాహ బంధాలకు సంబంధించిన విషయాలను సూటిగా చెప్పలేం. బంగారాన్ని వాడుకుని తిరిగి ఇవ్వనందుకు భర్త రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

## నోటా పైచేయి సాధిస్తే ఏం చేస్తారు?

### ఇసిని ప్రశ్నించిన సుప్రీం

**న్యూఢిల్లీ:** జరిగినప్పుడు ప్రజలు అభ్యర్థులకు ఓటు వేయకుండా నోటా (నన్ ఆఫ్ ఎబౌ) బటన్‌నే నొక్కి తీర్పు చెబితే అలాంటి పరిస్థితుల్లో మళ్ళీ పోలింగ్ నిర్వహిస్తారా? అని సుప్రీంకోర్టు భారత ఎన్నికల సంఘాన్ని సంజాయషీ కోరింది. దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరింది. నోటా విషయంలో దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం ప్రస్తావిస్తూ సదరు పిటిషనర్ సందేహం తీర్చాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించింది. రచయిత, సాంఘిక కార్యకర్త, మోటివేషనల స్పీకర్ శివ్ ఖేరా ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. 2013లో సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో నోటా ఆప్షన్‌ను కూడా జత చేర్చారు. ఖేరా తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ చేసిన విజ్ఞప్తిని ప్రధాన్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసన పరిగణనలోకి తీసుకున శుక్రవారంనాడు కేంద్ర ఎన్నికల సంఘానికి ఈ సంజాయి:షీ నోటీసు ఇచ్చింది. ''మేం నోటీసు ఇచ్చాం, వారు ఏం చెబుతారో చూద్దాం'' అని చంద్రచూడ్ అన్నారు.

## అమెరికా పోలీసు కాల్పులలో భారతీయ సంతతి వ్యక్తి మృతి

**న్యూయార్క్:** ఒక మహిళతోపాటు ఇద్దరు పోలీసు అధికారులను తన వాహనంతో ఢీకొట్టి తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించిన భారతీయ సంతతికి చెందిన ఒక 42 ఏళ్ల వ్యక్తి పోలీసు కాల్పులలో మరణించాడు. తన రూమ్ మేట్‌గా ఉన్న మహిళపై కారుతో దాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సచిన్ సాహును అరెస్టు చేసేందుకు శాన్ ఆంటోనియో పోలీసులుఏప్రిల్ 21న షేవియల్ హైట్స్‌లోనిఅతని ఇంటి వద్దకు వెళ్లారు. పోలీసులను చూసి తప్పించుకుని పారిపోయే ప్రయత్నంలో వారిని తన కారుతో ఢీకొట్టాడు. టైలర్ గర్నర్ అనే పోలీసు అధికారి జరిపిన కాల్పులలో సాహు అక్కడికక్కడే మరణించాడు. అతని వద్ద తీవ్ర గాయాలతో ఉన్న ఒక 51 ఏళ్ల మహిళను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. గత కొన్ని సంవత్సరాలు సాహు బైపోలార్ వ్యాధితో బాధపడుతున్నాడని, అతనికి స్కిజోఫ్రీనియా లక్షణాఉ కూడా ఉన్నాయని సాహు మాజీ భార్య లీ గోల్డ్‌స్టిన్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. తనకున్న వ్యాధి ఏమిటో అతనికి అర్థం కాదని, అతనికి మాటలు వినిపిస్తాయే తప్ప తన చుట్టూ ఏంజరుగుతోందో తెలుసుకోలేడని ఆమె చెప్పారు. తాను చాలా ఏళ్లుగా విడిగా ఉంటున్నట్లు ఆమె తెలిపారు.

## పెళ్లి వేడుకలో ఘోర అగ్నిప్రమాదం

### ఒకే కుటుంబంలో ఆరుగురు మృతి

**పాట్నా/దౌసా :** బీహార్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. దర్భంగా ప్రాంతంలో జరిగిన ఓ వివాహ వేడుకలో మంటలు చెలరేగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసలు ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల సహాయంతో మంటలను అదుపుచేశారు. బాణసంచా కాల్చడం వల్ల చెలరేగిన మంటలు వెంటనే సిలిండర్, డీజిల్ స్టాక్‌లోకి వ్యాపించినట్లు సమాచారం. అనంతరం భారీ పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. బహెరా పోలీస్ స్టేషన్‌లోని ఆంటోర్ గ్రామంలో ఛగన్ పాశ్వాన్ కుమార్తె వివాహ వేడుక జరిగింది. వేడుక కోసం టెంట్ ఏర్పాటు చేసి, బస బోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం పెళ్లి ఊరేగింపు వచ్చింది. ఈ క్రమంలో భారీగా బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో టెంట్‌కు నిప్పు అంటుకుంది. దీంతో అక్కడే ఉంచిన సిలిండర్లు, డీజిల్‌కు మంటలు వ్యాపించి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందారు. మూడు పశువులు కూడా మరణించాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు స్థానికులతో కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనపై దర్భంగా జిల్లా మేజిస్ట్రేట్ రాజీవ్ రోషన్ స్పందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలు అన్వేషించడానికి ఒక బృందాన్ని కూడా ఘటనాస్థలికి పంపించామని తెలిపారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

**రోడ్డు పక్కన నిద్రిస్తున్న వారిపైకి దూసుకెళ్లిన కారు– ముగ్గురు మృతి**

రోడ్డు పక్కన నిద్రిస్తున్న 11మందిపై కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతి చెందారు. మిగతా ఎనిమిది మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఈ ఘటన రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మహ్వా పట్టణంలోని ఓ మురికివాడలో బాధితులు నివసిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల సమీపంలోని రోడ్డు పక్కన నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో వేగంగా ఓ కారు వారి పైనుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. ఎనిమిది మంది గాయపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన వారిలో ప్రాథమిక చికిత్స తర్వాత ఇద్దరు డిశ్చార్జ్ అయ్యారని, మరో ఆరుగురిని జైపుర్‌లోని ఎస్ఎంఎస్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు మహ్వా ఎస్ఐ అజయ్ సింగ్ తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నామన్న అజయ్ సింగ్, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.